మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఫ్రెంచ్ ఎన్నికల్లో ప్రజల మేధో విజయం 04

సంపుటి 07, సంచిక: 222 | శనివారం | 13-07-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



సిఎం సమక్షంలో చేరిక

హస్తం పార్టీలో 8కి పెరిగిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య

త్వరలోనే మరి కొందరు

ఆశలు వదులుకున్న బిఆర్ఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో ఎంఎల్‌ఎల చేరికల పరంపర కొనసాగుతోంది. తాజాగా బిఆర్ఎస్ రాజేంద్రనగర్ ఎంఎల్‌ఎ ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం ఆయనకు టిపిసిసి అధ్యక్షుడు, సిఎం ఎ.రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రకాగౌడ్‌తో పాటు ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కలిశారు. అయితే బిఆర్ఎస్ నేత కెటిఆర్ ఇంటికి వెళ్లి బుజ్జగించడంతో చివరి నిమిషంలో ఆయన కాంగ్రెస్‌లో చేరలేదు. లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఒక్క ఎంపి సీటును కూడా గెలవకపోవడంతో పాటు తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు.

### బుజ్జగిస్తున్నా... ఆగడం లేదు..

కాంగ్రెస్‌లో వలుసల జోరు కొనసాగుతోంది. ఒక్కొక్కరుగా బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు 'కారు' దిగుతున్నారు. ఎంఎల్‌ఎలు పార్టీ వీడకుండా బిఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. వలసలు ఆపేందుకు సాక్షాత్తూ బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రంగంలోనికి దిగి, బుజ్జగిస్తున్నప్పటికీ కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంఎల్‌ఎల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా బిఆర్ఎస్ రాజేంద్ర నగర్ ఎంఎల్‌ఎ ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఇప్పటి వరకు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎంఎల్‌ఎల సంఖ్య 8కి చేరింది. ఇటీవల బిఆర్ఎస్ సమావేశానికి హాజరుకాని గ్రేటర్ హైదరాబాద్ ఎంఎల్‌ఎలు శనివారం నుంచి వరుసగా కాంగ్రెస్‌లో పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 24 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈలోపే బిఆర్ఎస్‌కు చెందిన మెజార్టీ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బిఆర్ఎస్‌లో నలుగురు ఎంఎల్‌ఎలు మాత్రమే మిగులుతారని, 15 రోజుల్లో బిఆర్ఎస్‌ఎల్‌పిని సిఎల్‌పిలో విలీనం చేస్తారని ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది.

### ఆశలు వదులుకున్న బిఆర్ఎస్

పార్టీ నుంచి వలసలను ఆపడం కష్ట సాధ్యమని బిఆర్ఎస్ ఒక అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. బిఆర్ఎస్ వెంటనే ఉంటామని చెబుతున్న వారే చివరకు పార్టీని వీడడాన్ని బిఆర్ఎస్ ముఖ్యనేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఎంఎల్‌ఎలలో ఎవరు పార్టీని వీడే అవకాశాలు ఉన్నాయో ఇప్పటికే బిఆర్ఎస్ ఒక అంచనాకు వచ్చినట్టు తెలిసింది. దీంతో పార్టీ మారుతున్న ఎంఎల్‌ఎల నియోజకర్గంలో బలంగా ఉన్న, ద్వితీయ శ్రేణి నాయకులపైన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్టు సమాచారం. ఇందులోభాగంగానే ఆయా నాయకులతో సమావేశమై, వారికి బిఆర్ఎస్‌లో మంచి భవిష్యత్తు ఉంటుందని, సిట్టింగ్ ఎంఎల్‌ఎ పార్టీని వీడితే, ఆ స్థానాన్ని 'మీకే' కేటాయిస్తామని హామీనిస్తున్నట్టు తెలిసింది. ఎంఎల్‌ఎలతో పాటు పార్టీశ్రేణులు పార్టీ వీడకుండా కట్టడి చేసేందుకు చేస్తున్న బిఆర్ఎస్ ప్రయత్నాలు ఎంత వరకు సఫలీకృతం అవతాయో వేచిచూడాల్సిందే.

# సమర్థవంతంగా 'హైడ్రా'

హైదరాబాద్ విస్తరణకు అనుగుణంగా నిర్మాణం

విధి విధానాలపై మరింత అధ్యయనం

ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలి

సమీక్షా సమావేశంలో అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలను అందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 'హైడ్రా' వ్యవస్థాగత నిర్మాణం, విధి విధానాలపై మరింత అధ్యయనం, కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. జిహెచ్‌ఎంసితో పాటు, హెచ్‌ఎండిఎ, జల మండలి, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్తు, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకుని మరింత సమర్థవంతంగా హైడ్రా పని చేసేలా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఇప్పుడున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలని, ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలని సిఎం ఆదేశించారు. హైడ్రా ఏర్పాటు, సంబంధిత విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలీ కాట, జిహెచ్‌ఎంసి ఈవిడిఎం కమిషనర్ రంగనాథ్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు. కొత్త విభాగంలో ఏయే స్థాయి అధికారులుండాలి, ఎంత మంది సిబ్బంది ఉండాలి, ఏయే విభాగాలపై వీరిని డిప్యుటేషన్‌పై తీసుకోవాలి అనే అంశాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు. జిహెచ్‌ఎంసితో పాటు హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు వరకు తరువాయి 2లో



## 16న కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశం ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వశాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొంటారు. ప్రజా పాలన, ధరణి, వ్యవసాయ కాలానుగుణ పరిస్థితులు, ఆరోగ్యం రంగం, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళాశక్తి పథకం, విద్య రంగం సమస్యలు, శాంతిభద్రతలు, సెక్యూరిటీ సంబంధిత సమస్యలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం తదితర అంశాలపై సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులతో చర్చించనున్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్‌పిలు సమావేశం ఎజెండాలోని అంశాలపై పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆమె అధికారులకు సూచించారు. బదిలీల ప్రక్రియ, ఉన్నతాధికారుల బదిలీలు పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం.



## మందుబాబులకు జైలు

55 మందికి శిక్ష విధించిన కోర్టు

8 మంది డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు

ప్రజాపక్షం/హైదరాబాద్

మందుబాబులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో జూలై 1 నుంచి 10 వరకు డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడ్డ 55 మందికి కోర్టు జైలు శిక్ష విధించింది. సిటీ ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 10 రోజుల్లో 1,614 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. 992 కేసుల్లో ఛార్జ్ షీట్లు నమోదు చేసి, కోర్టులో సమర్పించామని, 55 మందికి కోర్టు జైలు శిక్ష విధించిందని చెప్పారు. ఒక రోజు నుంచి 15 రోజుల వరకు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. శిక్ష పడిన వారిలో 8 మంది డ్రైవింగ్ లైసెన్స్ లను 2 నుంచి 6 నెలల పాటు రద్దు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. మిగిలిన వారి నుంచి ఫైన్ల రూపంలో రూ. 21.36 లక్షలు జమ అయిందని వెల్లడించారు.

# పోలీసుల కాల్పులు

హైదరాబాద్‌లో అర్ధరాత్రి ఘటన

ప్రజాపక్షం/హైదరాబాద్



చిలకలగూడ, సైదాబాద్, హయత్‌నగర్ పోలీసు కాల్పులు మరవకముందే తాజాగా నాంపల్లిలో మరో ఘటన చోటుచేసుకుంది. అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను పోలీసులు ప్రశ్నిస్తున్న సమయంలో వారు పోలీసులపై గొడ్డలి, రాయితో దాడికి తెగబడ్డారు. ఇంతలో అప్రమత్తమైన పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. వీరిలో ఒకరు గాయపడగా పారిపోతున్న మరో వ్యక్తిని పోలీసుల వెంబడించి పట్టుకున్నారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి నాంపల్లి రైల్వే స్టేషన్ ముందు జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.ఉత్తరప్రదేశ్‌కు చెందిన పార్థీ ముఠా సభ్యులు అనీస్, రాజ్‌లతో పాటు మరో ఇద్దరు యువకులు గురువారం అర్ధరాత్రి 12 గంటలకు నాంపల్లి రైల్వే స్టేషన్ ముందు అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన పెట్రోలింగ్ పోలీసులు వారిని ప్రశ్నించారు. ఇంతలో వారిలో ఒకడు గొడ్డలితో పోలీసులపై దాడికి యత్నించాడు. మరోకడు రాళ్లతో దాడి మొదలు పెట్టాడు. మరో ఇద్దరు పారిపోసాగారు. ఈ హఠత్మరిణామంతో పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమై వారిపై కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పుల్లో అనీస్, రాజ్‌లు తరువాయి 2లో

## శ్రీ జయ కెమికల్ ఫ్యాక్టరీలో విషవాయువు లీక్

11 మంది కార్మికులకు అస్వస్థత : ఆరుగురి పరిస్థితి విషమం

నాలుగు నెలల్లో రెండుసార్లు ప్రమాదం -పట్టించుకోని పిసిబి అధికారులు

ప్రజాపక్షం/చౌటుప్పల్





రెండు నెలల క్రితం చౌటుప్పల్ మండలం లోని కొయ్యలగూడెం గ్రామ పరిధిలోని ఎస్వీ ల్యాబ్‌లో విషవాయువు లీక్ అయ్యి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన మరువక ముందే తాజాగా మండలంలోని దండుమల్కాపురం గ్రామ పరిధిలోని శ్రీజయ కెమికల్ పరిశ్రమలో విషవాయువు లీక్ అయ్యి పదకొండు మంది కార్మికులు అస్వస్థతకు గురైన ఘటన గురువారం రాత్రి జరిగింది. పదకొండు మందిలో ఆరుగురు తరువాయి 2లో



నైనీ బొగ్గు బ్లాకు ప్రారంభానికి సహకరించండి

ఒడిషా సిఎం మోహన్ చరణ్ మాంజీకి డిప్యూటీ సిఎం భట్టి వినతి

రోనాల్డ్ రోస్, ఎన్.బలరామ్‌తో కలిసి నైని బొగ్గు గనులను సందర్శన

03

## మోదీజీ.. ఆర్థికాంశాలపై దృష్టి పెట్టండి



కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్

**న్యూఢిల్లీ :** కనీస ఆర్థిక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి పెట్టాలని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడు ఖర్గే తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. వచ్చే బడ్జెట్‌పై కెమెరాల నీడలో సమావేశాలు పెడుతున్న ప్రధానమంత్రి, దేశ కనీస ఆర్థిక అవసరాలను పట్టించుకోవాలన్నారు. 'నరేంద్ర మోదీ జీ, మీ ప్రభుత్వం కోట్లాది ప్రజలను నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అసమానత అనే గుంతలో తోసేసి వారి జీవితాలను నాశనం చేసింది' అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెడుతూ నిరుద్యోగ రేటు 9.2 శాతానికి పెరిగడంతో యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. "20–24 వయసు ఉండే వారిలో నిరుద్యోగ రేటు 40 శాతానికి పెరిగింది. జాబ్ మార్కెట్‌లో యువతకు సంబంధించిన తీవ్ర సంక్షోభాన్ని స్పష్టం చేస్తుంద'ని ఖర్గే అన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, పెట్టుబడి ధరకు 50 శాతం కలిపి ఎంఎస్‌పి ఇస్తామన్న తరువాయి 8లో

## చైనా, రష్యాలపై నాటో అక్కసు



**వాషింగ్టన్ :** అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ముగిసిన నాటో 75వ వార్షికోత్సవ సమావేశాలలో చైనాపై నాటో అక్కసు వెల్లగక్కింది. మూడు రోజుల సమావేశాలకు హాజరైన 32 నాటో సభ్య దేశాలు 'నాటో డిక్లరేషన్'ను ప్రకటించాయి. పరిమితులు లేని భాగసామ్యం, రష్యా రక్షణ పరిశ్రమలకు పూర్తి స్థాయి మద్దతు ద్వారా ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యా యుద్ధానికి చైనా 'నిర్ణయాత్మక సహకారి'గా మారిందని నాటో విమర్శించింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యురాలిగా ఉన్న చైనా రష్యా యుద్ధ చర్యలకు అన్ని రకాల సామాగ్రిని, రాజకీయ మద్దతును నిలిపివేయాలని పిలుపునిచ్చిందిన. రష్యా రక్షణ రంగానికి ఉపయోగపడే ద్వివినియోగ సామాగ్రి, ఆయుధ భాగాలు, పరికరాలు, ముడిసరుకు సరఫరాను ఆపేయాలని పేర్కొంది. ఇటీవల ఐరోపాలోని అతిపెద్ద యుద్ధాన్ని చైనా ప్రోత్సహించవద్దని తెలిపింది. నాటోలోని మూడింట రెండొంతులు సభ్య దేశాలు జిడిపిలో 2 శాతం రక్షణ వ్యయానికి కట్టుబడడాన్ని నాటో స్వాగతించింది.

**తిప్పికొట్టిన చైనా**

నాటో వ్యాఖ్యలను చైనా తిప్పికొట్టింది. చైనా ముప్పు అని, ఘర్షణను, వైరాన్ని రెచ్చగొడుతుందని అని అతిగా ప్రచారం చేయడాన్ని నిలిపివేయాలని హెచ్చరించింది. ఉక్రెయిన్, రష్యా వివాదంలో చైనా తటస్థ పక్షంగా ఉందని, కానీ ఏకాకి అయిన రష్యా ఆర్థిక వ్యవస్థకు కీలకమైన జీవనాధారాన్ని అందించినప్పటి నుండి వాణిజ్యం పెరిగిందని పేర్కొంది. చైనా తరువాయి 2లో

## జూన్ 25న 'రాజ్యాంగ హత్యా దినం'

కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్

**న్యూఢిల్లీ :** ఎమర్జెన్సీ విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తన 'ఎక్స్' ఖాతాలో ప్రకటించారు. ఈమేరకు 1975లో ఎమర్జెన్సీ విధించిన రోజైన జూన్ 25న ఏటా 'రాజ్యాంగ హత్యా దినం' గా ప్రకటిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం నాడు గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

## జూన్ 4 'మోదీ ముక్తి దినం' : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** పతాక శీర్షికలను ఆక్రమించుకునే మరో కపట చర్యలో భాగంగానే జూన్ 25ను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ హత్యా దినంగా ప్రకటించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. గడిచిన పదేళ్ళలో అప్రకటిత ఎమర్జెన్సీని విధించిన ప్రధానమంత్రికి రాజకీయ, వ్యక్తిగత, నైతిక ఓటమిని జూన్ 4న భారత ప్రజలు అందించారని గుర్తు చేశారు. అందుకే జూన్ 4వ తేదీ చరిత్రలో 'మోదీ ముక్త్ దినం'గా నిలిచిపోతుందన్నారు. భారత రాజ్యాంగం, దాని సూత్రాలు, విలువలు, వ్యవస్థలపై ఇదే ప్రధాని క్రమానుగత దాడులకు పాల్పడుతున్నారని 'ఎక్స్' ఖాతాలో మండిపడ్డారు.

## కొండచరియలు విరిగిపడి నదిలోపడ్డ బస్సులు



65 మంది ప్రయాణికులు గల్లంతు : ఆచూకీలేని వారిలో ఏడుగురు భారతీయులు

**ఖాట్మండు:** నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున రెండు బస్సులపై కొండచరియులు విరిగిపడ్డాయి. దీంతో బస్సులు నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో ఏడుగురు భారతీయులు సహా మొత్తం 60 మంది ప్రయాణికులు గల్లంతయినట్లు భావిస్తున్నామని అధికారులు తెలిపారు. 65 మంది ప్రయాణికులు రెండు బస్సుల్లో వెళ్తుండగా చిట్వాన్ జిల్లాలోని నారాయణ ఘాట్–మగ్లింగ్ రోడ్డు వెంబడి ఉన్న సిమాల్టల్ ప్రాంతంలో కొండచరియలు విరిగి బస్సులపై పడడగా, అవి త్రిశూల్ నదిలో పడిపోయాయని మైరిపబ్లికా న్యూస్ పోర్టల్‌ను ఉటంకిస్తూ అధికారులు వెల్లడించారు. అయితే ఘటనను చిట్వాన్ జిల్లా ముఖ్య అధికారి ఇంద్రాదేవ్ యాదవ్ ధ్రువీకరించారు. ఖాట్మండుకు చెందిన ఏంజెల్ బస్సు, గణపతి డీలక్స్‌లు రాజధాని ఖాట్మండు నుంచి గౌర్‌కు వెళ్తుండగా, తెల్లవారుజామున 3.30 గంటలకు ప్రమాదం వాటిల్లినట్లు యాదవ్ పేర్కొన్నారు. ఖాట్మండుకు వెళ్తున్న బస్సులో 24 మంది ప్రయాణికులు, గౌర్‌కు వెళ్తున్న బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాద సమయంలో గణపతి డీలక్స్ బస్సులో నుంచి ముగ్గురు ప్రయాణికులు బస్సులో నుంచి దూకినట్లు ఖాట్మండు పోస్టు పేర్కొంది. గల్లంతయిన

## విశ్వాస పరీక్షలో ఓడిన ప్రచండ

నేపాల్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఓలీ సిద్ధం



**ఖాట్మండు:** మాజీ ప్రధాని కెపి శర్మ ఓలీ నేతృత్వంలోని సంకీర్ణ భాగస్వామి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్‌యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సిపిఎన్ యుఎంఎల్) మద్దతు ఉపసంహరించుకోవడంతో, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' శుక్రవారం పార్లమెంటులో విశ్వాస తీర్మానాన్ని కోల్పోయారు, ఈ పరిణామంతో, ఓలీ ప్రధానిగా ఎన్నికై, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. హౌస్ ఆఫ్ రిప్రజెంటెటివ్స్ (ప్రతినిధుల సభ/ హెచ్‌ఒఆర్)లో మొత్తం 275 మంది సభ్యులు ఉండగా, విశ్వాస తీర్మానాన్ని నెగ్గడానికి ప్రచండకు 138 ఓట్లు అవసరమయ్యాయి. మొత్తం 258 మంది సభ్యులు హాజరై, ఓటింగ్‌లోపాల్గొనగా, అతనికి అనుకూలంగా 63, వ్యతిరేకంగా 194 ఓట్లు వచ్చాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్‌మావోయిస్ట్ సెంటర్ (సిపిఎన్‌ఎంసి) చైర్మన్‌గా ఉన్న 69 ఏళ్ల ప్రచండ, 2022, డిసెంబర్ 25న ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రారంభం నుంచే ఆయన ప్రభుత్వం పలువ సమస్యలను ఎదుర్కొంటూ వచ్చింది. నాలుగు పర్యాయాలు విశ్వాస పరీక్షను నెగ్గిన ప్రచండ, ఐదోసారి ఓటమిని చవిచూశారు. ఆయనకు మద్దతనిచ్చిన సిపిఎన్ తరువాయి 8లో







# కరువు కోరల్లో సెంట్రల్ ఆఫ్రికా




**హరారే:** సెంట్రల్ ఆఫ్రికా సమాఖ్య దేశాలు కరువు కోరల్లో చిక్కుకొని అల్లాడుతున్నాయి. విపరీతమైన ద్రవ్యోల్బణంతో అల్లాడిపోయిన జింబాబ్వే, మలావి, జాంబియా దేశాలతో కూడిన ఈ ప్రాంతం కోలుకుంటున్న సమయంలోనే అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు దారుణంగా దెబ్బ తీశాయి. యావత్ ప్రపంచంతోపాటు కరోనా కాటుకు చిక్కాయి. ఇప్పుడు తీవ్రమైన కరువు కోరల్లో చిక్కి అల్లాడుతున్నాయి. నాటి ఉత్తర రొడిషియా, దక్షిణ రొడిషియా, న్యాసాలాండ్ కలిపి 1953లో ది ఫెడరేషన్ ఆఫ్ ఆఫ్రికాగా ఏర్పడ్డాయి. ఈ ఫెడరేషన్ 1963 వరకూ కొనసగింది. అనంతర కాలంలో ఉత్తర రొడియా జింబాబ్వేగా, దక్షిణ రొడిషియా జాంబియాగా, న్యాసాలండ్ మలావీగా అవతరించాయి. సెంట్రల్ ఆఫికన్ ఫెడరేషన్ ఏర్పడింది. ఇప్పుడు ఈ మూడు దేశాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడలేకపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఈ దేశాలను కరువు ఊబిలోకి నెట్టేస్తున్నాయి. తాగు నీరు దొరకడం కూడా కష్టంగా మారిన పరిస్థితుల్లో సాగు నీటి వనరులు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఒకప్పుడు ఈశాన్య జింబాబ్వేలోని మారుమూల ప్రాంతంలో పంటలకు, పశువులకు అవసరమైన నీటిని అందించిన మడ్జి జిల్లా కపోతేసా ఆనకట్ట నీరులేక ఎండిపోయింది. ఇసుక మేటలతో ఎడారిని తలపిస్తున్నది. వర్షాధారంగా వేసిన పంటలు ఎండిపోతున్నాయి. పౌష్టికాహారం ఎలావున్నా, లక్షలాది మంది ప్రజలు రెండు పూటలా తిండి కూడా లేక పస్తులుంటున్నారు. ఈ సీజన్‌లో పంట దిగుబడులు భారీగా పతనంకాగా, వచ్చే సీజన్‌లో పంటల పరిస్థితి ఎలావుంటుందోనన్న ఆందోళన రైతులను వేధిస్తున్నది. సమృద్ధిగా వర్షాలు కురవకపోతే, వలస బాట పట్టడం తప్ప మరో మార్గమేదీ లేదన్నది వారి భయం. ఇప్పటికే చాలా మంది రైతులు వ్యవసాయ పనులను విడిచిపెట్టి, సమీపంలోని పట్టణాలు, నగరాలకు పని కోసం వలస వెళుతున్నారు. కొంత మంది ప్రతిరోజూ మైళ్ల కొద్దీ దూరం నడిచి దొరికిన పని చేసి, పూడగడుపు కొంటున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి పరిస్థితి మరీ అధ్వాన్నం. రోజు మూడు పూటల భోజనం ఎటూలేదు.. మూడు రోజులకు ఒక పూట భోజనం కూడా గగనంగానే మారింది. ఆహారం, నీరు వెతుకులాటలోనే రోజులు... నెలలు గడిచిపోతున్నాయి. ఇక, పౌష్టికాహార లోపాన్ని ఎంత తక్కువగా ప్రస్తావించుకుంటే అంత మంచిది. పోషకాహార లోపంతో ప్రభావితమైన దేశాల జాబితాలో జింబాబ్వే అగ్రస్థానంలో ఉంది. అక్కడ పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా, అందరూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. రోగాలు.. మరణాలు చాలా ఎక్కువ. జింబాబ్వే జనాభాలో దాదాపు సగం మంది, అంటే, 76 లక్షల మందికి పోషకాహారం అసలే లభించడం లేదని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక స్పష్టం చేసింది. జాంబియా, మలావీ దేశాలు కూడా ఇలాంటి సమస్యలే ఎదుర్కొంటున్నాయని ఐక్యరాజ్య సమితి స్పష్టం చేసింది. కరువుతో అల్లాడుతున్న ఈ దేశాలకు మానవతా సాయం అందించాలని ప్రపంచ దేశాలకు, ప్రత్యేకించి అభివృద్ధి చెందిన దేశాలను విజ్ఞప్తి చేసింది. కానీ, ఆదుకుంటున్న వారు లేరు. అందుతున్న సాయం లేదు. ఈ దుస్థితి కొనసాగితే, సెంట్రల్ ఆఫ్రికాలో ఆకలి కేకలు, పస్తులతో మరణాలు తీవ్రమవుతాయన్న ఐక్యరాజ్య సమితి హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తే, 'ఆకలి యుద్ధాలు' అనివార్యమవుతాయని పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పోలాండ్‌లవోని రిడుల్టోరీ బొగ్గుగనిలో కొంత భాగం కుప్పకూలడంతో ఒక కార్మికుడు మృతి చెందగా, 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఒక మైనింగ్ కార్మికుడు గల్లంతయ్యాడని వార్సా నుంచి విడుదల చేసిన ప్రకటనలో పోలిష్ కోల్ మైనింగ్ గ్రూప్ చీఫ్ లెస్‌జెక్ పేర్కొన్నారు. గని ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభమైందని ప్రకటించారు.

## యూరప్ సైనికీకరణతో
# మళ్ళీ ప్రత్యక్ష ప్రచ్ఛన్నయుద్ధం!



**మాస్కో :** యూరప్ సైనికీకరణ చర్యలపై రష్యా తీవ్రంగా స్పందించింది. ప్రమాదకరమైన దీర్ఘశ్రేణి ఖండాంతర క్షిపణులను రాబోయే రెండేళ్ళలో (2026 నాటికి) జర్మనీలో మోహరించాలని వాషింగ్టన్ డి.సిలో జరిగిన నాటో కూటమి శిఖరాగ్ర సమావేశంలో అమెరికా చేసిన ప్రకటనపై రష్యా అధికార ప్రతినిధి దీమ్రిత్రీ పెస్కోవ్ శుక్రవారం మండిపడ్డారు. దీనికి తగినవిధంగా రష్యా ప్రతీకార చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. ఇది మళ్ళీ ప్రత్యక్ష ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీస్తుందని కూడా ఆయన హెచ్చరిక చేశారు. ''ఉక్రేన్‌ను అడ్డం పెట్టుకుని క్రమంగా ప్రత్యక్ష ప్రచ్ఛన్న యుద్ధానికి నాటో కూటమి తెరలేపింది, ప్రత్యక్ష యుద్ధానికి రెచ్చగొట్టే చర్యలు ప్రారంభించింది, రష్యాను అణచివేసేందుకే అమెరికా ఈ విధమైన చర్యలకు దిగింది'' అని దీమ్రిత్రీ పెస్కోవ్ అన్నారు. రష్యాపై క్షిపణి దాడులు చేసేందుకు వీలుగా దగ్గరగా ఉండేవిధంగా జర్మనీలో దీర్ఘశ్రేణి క్షిపణులను మోహరించేందుకు అమెరికా నిర్ణయించింది. అదేసమయంలో ఉక్రేన్‌కు కొత్తగా మరింత యుద్ధసహాయం చేయాలని కూడా నాటో కూటమి శిఖరాగ్రసమావేశం ముగింపు సందర్భంగా కీలక ప్రకటన చేసింది. రష్యా, చైనా, ఉత్తర కొరియా, ఇరాన్ దేశాలు ఒక కూటమిగా ఏర్పడి ప్రపంచానికి ప్రమాదకరంగా మారాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చేసిన వ్యాఖ్య మరింతగా ఉద్రిక్తతలకు దారితీసింది. ఒకవేళ అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినాగానీ ఉక్రేన్‌కు ఎలాంటి ఆటంకం లేకుండా యుద్ధ సహాయం కొనసాగించేందుకు నాటో కూటమి దేశాలు వాషింగ్టన్ శిఖరాగ్ర సమావేశంలో ప్రతిజ్ఞ చేశాయి. ఐతే హంగరీ దేశం ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. చైనాకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా ఒక యుద్ధ కూటమిని తయారు చేయడాన్ని తాము అంగీకరించబోమని హంగరీ స్పష్టం చేసింది.

## పరాకాష్టకు బైడెన్ మతిమరపు

**వాషింగ్టన్ :** నాటో శిఖరాగ్ర సమావేశం ముగింపు ప్రసంగంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మతిమరపు పరాకాష్టకు చేరిందని మరోమారు రుజువైంది. ఉక్రేన్ అధ్యక్షుడు వ్లదిమీర్ జెలెన్స్కీను వ్లదిమీర్ పుతిన్‌గా పిలుస్తూ బైడెన్ సభకు పరిచయం చేశారు. అదే విధంగా అంతకుముందు అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ పేరు చెప్పడానికి బదులుగా డోనాల్డ్ ట్రంప్ పేరును ఉచ్చరించి అమెరికా ఉపాధ్యక్షుడుగా బైడెన్ చెప్పడం అందరికీ దిగ్భ్రాంతి కలిగించింది. తర్వాత బైడెన్ ఈ విషయంపై తాను తప్పుగా పేర్లు ఉచ్చరించానంటూ సభికులకు క్షమాపణలు చెప్పారు. కాగా,తాను చాలా ఫిట్‌గా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. అమెరికా న్యూరాలజిస్టులు చేసిన అనేక రకాల పరీక్షల్లో తాను చాలా ఫిట్‌గా ఉన్నట్లు రుజువైందని ఆయన చెప్పుకొచ్చా రు. ''ఐ యామ్ మోస్ట్ క్వాలిఫైడ్ టూ రన్ ఇన్ నెక్స్ట్ ఎలక్షన్స్'' అని బైడెన్ అన్నారు. అదే సమయంలో బ్రిటన్ కొత్త ప్రధానమంత్రి స్టార్మర్ కూడా బైడెన్‌ను కలిసి ఆయనతో సమావేశం జరిపారు. బైడెన్ ఫిట్‌గా ఉన్నారని, గుడ్ హెల్త్‌తో ఉన్నారని కితాబు ఇచ్చారు.




భారత మూలాలున్న వైద్యుడు డాక్టర్ జార్జి మాథ్యూస్‌కు దుబాయ్‌లో అరుదైన గౌరవం లభించింది. వైద్య రంగంలో అందించిన సేవలకుగాను దుబాయ్ రాజధాని అబుదాబిలోని ఒక మార్గానికి ఆయన పేరు పెట్టారు. ఘనంగా సత్కరించిన అధికారులు కృతజ్ఞతలు చాటుకున్నారు.

## సూడాన్‌లో శాంతికి యుఎన్ కృషి

**జెనీవా:** సైన్యం, పారామిలటరీ మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరాటం కారణంగా నిరంతర దాడులు, ప్రతిదాడులతో రక్తమోడుతున్న సూడాన్‌లో తిరిగి శాంతిని నెలకొల్పడానికి ఐక్యరాజ్య సమితి (యుఎన్) కృషి చేస్తున్నది. సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్స్ వ్యక్తిగత కార్యదర్శి రామ్టేన్ లమామ్రా ఈ రెండు వర్గాలను చర్చలకు ఆహ్వానించారు. ఈ విషయాన్ని యుఎన్ అధికార ప్రతినిధి స్టెఫాన్ దుజారెక్ న్యూయార్క్‌లోని సమితి ప్రధాన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. సూడాన్‌లో ఆర్మీ, పారామిలటరీ మధ్య పోరు కొనసాగడంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారని దుజారెక్ అన్నారు. అందుకే, ఇరు వర్గాల మధ్య చర్చల ద్వారా సయోధ్య కుదిర్చేందుకు సమితి ప్రయత్నిస్తున్నదని తెలిపారు. అయితే, తొలి రోజు చర్చలకు ఒక వర్గం మాత్రమే హాజరైనట్టు ఆయన పేర్కొన్నారు. కానీ, హాజరైంది మిలటరీ ప్రతినిధులా లేక పారామిలటరీకి చెందిన వారా అన్నది ఆయన వివరణ ఇవ్వలేదు. సూడాన్‌లో త్వరలోనే శాంతి నెలకొంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీసుల కాల్పులు (మొదటి పేజీ తరువాయి)

గాయపడ్డారు. వారి కాళ్లకు బుల్లెట్ తగిలింది. దీంతో వీరిద్దరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు ఘటనా స్థలం నుంచి పారిపోయారు. ఈ నలుగురు కూడా పార్ధీ ముఠాకు చెందిన దోపిడీ దొంగలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. పారిపోయిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారు కోలుకున్న తరువాత విచారిస్తే ఈ ముఠా హైదరాబాద్‌కు ఎందుకు వచ్చింది. నాంపల్లిలో ఎందుకు తిరుగుతున్నారు. దోపిడీలు ఏమైనా చేశారా అనే విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

**ఫైరింగ్ పోలీసింగ్... :** నేరాలను తగ్గించాలనే క్రమంలో పోలీసులు ఇక నుంచి కఠినంగా వ్యవహరించాలని ఇటీవలే పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. యూపి, బీహార్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన దోపిడీ దొంగల ముఠాలు నగరంలోకి ప్రవేశించాయని పోలీసులకు విశ్వసనీయ సమాచారం ఉంది. వరుసగా జరుగుతున్న దోపిడీలను ఎలాగైనా అరికట్టాలనే ఉద్దేశ్యంతో ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో యాంటీ డకాయిట్ టీమ్ బృందాలను రంగంలోకి దింపారు. వీరు రాత్రి వేళ్లలో పోలీసు స్టేషన్ పరధిలో గస్తీ కాస్తారు. ఈ క్రమంలోనే 15 రోజుల క్రితం సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో రాత్రి సమయంలో బైక్‌పై పారిపోతున్న చైన్‌స్నాచర్లపై పోలీసులు కాల్పులు జరపగా ఒక నిందితుడికి గాయాలు కాగా మరో నిందితుడిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఇదే తీరులో చిలకలగూడ పోలీసు స్టేషన్ పరిధిలో 17 రోజుల క్రితం బైక్‌పై అనుమానాస్పద స్థితిలో వెళ్తున నిద్దరు స్నాచర్లను పోలీసులు తనిఖీ చేస్తుండగా పోలీసులపై దాడి చేసి పారిపోయేందుకు యత్నించారు. వీరిపై కూడా పోలీసుల కాల్పులు జరపగా ఒకరు గాయపడ్డాడు. ఇక హయత్‌నగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఐదు రోజుల క్రితం కారులో వెళ్తున్న దోపిడీ దొంగల ముఠాను ఛేజింగ్ చేస్తూ పోలీసులు కాల్పులు జరపడంతో ఈ ముఠాను కూడా అదుపులోకి తీసుకున్నారు. వరుసగా జరుగుతున్న పోలీసుల కాల్పులతో నేరస్థుల్లో భయం పెరగడంతో ఇక్కడి నుంచి వారు మకాం ఎత్తేస్తారని పోలీసులు అంటున్నారు. నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, బాధితుల పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్‌గా ఉంటామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## 'హైడ్రా' (మొదటి పేజీ తరువాయి)

2 వేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పని చేయాల్సి ఉంటుందని, పని విభజనకు వీలుగా నగరంలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని నిర్దేశించాలని సిఎం సూచించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి చెప్పారు. విపత్తుల నిర్వహణతో పాటుగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ఆక్రమణలను తొలిగించటం, అక్రమ నిర్మాణాలు, నిబంధనలను పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, ప్రకటనల తొలిగింపు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్తు సరఫరాలో హైడ్రా కీలకంగా వ్యవహరించేలా విధులు అప్పగించాలని సిఎం ఉన్నతాధికారులను వివరించారు. హెచ్ఎండిఎ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగింపు, అపరాధ రుసుంవసూలు బాధ్యతను హైడ్రాకు బదలాయించాలని అన్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలని సిఎం అధికారులకు సూచించారు.

## నదిలోపడ్డ బస్సులు (మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికుల్లో ఏడుగురు భారతీయులు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని సంతోష్ ఠాగూర్, సురేంద్ర షా, అదిత్ మియాన్, సునిల్, షహనావాజ్ ఆలమ్, అన్సారీలుగా గుర్తిచంగా, మరో వ్యక్తిని ఇంకా గుర్తించలేదు. రోడ్డుపై పడిన శిథిలాలను తొలగిస్తున్నట్లు యాదవ్ తెలిపారు. కాగా, ఘటన పట్ల ప్రధాని పుష్పకమల్ దహల్ ప్రచండ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై మూడో కన్ను

### ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ అదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏచిన్న ఫంక్షన్ అయినా మద్యం వినియోగం పరిపాటి అయింది ఈ రోజుల్లో. అయితే ఫంక్షన్‌లో మద్యం వినియోగించాలంటే ముందుగా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి పొందాలి, దాంతో పాటు ఫంక్షన్ లో కేవలం ఎక్సైజ్ శాఖ నుంచి సరఫరా అయిన మద్యంను మాత్రమే వినియోగించాలి. అయితే చాల మంది ఎక్సైజ్ నుంచి అనుమతి పొందినా తూతూ మంత్రంగా మాత్రమే ప్రభుత్వ మద్యాన్ని వినియోగిస్తున్న పెద్ద మొత్తంలో మాత్రం తక్కువ ధరకు వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్) మద్యాన్ని వినియోగిస్తున్నారు. ఫంక్షన్స్‌లలో ఎన్‌డిపిఎల్ మద్యం వాడుతున్నట్లు అబ్కారీశాఖ దృష్టికి వచ్చింది. ఎన్‌డిపిఎల్ మద్యం వినియోగంపై గట్టి నిఘా పెట్టాలని ఎక్సైజ్ యంత్రాంగానికి ఉన్నతాధికారులు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్, నాటు సారా రవాణ, వినియోగం, తయారీపై ఉక్కుపాదం మోపుతున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ మరో అడుగు ముందుకు వేయాలన్నారు. ఏ చిన్న కార్యక్రమైన, దోతి ఫంక్షన్, బారసాలా, మ్యారేజ్ డేలు, పుట్టిన రోజులు, పిల్లల బర్త్‌డే లు, చెవులు శారీ ఫంక్షన్లు, సన్మానాలు, పదవి విరమణ కార్యక్రమాలు ఇలా ఒకటి కాదు రెండు కాదు వందల సంఖ్యలో శుభకార్యాయా లు ప్రతి ఫంక్షన్ హాళ్లలో జరుగుతున్నాయి. డబ్బులు ఉంటే చాలు అన్ని ఈవెంట్ నిర్వాహకులు చూసుకుంటారు. ప్రతి ఫంక్షన్ హాల్ బుకింగ్ నుంచి కార్యక్రమం అనంతరం జరిగే విందులో మందు వరకు అన్ని వారే సమకూర్చుతారు. ఫంక్షన్‌హాల్‌ల్లో జరిగే పంక్షన్లలో మద్యం వినియోగించుకోవడానికి ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

### ఈవెంట్‌లకు అనుమతి..

తెలంగాణలో పాత కొత్త జిల్లాలతో కలిపి 2023-24 సంవత్సరంలో జరిగిన ఫంక్షన్‌హాల్‌లో మద్యం వినియోగించుకోవడానికి 14,508 మంది అనుమతి తీసుకున్నారు. హై దారాబాద్‌లో ఎక్కువగా ఈవెంట్స్ జరిగా యి. ఒక్క హైదారాబాద్ డివిజన్‌లోని శంషాబాద్ ఎక్సైజ్ పరిధిలో 4729 ఫంక్షన్లకు ఎక్సైజ్ శాఖ అనుమతులు ఇచ్చింది. ఇదే తీరులో సరూర్‌నగర్ 2990 ఈవెంట్‌కు, మే డ్చల్‌లో 1873, మల్కాజ్గిరిలో 1522, హైదారాబాద్‌లో 790 అనుమతులు ఇచ్చారు. మిగిలిన అన్ని జిల్లాలో పది నుంచి వందలోపు అనుమతులు తీసుకున్నారు. 2022-23లో 13,565 ఫంక్షన్లలో మద్యం వినియోగానికి అనుమతులు తీ సుకున్నారు. 2024 సంవత్సరంలో ఒక్క మే నెలలోనే 847 అనుమతులు తీసుకున్నారు. ఈ మద్యం పర్మిట్ అనుమతులతో ఎక్సైజ్‌శాఖకు అదనపు ఆదాయంతో పాటు తెలంగాణ మద్యం అమ్మకాలకు గిరాకి పెరిగింది.ఈ నేపథ్యంలో ఎన్‌డిపిఎల్ మద్యం వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్ పేర్కొన్నారు.

### అందరిపై కేసులు నమోదుచేస్తాం: కమలాసన్‌రెడ్డి

ఫంక్షన్లలో ఎన్‌డిపిఎల్ వినియోగిస్తే అందారి పై కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. పంక్షన్ నిర్వహించే వ్యక్తి, మద్యన్నిసరపరా చేసిన వారిపై, ఈ మద్యన్ని వినియోగించిన ఫంక్షన్ హాల్ యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం వినియోగం అనుమతి ఉన్న పంక్షన్లపై ఎక్సైజ్, ఎన్ఫోర్స్ మెంట్ ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

## విషవాయువు లీక్
(మొదటి పేజీ తరువాయి)

కార్మికుల్లో సూర్యాపేట జిల్లాకు చెందిన నెలపట్ల రాంబాబు(33), నెల్లూరు జిల్లాకు చెందిన మల్లేల నాగబాబు(23),జార్ఖండ్‌కు చెందిన వెన్నిల లీల్ (25), తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జె.చిన్నబాబు(21),ఖమ్మం జిల్లాకు చెందిన ఎల్లమల్ల శ్రీనివాసరావు(41),యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన గిరిబాబు(30)ల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. కళ్లు ఎర్రగా మారి కంటి చూపు కనిపించకపోవడం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంది. హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వారికి చికిత్స జరుగుతున్నట్లు సమాచారం. ఈ సంఘటన బయటికి తెలియకుండా ఉంచి అస్వస్థతకు గురైన కార్మికుల బంధువులతో కంపెనీ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా రాజీ కుదురుచుకునే ప్రయత్నం చేసింది.

### కనీస సేఫ్టి పరికరాలు లేకుండానే పరిశ్రమను నడుపుతున్న యాజమాన్యం

శ్రీజయ కెమికల్ ల్యాబ్‌లో గత నాలుగు నెలల క్రితం గ్యాస్ లీక్ అయ్యి కార్మికులు అస్వస్థతకు గురైయ్యారు.ఈ పరిశ్రమలో ప్రమాదాలు నిత్యం జరుగుతున్న కూడ పరిశ్రమ యాజమాన్యం కనీసం కార్మికులకు సేఫ్టి పరికరాలను కూడ ఇవ్వడం లేదు. పరిశ్రమలో ప్రమాదాలు జరిగితే కనీస రక్షణ చర్యలు తీసుకోవడానికి సైతం సేఫ్టి పరికరాలు లేవు.పరిశ్రమలో పనిచేయడానికి వచ్చిన కార్మికులు భయాందోళనలో ఉంటూ పనిచేస్తున్నారు.

### కంపెనీ జరుగుతున్న ప్రమాదాలో ఎన్నో... బయటికి తెలిసేవి కొన్నే....

శ్రీజయ ల్యాబ్‌లో ప్రమాదాలు పెద్ద ఎత్తున జరుగుతున్న కూడ బయటి




ప్రపంచానికి తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా ఉండేలా పరిశ్రమ యాజమాన్యం వ్యవహరిస్తుంది. ప్రమాదాల్లో కార్మికులు మృతి చెందిన కూడ పోలీస్ కేసు కాదు.అసలు సమాచారమే బయటికి రాకుండా కార్మికుల బంధువులతో చర్చలు జరిపి డబ్బులు ఇచ్చి మమా అనిపిస్తుంది.

### కెమికల్ పరిశ్రమలపై చర్యలు తీసుకొని పిసిబి అధికారులు

కెమికల్ పరిశ్రమలు కనీస సేఫ్టి మేనేజ్‌మెంట్ పాటించకపోయిన,ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా పరిశ్రమలు నడుపుతున్న కూడ పిసిబి అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు మృతి చెందుతున్న కూడ అధికారులు పరిశ్రమలను తనీఖీ చేయకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు తీసుకోని పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రతి రోజు మండలంలోని ఎదో ఒక గ్రామం నుండి ప్రజలు కెమికల్ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేస్తున్న కూడ పిసిబి అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

### బాధిత కార్మికుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

గ్యాస్ లీక్ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు సూర్యాపేట జిల్లాకు చెందిన నెలపట్ల రాంబాబు భార్య నెలపట్ల గౌతమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంపై కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సిఐ వి.ఆశోక్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై దర్యాప్తు చేస్తామని అన్నారు.

# కుల గణనపై ప్రజల నాడి ప్రభుత్వానికి చెప్పాలి

### 14న కామారెడ్డి నుంచి సమగ్ర కుల గణన సాధన యాత్ర



**ప్రజాపక్షం / హైదరాబాద్:** కుల గణన అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజల నాడి పాలకులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బిసి సంక్షేమ సంఘం, బిసి కుల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చిరంజీవులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రసంగించారు. సమగ్ర కుల గణన సాధన యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ సమగ్ర కుల గణన అనే డిమాండ్ 1950 నుండి ఉందన్నారు. స్వాతంత్ర్యానికి కు ముందు ప్రతి పదేళ్లకు ఒక సారి ఈ కుల గణన నిర్వహించే వారని, 1950 నుండి ఈ కుల గణన చేపట్టలేదన్నారు. 1955లో కాకా కాలేకర్ కమిషన్ సిఫార్సులను కూడా పట్టించుకోకుండా పాలకులు కుల గణన చేయలేదని విమర్శించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినప్పుడే పాలకులు మాట వింటారని, తద్వారా తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 31వ తేదీ వరకు కామారెడ్డి నుండి కరీంనగర్ వరకు ఈ సమగ్ర కుల గణన సాధన యాత్ర జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి లో బిసి డిక్లరేషన్ ప్రవేశ పెట్టిందని, అందు కోసమే కామారెడ్డి నుండి ఈ యాత్ర ప్రారంభించి, ఈ ప్రభుత్వానికి గుర్తు చేస్తూ , అమలు చేసేలా ఒత్తిడి చేస్తామన్నారు. కుల గణన పూర్తయితేనే స్థానిక సంస్థలలో జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు దక్కుతాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఉన్న రిజర్వేషన్లు తగ్గించి బిసిల గొంతు నొక్కారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పూర్తి చేస్తే బిసిలందరు అండగా ఉంటారని జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు.

## చైనా, రష్యాలపై నాటో అక్కసు
(మొదటి పేజీ తరువాయి)

అంతర్గత రాజకీయాలలో జోక్యం చేసుకొని, ప్రతిష్టను దిగజార్చే చర్యలను నాటో ఆపేయాలని, ఇప్పటికే ఐరోపాలో సంక్షోభం సృష్టించిన నాటో ఆసియా పసిఫిక్‌లో గందరగోళం సృష్టించవద్దని కోరింది.

### ఉక్రెయిన్‌కు 4వేల కోట్ల యూరోల సాయం

ఏడాది లోగా ఉక్రెయిన్‌కు 4వేల కోట్ల యూరోల సహాయం చేయాలని నాటో నిర్ణయించింది. రాజకీయ, ఆర్థిక, మిలిటరి, మానవత్వ సహాయం కింద ఈ నిధులు ఖర్చు చేస్తారు. రష్యా దురాక్రమణను ఓడించేందుకు ఉక్రెయిన్‌కు మద్దతుగా సమర్థవంతమైన బలగాలను నిర్మించేందుకు నాటో నిబద్ధతతో ఉన్నట్లు పేర్కొంది. ఉక్రెయిన్ కోసం మిలిటరీ ఆయుధాల కొనుగోలు, విరాళాలు, మిలిటరీ సామాగ్రి రవాణా, నిర్వహణ ఖర్చు, మిలిటరీ శిక్షణ, తదితరాలకు నిధులను వినియోగించనున్నారు. మరోవైపు ఉక్రెయిన్‌కు ఎఫ్-16 యుద్ధవిమానాల సరఫరా గురించి కూడా అమెరికా నిర్ణయించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, దక్షిణా కొరియాతో అమెరికా సైనిక ఒప్పందం కుదుర్చుకుంది.

## నాపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు స్పష్టీకరణ**

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై అభియోగాలను స్పెషల్ ఇన్విస్టిగేషన్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఖండించారు. తనపై వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. దర్యాప్తు బృందానికి పూర్తిగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన అధికారులకు పంపిన ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. ఆ మెయిల్‌ను ఉటంకిస్తూ మీడియాలో వచ్చిన వార్తలను అనుసరించి, ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావు గత నెల 26వ తేదీన భారత్ రావాల్సి ఉంది. ఆ వెంటనే పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుంటారన్న వార్తలు వచ్చాయి. అయితే, ఆరోగ్యం సహకరించని కారణంగా, భారత్‌కు రావడం ప్రస్తుతానికి కుదరడం లేదని పేర్కొన్నారు. అయితే, దర్యాప్తు సంస్థలకు తన వంతు సహకారం అందిస్తానని, తెలిసిన ప్రతి విషయాన్ని వివరిస్తానని వివరించారు. వైద్యం కోసం తాను అమెరికాలో ఉన్నానని ఆయన ఇటీవల దర్యాప్తు అధికారికి ఒక లేఖ కూడా రాశాలు. పోలీస్ అధికారిగా తన విధులను నిర్వర్తిస్తున్నప్పుడు తాను ఎన్నడూ చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదని, ఆ విధంగా చేయమని ఎవరినీ ఆదేశించలేదని ప్రభాకర్ రావు అన్నారు. తన ఆరోగ్యం ఇంకా కుదుటపడలేదని, తనకు చికిత్స అందిస్తున్న వైద్యులు మరికొంతకాలం వారి పర్యవేక్షణలోనే ఉండాలని సూచిస్తున్నారని తెలిపారు. వైద్యుల సలహాలను నిర్లక్ష్యం చేస్తే, ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. తాను భారత్‌కు రాలేకపోతున్నప్పటికీ, దర్యాప్తు అధికారులకు పూర్తి సహకార్ని అందిస్తానని ఆయన చెప్పారు.

## గవర్నర్‌ను కలిసిన డిజిపి జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపిఎస్ అధికారి జితేందర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పూలగుచ్ఛం అందించారు.గవర్నర్ ఈ మేరకు డిజిపి జితేందర్‌ను అభినందించారు.

## అగమ్యగోచరంగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

సిఎంకు హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిషత్ పరిస్థితి ఆగమ్య గోచరంకావడం బాధాకరమని, విద్య, స్వయం ఉపాధి, వేద విద్యకు ప్రోత్సాహం కోసం అమలు చేసిన వివిధ పథకాలు ఆగిపోవడం విచారకరమని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి హరీశ్ రావు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, తద్వారా సంక్షేమ పరిషత్ ద్వారా అమలు చేసే పథకాలు నిలిచిపోయాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఎంతో మంది పేద బ్రాహ్మణులకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు నిధులను విడుదల చేయాలని, వార్షిక బడ్జెట్‌లో ఏటా వంద కోట్లు కేటాయించాలని, బ్రాహ్మణ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. వేద పాఠశాలల్లోని వేద పండితులకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.5 వేల గౌరవ వేతనాన్ని తక్షణం చెల్లించాలని, 75 ఏళ్లు పైబడిన వేద పండితులకు పంపిణీచేసే రూ.5వేల భృతి ఏడు నెలలుగా పెండింగ్ లో ఉన్నదని, భృతి నిధులన కూడా విడుదల చేయాలని కోరారు.

## 21న ఎఐసిసికి కురియన్ కమిటీ నివేదిక

తెలంగాణ నేతలతో ముగిసిన కమిటీ చర్చలు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాకపోవడంపై సమీక్షించేందుకు ఎఐసిసి ఏర్పాటు చేసిన కురియన్ కమిటీ తన నివేదికను ఈ నెల 21న కాంగ్రెస్ అధిష్టానానికి సమర్పించనుంది. కమిటీ నివేదికపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)లో చర్చించి భవిష్యత్‌లో పార్టీ కార్యాచరణపై నిర్ణయం తీసుకోనుంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పరిస్థితిపై సమీక్షిస్తున్న పి.జె.కురియన్ కమిటీ తెలంగాణ రాష్ట్రంలో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు, ఎన్నికల్లో గెలిచిన, ఓడిన అభ్యర్థులతో దఫదఫాలుగా చర్చలు జరిపింది. ఈ సమావేశాల్లో కురియన్‌తో పాటు కమిటీ సభ్యులు రకిబుల్ హసన్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఎన్నికల్లో గెలిచిన, ఓడిన నాయకులు తూర్పు జయప్రకాష్‌రెడ్డి (జగ్గారెడ్డి), మధు యాష్కీగౌడ్, సురేశ్ షెట్కార్, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, వంశీకృష్ణ, పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, వంశీచంద్ రెడ్డి, నీలం మధు, వి.రాజేందర్‌రావు, టి.జీవన్‌రెడ్డి, ఆత్రం సుగుణ తదితరులు కమిటీ ముందు తమ అభిప్రాయాలు తెలిపారు. ఎంఎల్ఎలు, నియోజకవర్గ ఇంచార్జీల అభిప్రాయాన్ని కూడా కమిటీ నమోదు చేసింది. ఇదిలా ఉండగా ఎన్నికల్లో పార్టీ నాయకుల మధ్య సమన్వయం, సహకారం లేదని ఎక్కువ మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు పార్టీ నాయకుల సమాచారం. కార్యకర్తలు కష్టపడినా నాయకుల తప్పిదాల వల్ల ఆశించిన ఫలితాలు రాలేదని వారు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న సాంప్రదాయబద్ధమైన ఓట్లను కూడా రాబట్టుకోలేకపోయామని, కొన్ని చోట్ల ఓట్ల పోలరైజేషన్ జరగలేదని, ఫలితంగానే తాము ఓడిపోయామని ఓడిపోయిన నాయకులు కమిటీ ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం తగిన చర్యలు తీసుకుని పార్టీ కోసం కష్టపడి ఎన్నికల్లో ఓడిపోయిన వారికి న్యాయం చేయాలని కమిటీ సూచించాలని వారు కోరినట్లు తెలిసింది.

## తల్లి లాంటి పార్టీని విమర్శించొద్దు

బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీ మారుతున్న నాయకులు బిఆర్ఎస్ నాయకత్వంపై విమర్శలు చేయడం సరికాదని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎంఎల్‌ఎలకు ఇష్టం లేకపోతే పార్టీ నుంచి పోవాలని, కానీ తల్లి లాంటి పార్టీని విమర్శించవద్దని సూచించారు. బిఆర్ఎస్ ఉండదని శాపనార్థాలు పెట్టడం మంచిది కాదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌ను లేకుండా చేయడం ఎవరితరం కా దన్నారు. రెండు ఎంపి సీట్లు ఉన్న బిజెపి ఇప్పుడు ఏస్థాయికి చేరుకున్నదని, కాంగ్రెస్‌కు పెద్ద సంఖ్యలో ఎంఎల్‌ఎలు లేకపోయినా అధికారంలోకి రాలేదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్‌కు, కెసిఆర్‌కు జైకొట్టిన వారే ఇప్పుడు పార్టీయే ఉండదన్నట్టు మాట్లాడుతున్నారన్నారు. బిఆర్ఎస్‌కు గొప్ప ఉద్యమ చరిత్ర ఉన్నదని, లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌తో పాటు పద్నాలుగు పార్టీలకు ఎంపి సీట్లు రాలేదని చెప్పారు. స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని, ఆ ఫలితాలు పార్లమెంటు ఎన్నికల తరహా ఉండబోవన్నారు. ఒక్క సారి ఎన్నికల్లో ఓడిపోగానే పార్టీల పని అయిపోతుందా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్‌ను రక్షించుకోవాలని ఆయన తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు.మాజీ ఎంఎల్ఎ డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లా డుతూ బిఆర్ఎస్ నుంచి దొంగలే బయటకు వెళ్తున్నారన్నారు.

# రైతుభరోసాతో పాటు సబ్సిడీలు

● పంటలకు అదనంగా బోనస్ ● కుటుంబం యూనిట్‌గా పదెకరాలకే రైతు భరోసా ఇవ్వండి ● క్యాబినెట్ సబ్ కమిటీకి రైతులు సూచన

ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి



'రైతు భరోసాతో పాటు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, యంత్రాలు ఇవ్వండి. పంటకు అదనంగా బోనస్ చెల్లించండి' అని రైతు భరోసాపై అభిప్రాయ సేకరణలో ప్రభుత్వానికి రైతులు సూచించారు. రైతుల విజ్ఞప్తిపై స్పందించిన ప్రభుత్వ రైతు భరోసా కమిటీ... రైతులు ఇచ్చిన సలహాలు, సూచనలు శాసన సభలో పెట్టి చర్చించి, చట్ట సభ ద్వారా తుది నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. రైతుల అభిప్రాయాలను మండలాలు, జిల్లాల వారీగా అడిగి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అత్యధిక మంది రైతులు ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, వారికి 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. కష్టపడి పంట పండించే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలే తప్ప వందల ఎకరాలు ఉన్న వారికి, ఇప్పటికే వెంచర్లు అయిన వాటికి, కొండలు, గుట్టలకు, ఇన్‌కం ట్యాక్స్ పరిధిలో ఉన్న వారికి రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ రైతు భరోసా అభిప్రాయ సేకరణలో శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులతో వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు రెవెన్యూ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక , ఎక్సైజ్ శాఖ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, ఉమ్మడి జిల్లా శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్లతో హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని పంట సహాయం ఏ విధంగా చేస్తే బాగుంటుంది అనే అభిప్రాయం స్వయంగా రైతుల నుండి తీసుకోవడానికి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు రైతుల ముందుకు వచ్చారని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతు సంక్షేమం కోసం స్పష్టమైన కార్యాచరణలో ముందుకు వెళ్లామన్నారు. కమిటీ మరో సభ్యుడు రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను రాజు చేయాలనే చిత్తశుద్ధితో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుందన్నారు. వంద ఎకరాల భూస్వాములకు, పోరంబోకు, కొండలు, గుట్టలు, లే అవుట్లు అయిన వాటికి సైతం రైతు భరోసా ఇవ్వాలా అని రైతులను అభిప్రాయం చెప్పాల్సిందిగా కోరారు. రాష్ట్ర ఆబ్కారి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడే నాటికి 8 లక్షల కోట్లు అప్పు ఉన్నదని, రైతులకు న్యాయం చేయాలని, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని , ఒక నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను రైతుల అభిప్రాయం మేరకు రూపొందించాలని రైతు భరోసా అభిప్రాయసేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 10 ఎకరాల కంటే తక్కువ ఉన్న రైతులు 90 శాతంకు పైగా ఉన్నారని వారందరిఇకి రైతు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లురవి మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సిన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని చెప్పారు. ఒక కుటుంబంలో 10 ఎకరాల భూమి ఉన్న రైతుల వరకు రైతు భరోసా ఇవ్వాలని మెజార్టీ రైతులు అభిప్రాయాన్ని తాను గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి, వంశీకృష్ణ, వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, ఫర్ణికరెడ్డి, అనిరుద్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, మహబూబ్‌నగర్ కలెక్టర్లు విజయెందిరా బోయి, వనపర్తి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ , నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ , నారాయణపేట కలెక్టర్ సీక్త పట్నాయక్ , అదనపు కలెక్టర్లు, రైతులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు హాజరయ్యారు.

# నైనీ బొగ్గు బ్లాకు ప్రారంభానికి సహకరించండి

ఒడిషా సిఎం మోహన్ చరణ్ మాంజీకి డిప్యూటీ సిఎం భట్టి వినతి

రోనాల్డ్ రోస్, ఎన్.బలరామ్‌తో కలిసి నైని బొగ్గు గనులను సందర్శన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదేళ్ల క్రితం 2015లో సింగరేణికి కేటాయించిన ఒరిస్సా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు గనుల్లో తవ్వకాలు చేపట్టడానికి సహకరించి అనుమతించాలని ఒడిస్సా సిఎం మోహన్ చరణ్ మాంజీని తెలంగాణ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు కోరారు. శుక్రవారం సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్‌లతో కూడిన అధికారుల బృందంతో ఒడిస్సా సిఎంను ఆ రాష్ట్ర సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నైని బ్లాక్‌లో సింగరేణి కార్యకలాపాల ప్రారంభానికి సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా నైనీ బొగ్గు బ్లాకుల విషయాలపై చర్చిస్తూ నైనీ బొగ్గు గనుల్లో తవ్వకాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సింగరేణికి బొగ్గు బ్లాకుల ఆవశ్యకతను వివరించారు. గత 2017 లోనే సింగరేణికి నైని గనులను కేటాయించారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలోనూ నాటి బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద జోషిని కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నామన్నారు. నాడు అందచేసిన వినతి పత్రాలను ఈ సందర్భంగా అందజేసిన డిప్యూటి సిఎం భట్టి తాజాగా తాడిచర్ల బ్లాక్, నైని బ్లాక్‌లకు సంబంధించిన అడ్డంకులను తొలగించాల్సిందిగా కోరారు. నైనీ బ్లాకులో గనుల తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనుమతులు సైతం వచ్చాయని డిప్యూటి సిఎం భట్టి ఒడిస్సా సిఎంకు వివరించారు. అటవీ, ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్య పరిష్కారం అయితే సింగరేణి తవ్వకాలను ప్రారంభిస్తుందని వివరించారు. నైని బ్లాక్‌లో తవ్వకాలు చేపట్టడం మూలంగా ఒరిస్సా రాష్ట్ర యువకులకు పెద్ద సంఖ్యలో ఉపాధి, పన్నుల రూపంలో రూ. 600 కోట్ల వరకు ఒరిస్సా సర్కార్‌కు ఆదాయం సమకూరుతుందని వివరించారు. దేశంలో విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించడానికి, ప్రభుత్వ సంస్థ సింగరేణి మనుగడకు నైనీ బొగ్గు గనులు అత్యంత ఆవశ్యకమని డిప్యూటి సిఎం వివరించారు. ఈ మేరకు అన్ని వివరాలతో కూడిన లేఖను ఒడిస్సా సిఎంకు అందజేశారు.

### గనుల తవ్వకానికి సహకరిస్తాం: ఒడిశా సిఎం

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క విన్నపంతో నైనీ బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాంజీ హామీ ఇచ్చారు. భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను వెను వెంటనే పరిష్కరించాలని స్థానికంగా ఉన్నత అధికారులకు ఒడిస్సా సిఎం ఆదేశాలు జారీ చేశారు. ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగే నైనీ బొగ్గు బ్లాకు సింగరేణి సంస్థకు గొప్ప వరం లాంటిది కావడం, 2015లో ఈ బొగ్గు బ్లాక్ ను సింగరేణి సంస్థకు కేంద్ర బొగ్గు శాఖ కేటాయించినప్పటికీ పలు రకాల అనుమతుల విషయంలో ఇప్పటివరకు తీవ్ర జాప్యం జరగడంతో పరిస్థితులు మారాయి. సింగరేణి సంస్థ నుండి ఎటువంటి లోపం లేకుండా ఎప్పటికప్పుడు కావలసిన పత్రాలను సమర్పించడం, చెల్లించాల్సిన సొమ్మును జమ చేయటం జరుగుతూనే ఉన్న ఈ నేపథ్యంలో ఒడిశా సిఎం సానుకూలంగా స్పందించడం గమనార్హం.

## పసికందును రూ.లక్షకు అమ్మేసిన తండ్రి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాతబస్తీలో 18 రోజుల తన పసికందును రూ.లక్షకు అమ్మేసిన తండ్రి ఉదంతం వెలుగు చూసింది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే బండ్లగూడ పోలీసులు కేసు ఛేదించి పసికందును తల్లికి అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాతబస్తీకి చెందిన అస్మాబేగం, ఎండి ఆసిఫ్ దంపతులు. వీరికి 18 రోజుల పాప ఉంది. జులాయిగా తిరిగే ఆసిఫ్ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాడు. తన జల్సాల కోసం డబ్బు లేకపోయేసరికి తన పాపను విక్రయించేందుకు నిర్ణయించుకున్నాడు. భార్యకు తెలియకుండానే పాపను రూ.లక్షకు విక్రయించాడు. తన పాప ఏదని ఎన్నిసార్లు అడిగిన భర్త సమాధానం చెప్పకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు 24 గంటల్లో పాపను రక్షించి తల్లికి అప్పగించారు. పాపను విక్రయించిన ఆసిఫ్‌తో పాటు కొనుగోలు చేసిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు.

## ఆర్‌టిసి పరిస్థితిని సిఎం సమీక్షించాలి

ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని టిజిఆర్‌టిసి పరిస్థితిని సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్, ట్రేడ్ సీనియర్ యూనియన్ నాయకులు ఎం.నాగేశ్వరరావు కోరారు. హక్కులు హరించబడి, స్వేచ్ఛ కోల్పోయి, చట్టాలు అమలు కాక, యాజమాన్యపు వేధింపులు, పెరిగిన పనిగంటలు, పనిభారంతో పాటు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై, సంస్థ పనితీరు, ఆర్థిక స్థితిపై రాష్ట్ర ప్రభుత్వ సహకారంపై, సమగ్రమైన సమీక్ష నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంస్థలో 2017 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 ఏప్రిల్ 30వ తేదీ వరకు ఉద్యోగ విరమణ చేసిన సుమారు 14 వేల మంది కార్మికులకు 2017 వేతన సవరణ బకాయిల తక్షణ చెల్లింపులకు చర్యలు చేపట్టాలని ఆయన ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

# నివేదికపై త్వరితగతిన పురోగతి సాధించాలి

అడ్డంకులను అధిగమించేందుకు ఇరిగేషన్ శాఖ బృందం కీలక సమావేశం

జలసౌధలో వివరణాత్మకమైన సమీక్ష





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతలలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళపై నివేదికను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో ఉన్న అడ్డంకులను అధిగమించేందుకుగాను ఇదే అంశంపై ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఓ అండ్ ఎం) బి.నాగేందర్ రావు, ఇఎన్‌సి రామగుండం కే.సుధాకర్ రెడ్డిలతో పాటు ఇతర నీటిపారుదల శాఖాధికారులతో శుక్రవారం జలసౌధలో సిఎస్ఎంఆర్ఎస్(సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్), సిడబ్ల్యుపి ఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్)ఎన్‌డిఎస్ఎ)జాతీయ ఆనకట్టల భద్రతా పర్యవేక్షణ సంస్థలకు చెందిన ప్రతినిధులు అమితాబ్ మీనా, మనీష్ గుప్తా, డాక్టర్ మందిరలు సమావేశమై సమీక్షించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీలో 7వ బ్లాక్ చుట్టూ వేసిన రింగ్ బండ్‌ను అధికారులు తొలగిస్తున్నారు. ఎగువ నుంచి ప్రాణహిత వరద వస్తున్న క్రమంలో ఆ వరద ఉధృతిపైనా అధికారులు చర్చించారు. గత ఏడాది అక్టోబర్ 21న బ్యారేజీ 7వ గేటులోని 19,20,21 పియర్లు పగుళ్లు తేలి వంతెనతో పాటు కుంగిన విషయాన్ని ఈ సందర్భంగా వారు చర్చించారు. ముఖ్యంగా ఎన్‌డిఎస్ఎ సూచన మేరకు గ్రౌంటింగ్, ఇసుక తొలగింపు, షీట్‌పైల్స్ అమరిక తగదితర మరమ్మతులకువీలుగా 7వ బ్లాక్‌లోకి వరదనీరు చేరకుండా దాని చుట్టూ రింగ్ బండ్ నిర్మించనున్నారు. గత వారం పది రోజులుగా మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో బ్యారేజీకి ప్రాణహిత వరద తాకిడీ రోజు రోజుకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే రింగ్ బండ్‌ను తొలగించాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు. రింగ్ బండ్‌ను పొక్లోయినర్లతో తవ్వించి టిప్పర్ల ద్వారా మెటీరియల్‌ను బయటకు తరలించనున్నారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో గోదావరిలో ఉన్న రోడ్లపై సైతం అధికారులు ఆలోచిస్తున్నారు. ఇలా పలు అంశాలపై చర్చించిన అధికారులు అంతిమంగా కాళేశ్వరం ఎత్తిపోతలపై మధ్యంతర నివేదికను త్వరితగతిన వేగవంతం చేయడానికి గాను చర్యలు తీసుకోనున్నారు. మరీ వివరణాత్మకంగా చర్చించి అంతిమంగా నిపుణులతో పాటు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చించాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. ఇంకా ఈ సమావేశంలో సిఇసిడిఓ మోహన్ కుమార్, సి.ఇ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సర్కారుకు ఆదాయంపైనా చర్చ !

కాగా ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో ఉన్న క్రమంలో ఆదాయం చూయించే అంశంపైనా అధికారులు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ ఎగువ భాగంలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ఉన్న ఇసుక మేటల పరిణామాన్ని గుర్తించడంపై అధికారులు దృష్టి పెట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో సంబంధిత జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో భూగర్భ జనవనరుల శాఖతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా , అటవీ, పర్యావరణశాఖల విభాగాలకు చెందిన అధికారులు ఇప్పటికే ఈ బ్యారేజీలను సందర్శించినట్లు సమాచారం. అన్నారం, సుందిళ్ల రెండు బ్యారేజీల్లోని ఇసుకతో మరో రూ.500 కోట్లు లభించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వర్గాలను భాగస్వామ్యం చేసుకోనున్నారని సమాచారం.

# కమీషన్ లేకుండా సేవలందిస్తున్న 'ఓల్టా యాప్'

డ్రైవర్లకు, ప్రయాణికులకు లాభదాయకం

అవగాహన కార్యక్రమంలో ఓల్టా సిఇఒ రాజా విక్రం, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం




**ప్రజాపక్షం / హైదరాబాద్:** కార్పొరేట్ రైడింగ్ యాప్‌లు ఒక వైపు ప్రయాణికులకు చార్జీల మోత మోగిస్తూ మరోవైపు డ్రైవర్ల శ్రమను దోచుకుంటున్న నేపథ్యంలో దేశంలోనే మొదటి సారిగా 'ఓల్టా యాప్' ఆటో డ్రైవర్లకు శ్రమకు తగిన ఫలితాన్ని అందిస్తున్నదని ఓల్టా యాప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజా విక్రం చెప్పారు. ఓల్టా యాప్ ఆటో డ్రైవర్ల నుంచి ఎలాంటి కమీషన్, ఫ్లాట్ ఫామ్ చార్జీలు తీసుకోబోదని, రైడింగ్‌లకు వచ్చే మొత్తం డబ్బులను డ్రైవర్లకే చెల్లిస్తుందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శశికాంత్ కనపర్తి ప్రారంభించిన 'ఓల్టా యాప్'పై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో శుక్రవారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఓల్టా సిఇఒ రాజా విక్రం, మేనేజర్ ఉదయ్ భాస్కర్, మార్కెటింగ్ మేనేజర్ సాయిరామ్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి ప్రసంగించారు. ఈ సందర్భంగా సిఇఒ రాజా విక్రం మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన ఈ యాప్‌లో ఇప్పటివరకు 40 వేల మంది డ్రైవర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రతి రోజు 36 వేల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని, 24 గంటల కస్టమర్ కేర్ సపోర్ట్‌ను, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సహాయం కోసం 'ఎస్ఓఎస్' విధానాన్ని ఓల్టా సంస్థ కల్పిస్తుందని తెలిపారు. ప్రస్తుతం కార్పొరేట్ రైడింగ్ యాప్‌ల వల్ల డ్రైవర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తూ మెరుగైన ఓల్టా యాప్‌ను తీసుకువచ్చినట్లు ఆయన వివరించారు. డ్రైవర్లు ఆటోలు నడిపినప్పుడు రైడ్‌లు వస్తేనే రోజుకు నామమాత్రంగా రూ.25 ల నిర్వహణ ఖర్చును తీసుకుంటామని తెలిపారు. యూనియన్ నేత బి.వెంకటేశం మాట్లాడుతూ కార్పొరేట్ రైడింగ్ యాప్‌లు కమీషన్లు, ఫ్లాట్ ఫామ్ చార్జీలు తదితర పేర్లతో కష్టపడి పనిచేసే ఆటో డ్రైవర్లను దోపిడీ చేస్తున్నాయన్నారు. ఎలాంటి కమీషన్ లేకుండా ఒక సామాజిక సేవా ధృక్పదంతో తీసుకువచ్చిన ఓల్టా యాప్ వల్ల ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా లాభం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొమురెల్లి బాబు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.జంగయ్య, సీనియర్ నాయకులు ఎ.భిక్షపతియాదవ్, ఎఐటియుసి నగర నాయకులు సిహెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో టీ-స్క్వేర్ నిర్మాణాలు

టెండర్లను ఆహ్వానించిన టిజి ఐఐసి

అర్హులైన కాంట్రాక్టర్ల ఎంపికకు కసరత్తు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌళికాభివృద్ధి టిజి ఐఐసి దూకుడు పెంచుతోంది. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో టీస్క్వేర్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమ మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో టి – స్క్వేర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు టిజి ఐఐసి శుక్రవారం టెండర్లను ఆహ్వానించింది. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా టీస్క్వేర్‌ను నిర్మించనున్నారు. అలాగే, స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా నిర్మాణం ఉండాలని నిర్ణయించారు. రోజూవారీ పనులతో తీరిక లేకుండా గడిపే వారికి టీస్క్వేర్‌లో జరిగే ఈవెంట్లతో ఆహ్లాద వాతావరణం కల్పించాలని భావిస్తున్నారు. ఇక్కడ టిజి ఐఐసి భారీ ప్లాజాను నిర్మించనుంది. ఈ మేరకు అర్హులైన కాంట్రాక్టర్లను ఎంపిక చేసేందుకు టిజి ఐఐసి కసరత్తు చేస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పిఐయు, సిద్దిపేట.
చిట్ టెండర్ నోటీస్ నెం. 09 to 018/2024-25 (చిట్ టెండర్ ప్రకటన) తేదీ: 15.07.2024
సిద్దిపేటలోని DPRE (PIU)లో సివిల్ పనులు (10) నిర్మాణం కోసం కింద సంతకం చేసిన వారి ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి. మొత్తం ECV: రూ.81.00 లక్షలు, దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 20.07.2024న సా. 5:00 గం.ల వరకు, టెండర్ షెడ్యూల్ల జారీ : 22.07.2024న సా.5:00 గం.ల వరకు, టెండర్లు స్వీకరణ తేదీ: 23.07.2020న మ.3:00 వరకు, టెండర్ల ప్రారంభ తేదీ: 23.07.2024న మ.3:30 గంటల వరకు, మరిన్ని వివరాలను కింద సంతకందారును సంప్రదించవచ్చు.
సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, పిఐయు, సిద్దిపేట.
DIPR R.O. No. : 293-DP/CL/ADVT/1/2024-25 Date: 12-07-2024

ప్రజాపక్షం
శనివారం, జులై 13

# మరో సమరానికి సిద్ధం

కేంద్ర ప్రభుత్వ వాగ్దానభంగానికి వ్యతిరేకంగా, తాము ఏ న్యాయమైన కోర్కెల సాధనకై నాలుగేళ్లుగా పోరాడుతున్నారో వాటిపై మోదీ కొత్త ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) మరో పోరాటానికి సిద్ధమవుతున్నది. ఇది ఢిల్లీలో ప్రదర్శనకు అనుమతించనందున ఢిల్లీ సరిహద్దుల్లో దిగ్బంధంలాంటి గత పోరాటరూపం కాదు. ఈ రూపం ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడి వద్దకు విజ్ఞాపనలు, ఎంపిలను కలుసుకుని తమ కోర్కెలు వివరించటంతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్, హర్యానా, జమ్మూ–కశ్మీర్‌లపై కేంద్రీకరించే రీతిలో ఉంటుంది. బుధవారం ఢిల్లీలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆందోళన పునరుద్ధరణ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌కెఎం నాయకులు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 'గుణపాఠం బోధించినందుకు' రైతులకు ఎస్‌కెఎం అభినందనలు తెలిపింది. రైతు వ్యతిరేకము, కార్పొరేట్ శక్తుల అనుకూలమైన మూడు వ్యవసాయ చట్టాలను సంవత్సరంపైగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు సాగించిన అపూర్వమైన నిరసనోద్యమం కారణంగా ఉపసంహరించుకుని, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ, ఆ సందర్భంగా రైతులకిచ్చిన హామీలను ఏరుదాటి తెప్పతగలేసిన సామెతగా ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం తుంగలోతొక్కి దేశ రైతాంగాన్ని మోసం చేశాడు. అందుకే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్థాన్‌లలో అలాగే మహారాష్ట్రలో ఉల్లిగడ్డ పండించే జిల్లాల్లోని 38 నియోజకవర్గాల్లో రైతాంగం బిజెపిని ఓడించారని రైతు నాయకులు అన్నారు. అయినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు. అందుకే మోడీ సంకీర్ణ ప్రభుత్వంపై మరోసారి ఒత్తిడి తేవటానికి రైతులు సన్నద్ధమవుతున్నారు.

2021 డిసెంబర్ 9న ఎస్‌కెఎం, కేంద్రప్రభుత్వం సంతకాలు చేసిన ఒప్పందం ప్రకారం కేవలం ఆహారధాన్యాలేగాక కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటిస్తున్న 23 పంటలకు ఎంఎస్ స్వామినాధన్ జాతీయ కమిషన్ సిఫారసు చేసిన ఫార్ములా ప్రకారం ఎంఎస్‌పికి (వ్యవసాయ ఖర్చులు + 50శాతం) చట్టబద్ధ గ్యారంటీ, ఆందోళన సందర్భంగా రైతులపై పెట్టిన కేసుల ఉపసంహరణ, ఆందోళనకాలంలో మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, వరిదుబ్బల తగలబెట్టటాన్ని క్రిమినల్ నేరం నుండి తొలగించటం వగైరా అంశాలపై ప్రభుత్వం సత్వరం సానుకూల నిర్ణయం తీసుకోవాలి. 12 కోర్కెలపై దఫదఫాలుగా ఆందోళన చేస్తున్నా అది దున్నపోతుపై వానచినుకు చందమే అవుతున్నది. ఎస్‌కెఎం ఇప్పుడు రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ మాఫీ కూడా డిమాండ్ చేస్తున్నది. పారిశ్రామిక వేత్తలకు రూ.16లక్షల కోట్లు రుణాలు రద్దును వారు గుర్తుచేస్తున్నారు.

సమస్యను వక్రమార్గం పట్టించే ప్రభుత్వ ప్రయత్నాలకు ఎస్‌బిఐ రీసెర్చి బృందం తాజా నివేదిక ఉదాహరణ. రైతులు ఎంఎస్‌పికై ఘోషిస్తుంటే, అది వ్యవసాయ బాస్కెట్‌లో 6శాతానికే, ప్రధాన ఆహార ధాన్యాలకే వర్తిస్తున్నదట. అన్ని ఎంఎస్‌పి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే రూ.13.5లక్షలకోట్లు అవుతుంది. అది మోయలేని భారమవుతుందని ఎస్‌బిఐ చీఫ్ ఎకనామిక్ అడ్వయిజర్ సౌమ్యకాంతిఘోష్ బాధపడుతున్నారు. వ్యవసాయరంగం ఉత్పత్తిలో ఆహారధాన్యాలు 17శాతమేనని, పశువులు, కూరగాయలు, పండ్లు వగైరా 71శాతం ఉత్పత్తిని ఎంఎస్‌పి రాజకీయాలు నిర్లక్ష్యం చేస్తున్నాయట. మేధావులు అతి తెలివి ప్రదర్శించటం ఇదే. మనదేశంలో వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంలో 80శాతంపైగా ప్రైవేటురంగంలోనే జరుగుతోంది. వారు అడ్డగోలుగా రైతులను దోచుకోవటాన్ని అరికట్టేందుకు ఎంఎస్‌పి వ్యవస్థకు లీగల్ గ్యారంటీ ఉపకరిస్తుంది. ఎంఎస్‌పి గ్యారంటీ ఇస్తే ధరలు పెరిగి వినియోగదారులు ఇబ్బందుల పాలవుతారని మరికొందరు వాదిస్తారు. ఇవన్నీ ఆరుగాలం కష్టిస్తూ, ప్రకృతి ఒడిదొడుకులకు ఎర అవుతూ అప్పుల సుడిగుండంలో నలుగుతున్న దేశ రైతాంగాన్ని, వారిపై ఆధారపడి జీవించే వ్యవసాయ కార్మికులను తమ కాలికింద తొక్కి ఉంచే పెట్టుబడిదారీ దోపిడీ ఆలోచనలు తప్ప మరొకటి కాదు.

# ఫ్రెంచ్ ఎన్నికల్లో ప్రజల మేధో విజయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

2024 జూన్ 6–9 తేదీల్లో జరిగిన యూరోపియన్ యూనియన్ (ఇయు) ఎన్నికల్లో ఫ్రాన్స్ నేషనల్ రాలి (ఆర్. ఎన్.) పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చాయి. దాని నిలువరింపుకు అధ్యక్షుడు మాక్రాన్ పార్లమెంటును రద్దుచేసి జూన్ 30, జులై 7 న రెండు విడతల్లో జరిగేటట్లు జూన్ 9న మధ్యంతర ఎన్నికలు ప్రకటించాడు. ఫ్రాన్స్, జర్మని, ఇటలీలలో మతవాద పార్టీలు బెదిరిస్తున్నాయి. యూరోప్ దేశాల్లోనే కాక ఇండియా లాంటి దేశాల్లోనూపాలక పార్టీలు విఫలమయ్యాయి. వామపక్షాలు విడిపోయాయి. వాటిమధ్య ఐక్యత కుదరలేదు. మతవాదులు వామపక్షాలూ ప్రజావ్యతిరేకులని, ఉగ్రవాదులని అబద్దాల తీవ్ర విప్రచారం చేశారు. ప్రజలు నమ్మారు.

1936 లో వామపక్షాలు ఫాసిజం నుండి తీవ్ర పోటీని ఎదుర్కొన్నాయి. పాపులర్ ఫ్రంట్ కూటమి కట్టి ఆ ఏటి ఎన్నికల్లో గెలిచాయి. జీతంతో సెలవు, వారానికి 40 పని గంటలు, ఇతర సంస్కరణలను తెచ్చాయి. 2022 ఎన్నికల్లో ఐక్యత కుదరలేదు. మతపాలనా? ఐక్యతా? అన్నదే నేటి ఎంపిక. మాక్రాన్ ఎన్నికలు ప్రకటించగానే సోషలిస్టులు, గ్రీన్ పార్టీ, కమ్యూనిస్టులు, తీవ్రవాద వామపక్షం ఫ్రాన్స్ అన్బొడ (ఎల్.ఎఫ్.ఐ.)కొత్త పాపులర్ ఫ్రంట్ (ఎన్.ఎఫ్.పి.)గా ఏర్పడ్డాయి.

జీతాల, ప్రజల కొనుగోలు శక్తి పెంపు, 64 నుండి 60కి పదవీ విరమణ వయసు, ధరల తగ్గింపు, ఇళ్ల రాయితీలు, శరణార్థుల, పర్యావరణ బాధితుల రక్షణ, పర్యావరణ విధాన ప్రణాళికను ప్రకటించాయి. ఇయు వాణిజ్య సంస్థ మితవాద ఆర్.ఎన్.ను నిరోధించాలని ప్రకటించింది. సోషల్ డెమోక్రాట్లు, పెట్టుబడిదారివ్యతిరేక పార్టీలు, కార్మిక, పౌర సంఘాలు, ప్రజలు ఫ్రంట్‌కు మద్దతిచ్చాయి. మితవాదుల ఓటమి చారిత్రక అవసరాన్ని ప్రచారంచేశారు.

ఆర్.ఎన్. అతిమితవాద, వలసవ్యతిరేక, స్త్రీ ద్వేష పార్టీ. ఇస్లాం ద్వేషి. సమస్యలన్నిటికి ముస్లింలు కారణమంటుంది. యువతను ఆకట్టుకుంది. 1972లో స్థాపించిన దీని పాతపేరు నేషనల్ ఫ్రంట్. ఆర్.ఎన్. నాయకురాలు మారిన్ లీ పెన్ పార్టీ సహవ్యవస్థాపకుడు జీన్ మేరీ లీ పెన్ కూతురు. జీన్ జాత్యహంకార, యూదువ్యతిరేక నేరాలను ఎదుర్కొన్నారు. మెతక వైఖరితో మారిన్ 90 ఏళ్ళు పైబడ్డ తండ్రితో 2015లో ఆర్.ఎన్. సంబంధం తెంచారు. నేను ముస్లిం వ్యతిరేకిని కాను. ఐతే విదేశీయుల వలసలు పెరిగాయి. వారు ఫ్రాన్స్ సంక్షేమాలను పొందుతున్నారు. ఇబ్బందులు కలిగిస్తున్నారు అని మారిన్ అన్నారు. 2002 అధ్యక్ష ఎన్నికల్లో జీన్ 17% వోట్లు తెచ్చుకున్నారు. 2012 అధ్యక్ష ఎన్నికల్లో మారిన్ మూడో స్థానంలో నిలిచారు. 2017లో 34%, 2022లో 41% ఓట్లు పొందారు. ఈ రెండు సార్లు మాక్రాన్ గెలిచాడు. 2022 నుండి 28 ఏళ్ల జోర్డాన్ బర్దెల్ల ఆర్.ఎన్. నాయకుడు. ఉక్రెయిన్ కు ఇచ్చిన ఆయుధాలను వాపసు తేవాలని, ఉక్రెయిన్ కు ఫ్రెంచ్ మద్దతుపై పరిమితులు విధించాలని బర్దెల్ల అభిప్రాయం.

577 సీట్ల పార్లమెంటులో ప్రభుత్వ ఏర్పాటుకు 289 సీట్లు కావాలి. ప్రజలు రెండు విడతల్లో పార్లమెంటు సభ్యులను ఎన్నుకుంటారు. 50% పైన ఓట్లు తెచ్చుకున్నవారు మొదటిసారే ఎన్నికవుతారు. 12.5–50%మధ్య ఓట్లు వచ్చినవారికి రెండవ విడత ఎన్నికలు జరుగుతాయి. 30.6.2024 న మొదటి విడత ఎన్నికల్లో మారిన్‌తో పాటు 78 మంది గెలిచారు. ఆర్.ఎన్. 33.15%, వామపక్ష కూటమి 28%, మాక్రాన్ శిబిరం 20.76% వోట్లు సాధించాయి. సంప్రదాయవాద రిపబ్లికన్లు (ఎల్.ఆర్.) ఆర్.ఎన్.కు మద్దతిచ్చారు. 12.5% ఓట్లు వచ్చినవారు 300 దాటారు. 499 స్థానాలకు రెండవ విడతలో ఎన్నికలు జరిగాయి. మాక్రాన్,వామపక్ష కూటములు, ఆర్.ఎన్. వ్యతిరేక ఓట్లు చీలకుండా, తృతీయ స్థానాల్లోని 200 మందిని పోటీనుంచి విరమింపజేశారు. మాక్రాన్, లీ పెన్ కూటములు ఒకవైపు, వామపక్ష కూటమి మరోవైపు నిలిచాయి. ఆర్.ఎన్. గెలుస్తుందని ప్రజలు భయపడ్డారు. దాని నిలువరింపుకు మధ్యేమార్గ వామపక్ష అభ్యర్థులు ఏకమయ్యారు. నాజి గుర్తు ధరించినవారిని, వివాదాస్పద వ్యాఖ్యానాలు చేసినవారిని ఆర్.ఎన్. పోటీ నుండి తొలగించింది. మాక్రాన్ మధ్యంతర నిర్ణయానికి, మొదటి విడతలో ఆర్.ఎన్. ఆధిక్యతకు ప్రజలు నిరసన తెలిపారు.

రెండవ విడత ఎన్నికలు 7.7.2024న జరిగాయి. ఇయు ఎన్నికల్లో మొదటి విడత ఎన్నికల్లో ఓటేయనివారు, విదేశీ ఫ్రెంచ్ పౌరులు రికార్డు సంఖ్యలో ఆన్‌లైన్‌లో ఓటేశారు. ప్రజలు మతవాద ప్రమాదాలనే కాక వామపక్ష ఐక్యతను, మైనారిటీల, వలసజీవుల భద్రతను గుర్తించారు. ఒక్క ఓటు, ఒక్క సీటు కూడా ఆర్.ఎన్.కు రానివ్వమన్నారు. ఆర్.ఎన్.కు ఇటలి, స్పెయిన్ మితవాద నాయకులు మద్దతు పలికారు. ఎన్నికల ప్రచారాల్లో బెదిరింపులు, హింస, జాత్యహంకార దురుపయోగాలు జరిగాయి. వామపక్ష, మధ్యేమార్గ అభ్యర్థులు ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ పాలనను రక్షించమని కోరారు.

మొదట సహజ తాత్వికతతో ఓటేసిన ప్రజలు రెండవసారి ఆలోచించి ఓటేశారు. వామపక్ష కూటమి(ఎన్.ఎఫ్.పి.)కి 182, మాక్రాన్ ఎన్సెంబుల్ కు 168, ఆర్.ఎన్.కు 143, సంప్రదాయవాద రిపబ్లికన్లకు 46, ఇతరులకు 38 సీట్లు వచ్చాయి. ఎన్.ఎఫ్.పి. అతి పెద్ద కూటమి. రెండు రోజుల్లో నాటొ సమావేశాలు, మూడు వారాల్లో ప్యారిస్ ఒలింపిక్ ఆటలు మొదలు కానున్నాయి. ప్రధాని గాబ్రియల్ అట్టల్ రాజీనామాకు సిద్ధపడ్డాడు కాని ఆటల నిర్వహణలో తన పాత్ర పోషిస్తానన్నాడు. ఎల్.ఎఫ్.ఐ., ఎన్.ఎఫ్.పి.ల నాయకుడు జీన్ లుక్ మెలెంచొన్ వామపక్ష ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇమ్మని కోరారు. ఎన్.ఎఫ్.పి.లో సోషలిస్టు పార్టి తరఫున పూర్వ అధ్యక్షులు ఫ్రాంకొయిస్ హోలాండే, ఫ్రాంకొయిస్ మిట్టరాండ్ గెలిచారు.

మాక్రాన్ కూటమి ఎన్.ఎఫ్.పి.లోని సోషలిస్టులు, గ్రీన్ పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించవచ్చు. అన్బొడ ఆధీన వామపక్షం, ఆర్.ఎన్.తో సమానంగా అపాయకరమని మాక్రాన్ ప్రచారం చేశాడు. వామపక్షం పదవీ విరమణ వయస్సును తగ్గించాలని పట్టుబట్టవచ్చు. 2023లో దీన్ని 62 నుండి 64 ఏళ్ళకు పెంచిన మాక్రాన్ దీనికి ఒప్పుకోరు. మతవాద, వామపక్ష కూటముల్లోని మితవాదులతో మాక్రాన్ మైనారిటి ప్రభుత్వాన్ని నడుపవచ్చు. ప్రధానిని అధ్యక్షుడు నియమిస్తాడు. దానికి కాలవ్యవధి, మెజారిటి పక్షం నుండి నియమించాలన్న నియమాలు లేవు. మాక్రాన్ ఈ నియామకాన్ని ఆలస్యంచేయవచ్చు.

ప్రధాని మెజారిటి ఎన్.ఎఫ్.పి. నుండే ఉండాలి. ఎన్.ఎఫ్.పి.నాయకుడు మెలెంచోన్ ప్రభుత్వ ఏర్పాటుకు దావావేస్తూ, అధ్యక్షుడు ప్రజాభీష్టాన్ని మన్నించాలి, ఇతర ఏ ఏర్పాటు ఆమోదనీయం కాదన్నారు. గ్రీన్‌లు, సోషలిస్టులు దీన్ని సమర్థించారు. ప్రధానిగా మెలెంచోన్ ను ఆర్.ఎన్. యేతర మితవాదులు వ్యతిరేకించవచ్చు. వామపక్ష భాగస్వామి అయిన పూర్వ పత్రకారుడు, చిత్ర నిర్మాత ఫ్రాంకొయిస్ రుఫిన్ కాని, సోషలిస్టు పార్టీకి చెందిన బోరిస్ వలౌడ్ కాని, గ్రీన్ పార్టి నాయకురాలు మారిన్ తొండెలీర్ కాని, నిష్పక్షవాద లారెంట్ బర్గర్ కాని ప్రత్యామ్నాయ ప్రధాని అభ్యర్థులు కావచ్చు. రాజ్యాంగ అధికరణ 49.3 ప్రకారం ప్రతిష్టంభన నివారణకు ప్రధాని ఏకపక్షంగా చట్టాలు చేయవచ్చు. దీన్ని అంగీకరించని పక్షం 24 గంటల్లో అవిశ్వాస తీర్మానం పెట్టి సాధారణ ఆధిక్యతతో గెలవాలి.

7వ తేదీ ఎన్నికల ఫలితాలను అవిశ్వాస ఓటుగా పరిగణించి, రాజీనామాచేసి మరల ఎన్నికలప్రతిపాదనకు మాక్రాన్ వడిగట్టవచ్చు. ఆర్.ఎన్. నిరోధానికి ఎన్.ఎఫ్.పి.కి మాక్రాన్ ఉధృత సహకారం మరువరానిది. మాక్రాన్ తో కలువనన్న అతివాద ధోరణిని మెలెంచోన్ వదలాలి. సమన్వయంకోసం ఆర్.ఎన్.కుట్రలకు అవకాశమివ్వని యుక్తిని మాక్రాన్ ప్రదర్శించాలి.

**ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం**
**జాతీయ కార్యదర్శి, గుంటూరు**





మొదటి విడత ఎన్నికల తర్వాత ఆర్‌ఎన్ కు వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలు



ఫ్రెంచి ఎన్నికల్లో గెలిచిన వామపక్షాల నాయకులు

# వ్యవసాయం లాభసాటయ్యేదెప్పుడు ?

ప్రజల ఆహార అవసరాలు తీరడానికి వ్యవసాయం తప్పనిసరి. మనదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయ యోగ్యమైన భూమిని కలిగి ఉంది. దేశ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జనాభాలో యాభై శాతానికి పైగా జీవనోపాధిని కలిగిస్తుంది. యాభై యెనిమిది శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. దేశ జి.డి.పిలో వ్యవసాయ వాటా సుమారు పద్దెనిమిది శాతం. దేశం శ్రామిక శక్తిలో యాభై యెనిమిది శాతం ఈ రంగంలోనే ఉన్నారు. ఆహార పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలు వ్యవసాయం నుండే లభిస్తున్నాయి. అధిక జనాభాతో అభివృద్ధి చెందుతున్న మన దేశంలో ప్రజల ఆహార భద్రతను నిర్ధారించడంలోను, పరిశ్రమలు సేవా రంగాల వృద్ధికి వ్యవసాయం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాని ఇప్పుడు దేశంలో వ్యవసాయం పర్యావరణ, ఆర్థిక, సంస్థాగత, సాంకేతికతపరంగా సవాళ్ళను ఎదుర్కుంటున్నది.

ప్రపంచీకరణ వలన రైతు ఆదాయం తగ్గింది. దేశంలోని చాలా ప్రాంతాలలో సాగువిధానాలు ప్రాచీన పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు. నాణ్యమైన విత్తనాల కొరత పెద్ద సమస్యగా మారింది. దేశంలోని దాదాపు అరవై ఐదు శాతం వ్యవసాయం ఋతుపవన వర్షపాతంపై ఆధారపడి ఉంది. వాతావరణ మార్పులు అస్థిర ఋతుపవనాలకు కారణమవుతున్నాయి. వర్షపాతంలో హెచ్చు తగ్గులు, కరువులు లేదా వరదలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా అస్థిరత్వానికి గురవుతోంది. దేశంలో గణనీయమైన సంఖ్యలో చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. తరతరాలుగా కుటుంబ సభ్యుల మధ్య జరిగిన భూవిభజన వలన, జనాభా ఒత్తిడి కారణంగా, చిన్న రైతులు అప్పులు తీర్చుకోవడానికి తమ భూమిలో కొంత భాగాన్ని అమ్ముకోవడం వలన సాగుభూమి చిన్న కమతాలుగా మారిపోతున్నది. ఇంకా ఇవి ఛిన్నాభిన్నంగా ఉండడం వలన నీటిపారుదల సరిగా జరగడం లేదు. యాంత్రీకరణకు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి ఆటంకం కలుగుతుంది. ఇది పంటల ఉత్పాదకతను తగ్గిస్తుంది. భూమి పరిమాణం చాలా తక్కువగా ఉన్నప్పుడు సాగు గిట్టుబాటుగా ఉండదు. భూ వనరులపై అధిక జనాభా ఒత్తిడి కారణంగా వర్షాధార ప్రాంతాలు, ముఖ్యంగా పొడి భూములు తక్కువ దిగుబడిని ఇస్తున్నాయి. వరి, గోధుమలు, పత్తి, నూనె గింజలతో సహా భారతీయ పంటల దిగుబడులు అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. మానవ కార్యకలాపాల వల్ల వర్షాధార ప్రాంతాలు కూడా నేల కోతను క్షీణతను ఎదుర్కొంటున్నాయి. ఒకే పంటను పదే పదే సాగుచేయడం వల్ల నేల పోషకాలను కోల్పోయి నిస్సారంగా మారింది. చాలా ప్రాంతాలలో సాగునీరు కోసం భూగర్భజలాలను అధికంగా వాడడం వల్ల తాజా భూగర్భజల స్థాయిలు క్షీణించాయి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరతో పాటుగా లేబర్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. పంట పెట్టుబడికి రైతులు అధిక వడ్డీకి రుణాలు వాడుతున్నారు. పంట నష్టపోవడం, పంటలకు గిట్టుబాటుధర లేకపోవడం, అధిక ఖర్చులు వలన సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు అప్పుల పాలవుతున్నారు. చాలా మంది అనధికారిక వనరుల నుండి రుణాలు పొందుతున్నారు. వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. కరువు, పంట నష్టాలు వలన అప్పుల ఊబిలో కూరుకుపోయి ఒక్కోసారి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అసమర్థమైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలు ధరల అస్థిరతకు దారితీస్తాయి. సరైన నిల్వ, రవాణా సౌకర్యాలు లేకపోవడం వలన రైతులు వెంటనే తక్కువ ధరకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.ఇది పంట అనంతర నష్టాలను మరింత పెంచుతుంది. నేరుగా మార్కెటింగ్ విధానం లేకపోవడం వలన వచ్చే ఆదాయంలో కొంత భాగం మధ్యవర్తుల పాలవుతున్నది. ప్రస్తుతం ఉన్న పంటల విధానం కొన్ని ప్రధాన పంటల వైపు మాత్రమే మొగ్గుచూపే విధంగా ఉన్నాయి. పంటలలో వైవిధ్యం లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం తెగుళ్లు, వ్యాధులు, మార్కెట్ ఒడిదుడుకుల బారినపడుతుంది. భారతీయ వ్యవసాయం సవాళ్లను పరిష్కరించడానికి బహుముఖ విధానం అవసరం. వ్యవసాయ పనితీరును మెరుగు పరచడం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధికి భరోసా ఇవ్వడానికి ఈ సవాళ్లను పరిష్కరించడం అత్యవసరం. ఇటు రైతు అటు ప్రభుత్వాలు వ్యవసాయానికి రెండు చక్రాల్లాంటి వారు.



**రైతులు చేయవలసినవి:** నేల క్షీణతను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలి. పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలి. డ్రిప్, స్ప్రింక్లర్ సిస్టంలతో సహా, సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులు అవలంబించాలి. మారుతున్న వాతావరణ విధానాలకు అనుగుణంగా విభిన్న పంటరకాలు, పద్ధతులను అనుసరించాలి. సేంద్రీయ ఎరువులు వాడాలి. వ్యవసాయ యంత్రాలను వాడాలి.

**ప్రభుత్వాలు చేయవలసినవి:** సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతులు, వర్షపునీటి సంరక్షణను అమలు చేయాలి. తీవ్రమైన వాతావరణ సంఘటనల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఆహారోత్పత్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు నిర్ణయించే ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలా చూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి.

రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాట్లు చేయాలి. రైతులు అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అంది పుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి. భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి, ఉత్పాదకతను పెంచడానికి, దేశవ్యాప్తంగా రైతుల జీవనోపాధిని మెరుగు పరచడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి.

**డి జె మోహన రావు,** 9440485824

# మహిళలకు ప్రాధాన్యం ఎక్కడ?

''సృష్టిలో సగం'' అంటూ మహిళను మాటల్లో ఆకాశానికి ఎత్తి వేస్తున్నాం, కానీ ఆచరణలో మాత్రం వారి పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగాలు, ఉపాధులు, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంటున్నది. అసమానతల విష వలలో ఆమె బందీ అవుతున్నది. ఆమె వంటిల్లు దాటడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చట్ట సభల్లో 26.9 శాతం వరకు మహిళలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇంటర్‌పార్లమెంటరీ యూనియన్ అధ్యయనాల ప్రకారం దిగువ సభల్లో మహిళల శాతం పరంగా 193 దేశాల జాబితాలో భారత్‌కు 149వ స్థానం దక్కడం విచారకరం. స్వీడెన్, నార్వే, దక్షిణాఫ్రికా దేశాల్లో మహిళల ప్రాతినిధ్యం 45 శాతం కన్న అధికంగాఉండడం గమనించాలి. భారత స్వాతంత్ర్యం రాకముందే 1946లో ఏర్పడిన రాజ్యాంగ పరిషత్/అసెంబ్లీలో ఉన్న 389 మంది సభ్యుల్లో 15 మంది మాత్రమే మహిళలు ఉన్నారు. చట్టసభలో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ తర్వాత రానున్న ఎన్నికల్లో పార్లమెంట్‌లో కనీసం 33 శాతం మహిళా సభ్యులు రానున్నారు. మహిళా రిజర్వేషన్లు 15 ఏళ్ల పాటు అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. 1952లో ఏర్పడిన తొలి పార్లమెంట్‌లో 489 మంది ఎంపిల్లో 22 మంది (4.5 శాతం)మాత్రమే మహిళలు ఉన్నారు. 2024లో ఏర్పడిన 18వ లోక్‌సభలో 543 మంది ఎంపీల్లా 74 మంది మహిళలు (13.6 శాతం), రాజ్యసభలోని 224 మంది సభ్యుల్లో 24 మంది మాత్రమే మహిళలు ఉండడం విశేషం. 1957లో ఏర్పడిన 2వ లోక్‌సభలో 494 మంది ఎంపీల్లో 5.5 శాతం, అనగా 27 మంది మహిళా ఎంపీలు మాత్రమే సేవలు అందించడం చూసాం. 1962, 1967లో లోక్‌సభలో మహిళా సభ్యులు 6 శాతం, 1977లో 4 శాతం, 2009లో 11 శాతం, 2014లో 12 శాతం మంది మహిళలు మాత్రమే సేవలు అందించారు. 2019లో ఎన్నికైన 17వ లోక్‌సభలో 543 మంది సభ్యుల్లో 14.4 శాతం, అనగా 78 మంది మహిళలు ఉన్నారు. రాజ్యసభలో సరాసరి 10 శాతం మంది మహిళా ఎంపీలు మాత్రమే ఉంటూ వస్తున్నారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళా సభ్యుల సంఖ్య 10 శాతం కంటే తక్కువగానే ఉంటున్నది.

పార్లమెంట్‌లోనే కాకుండా రాజకీయ పార్టీల్లో కూడా మహిళలకు ప్రాధాన్యం తక్కువగా ఉండడం గమనిస్తున్నాం.2024లో బిజెపి పార్టీ తరపున 15.7శాతం మం ది మహిళలకు, 2019లో 12.6 శాతంమంది మహిళలకు మాత్రమే టికెట్లు ఇవ్వడం జరిగిందని గమనించాలి. కాంగ్రెస్ పక్షాన 2019, 2024 లోక్‌సభ ఎన్నికల బరిలో 12.3 శాతం మంది మహిళలను దించడం జరిగింది. భాజపా పక్షాన గెలిచిన మహిళా సభ్యులు 2019లో 74.6 శాతం ఉండగా 2024లో ఎన్నికల్లో 44.9 శాతానికి పడిపోయింది. కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న మహిళలు 2019లో 11.5 శాతం గెలువగా, 2024లో 18.8 శాతం విజేతలు అయ్యారు. 2024 పార్లమెంట్‌లో తృణముల్ కాంగ్రెస్ సభ్యుల్లో 37.9 శాతం, భాజపా సభ్యుల్లో 12.9 శాతం, కాంగ్రెస్ సభ్యుల్లో 13.1 శాతం మహిళా ఎంపీలు ఉన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెంది అగ్ర దేశాల సరసన నిలవడానికి చట్ట సభల్లో మహిళల పాత్ర అత్యంత ప్రధానమని తెలుసుకోవాలి. నిరక్షరాస్యత, రాజకీయ సంకల్పం లేకపోవడం,చిన్న చూపు, పితృస్వామ్య పోకడలు, లింగ అసమానతలు, గృహ పనుల్లో నిమగ్నం కావడం, పిల్లల పెంపకం బాధ్యత మీద పడడం, బహిరంగ మార్కెట్‌లో మహిళల భద్రత కొరవడడం లాంటి పలు కారణాలతో మహిళలు వెనుకంజ వేయడం కొనసాగుతున్నది. ఇప్పటికైనా మహిళ పరాశక్తిగా సామాజిక బంధనాలను చేదించుకొని చట్ట సభల్లో తమ శక్తియుక్తులను ప్రదర్శించి దేశాభివృద్ధిలో అర్థ భాగం కావాలని ఆశిద్దాం. పురుష సమాజం పౌరుషానికి పోకుండా 'ఆమె'ను అందలం ఎక్కించాలని కోరుకుందాం.





# అటు చంద్రయాన్... ఇటు క్రికెట్

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత,రైతుల ఆత్మహత్యలు వంటి సమస్యలతో సతమవుతున్న మన దేశంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి అంతరిక్ష రాకెట్ ప్రయోగాలు అవసరమా? అని కొంత మేధావి వర్గం విమర్శలకు దీటుగా..'మన దేశంలోని అంతర్గత సమస్యలపై మనందరం ఐకమత్యం గా బాధ్యతతో యుద్ధం చేద్దాం. కానీ విక్రమ్ సారాభాయ్, అబ్దుల్ కలాం వంటి మహానుభావుల చెప్పినట్లు అభివృద్ధి చెందిన దేశంగా మనం ఎదగాలంటే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం ప్రపంచానికి దిక్సూచి కావాలి. చంద్రయాన్1మిషన్ సక్సెస్ తో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మన ఇస్రో బృందం చంద్రుని ఉపరితలంపైకి విక్రమ్ ల్యాండర్ ను చేర్చడమే లక్ష్యంగా చేసిన అసాధారణ ప్రయోగం చంద్రయాన్ 2. 2019 జులై22న లాంచ్ చేసిన ఈ ప్రయోగం ఎన్నో దశలను దాటుకుంటూ 95% సఫలం అయిన తర్వాత ఆ మిషన్ సెప్టెంబర్ 7,2019 నాడు కేవలం చంద్రుడి ఉపరితలం నుంచి 2.1కిమీ ఎత్తున ల్యాండర్ భూమితో సాఫ్ట్ వేర్ సమస్య తలెత్తి సంధానం తెగిపోయింది. ఆగని కన్నీళ్లతో వున్న అప్పటి ఇస్రో చైర్మన్ కె.శివన్ ను మన ప్రధాని ఓదార్చిన దృశ్యం ఇప్పటికీ మన మనస్సులోనే వుంది. అయినా మన శాస్త్రవేత్తల, ఇంజనీర్ల కృషిని యావత్ భారతం కీర్తించింది.

వేల సంవత్సరాలుగా విభిన్న మతాల వైవిధ్యంలోని ఏకత్వంతో మానవత్వాన్ని చాటిచెప్పే మన భారత భూమిపై అందరికీ నచ్చిన మతం క్రికెట్. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలో 2011 ఐసిసి వన్డే ప్రపంచకప్ గెలిచి మన క్రికెట్ దేవుడు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ని తోటి ఆటగాళ్ళు హర్భజన్, కోహ్లి, యువరాజ్ సింగ్ తదితరులు తమ భుజాలపై మోసిన దృశ్యం సచిన్ రెండు రెండు దశాబ్దాల కలకు, శ్రమకు, పట్టుదలకు, అంకితభావానికి నిదర్శనం. 2024 ట్వంటీ ట్వంటీ వరల్డ్ కప్ సమరం ఆరంభమయ్యింది. మన రోజు రానే వచ్చింది జూన్ 29, 2024. ఆ అర్థరాత్రిలో కూడా 140 కోట్లమంది భారతీయుల కళ్ళల్లో విజయ కాంక్షపు వెలుగులు ప్రసరిస్తున్నాయి. ట్వంటీ ట్వంటీ వరల్డ్ కప్ 2024 ఫైనల్ లో భారత్ దక్షిణాఫ్రికాతో తలపడింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20ఓవర్లలో 176/7 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆటగాళ్ళ ఆట చివరి ఐదు ఓవర్లు మన దేశాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఓటమిని ఒప్పుకోని రోహిత్ సేన చేసిన పోరాటం యావత్ ప్రపంచపు క్రికెట్ అభిమానుల మనస్సు గెలిచింది. సూర్యకుమార్ పట్టిన క్యాచ్, చివరి బాల్ అయిపోగానే మళ్ళీ ఒకప్పటి కన్నీళ్లతో ఆ గ్రౌండలోని మట్టిని ముద్దాడిన రోహిత్ తో కూడిన కోహ్లి విజయ గర్జన మళ్ళీ ఓసారి మనదేశపు త్రివర్ణ పతాకాన్ని ఎవ్వరికీ అందనంత స్థాయిలో నిలబెట్టింది. దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో గెలిచి 2024 ట్వంటీ ట్వంటీ విశ్వ విజేత గా భారత్ (2వసారి) ఆవిర్భవించింది. కలాం గారు అన్నట్లు 'మన కలలన్నీ నిజమవుతాయి. కానీ దానికి ముందు నువ్వు ఎన్నో సవాళ్ళను స్వీకరించాలి.'

చంద్రయాన్ 2 లోని చిన్న చిన్న పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకొని ఇస్రో ఈ సారి చంద్రయాన్ 3 మిషన్ సాయంతో చంద్రుని ఉపరితలంపై ఖచ్చితంగా భారత జెండా నిలపాలనే లక్ష్యంతో మన అందరి హీరో విక్రమ్ సారాభాయ్ స్ఫూర్తితో విక్రమ్ ల్యాండర్ జూలై 14,2023 ప్రయాణం మొదలెట్టింది. ఎన్నోరోజులు, ఎన్నో దశలు దాటుకుంటూ ఆగష్టు 23 వరకు వెళ్లింది.సాయంత్రం 6 గంటలకు మనమంతా నూతన చరిత్ర రాసే సమయం ఆసన్నమైంది.ఇస్రో చైర్మన్ సోమనాథ్ గారి కళ్ళల్లో ఆత్మవిశ్వాసం బలంగా వికసిస్తూనే వుంది.అయినా మనందరి గుండెల్లో తృటిలో చేజారిన ఆనాటి చంద్రయాన్ 2 విజయపు జ్ఞాపకం ఆందోళనను రెట్టింపు చేసింది. అందరూ టివిలముందు ప్రత్యక్ష ప్రసారంలో లీనమయ్యారు. విక్రమ్ ల్యాండర్ ఇస్రోకి సందేశం పంపింది. 'India,I reached my destination and you too!'.ఎక్కడ పోగోట్టుకున్నామో అక్కడే గెలిచాం. అంతర్జాతీయంగా భారత్ సత్తాను చూపాం.

ఇక్కడ విశేషం ఏమిటంటే చంద్రయాన్ 2, చంద్రయాన్ 3 సందర్భాల్లో ఇస్రోకు, 2023, 2024 వరల్డ్ కప్ లో మన క్రికెటర్లకు మన దేశం నుంచి సంపూర్ణ మద్దతునిస్తూ, ప్రోత్సాహం అంది స్తూ, ఓటమిని గెలుపు గా మార్చడంలో క్రియాశీలక పాత్ర పోషించిన వ్యక్తి.. నేడు వరుసగా మూడవసారి మన దేశానికి ప్రధాన మంత్రిగా పనిచేస్తున్న నరేంద్రమోడీ గారు. నిత్యం కుటుంబ, వ్యాపార,చదువు, ఉద్యోగ, ఆర్థిక వంటి ఎన్నో సమస్యలతో సతమవుతు డిప్రెషన్ లో ఆత్మహత్యలు చేసుకోవాలనుకుంటున్న ప్రపంచ యువతరానికి చంద్రయాన్ 2 నుంచి చంద్రయాన్ 3 మరియు 2023 వన్డే క్రికెట్ వరల్డ్ కప్ నుంచి 2024 ట్వంటీ ట్వంటీ వరల్డ్ కప్ సాగిన మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, క్రికెటర్లు తదితరులు సాగించిన ప్రయాణం అనితరసాధ్యం. విశ్వవిఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అన్నట్లు...'ఈ విశ్వం ఎంత పెద్దదైనా కావచ్చు. కానీ నీ ప్రయత్నం ముందు చాలా చిన్నదే..!'.

## నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ చౌరస్తా నుండి పొట్టి శ్రీరాములు చౌరస్తా వరకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ తీసుకవచ్చిన హరితహారం కార్యక్రమాన్ని వనమహోత్సవం పేరుతో సిఎం రేవంత్ రెడ్డి కొనసాగించడం హర్షణీయం అన్నారు. పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరు తమ నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటి కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జికెడి ప్రసాద్, శానిటరి ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ వరుణ్, అధికారులు శివప్రసాద్, వసుంధర, శ్వేత పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి

### తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటిలోని నందాపురంలో వనమహోత్సవ కార్య క్రమంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ సమతుల్యం దెబ్బ తినడంతో మనిషి మనుగడకే పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్క రు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూర్యరాములు, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, వైస్ చైర్మన్ కేసిడి సరళ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వై నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు నమ్మొద్దు

### సూర్యాపేట డిఎస్పి రవి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలో అంజలి స్కూల్ సమీ పంలో గంజాయి సేవించి యువ కుడిపై దాడి చేసినట్లు జరుగు తున్న అసత్య ప్రచారాలను ఎవ్వరు నమ్మవద్దని సూర్యాపేట డిఎస్పి రవి అన్నారు. శుక్రవారం ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యువకుడిపై జరిగిన దాడిపై తాను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుడిపై జరిగిన దాడి గంజాయి మత్తులో చేశారా.. లేదా అన్నది తెలాల్సి ఉందన్నారు. సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు వైరల్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే సంఘటనకు సంబంధించిన వివ రాలను వెల్లడిస్తామని చెప్పారు. గంజాయి మత్తులో దాడి చేసి ఉంటే అందుకు బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి సేవించిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు సంఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో ఎస్ఐ బాలకృష్ణ ఉన్నారు.

## నిరక్షరాస్యులకు విద్యనందించాలి

### వయోజన విద్య ప్రాజెక్టు ఆఫీసర్ కె. అనిత

**ప్రజాపక్షం/అయిజ :** నిరక్షరాస్యులందరికి విద్య నందించడం మన అం దరి బాధ్యత అని వయోజన విద్య ప్రాజెక్టు ఆఫీసర్ కె. అనిత పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇం డియా లిటరసీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఇది కేంద్ర ప్రభుత్వ పథకమని, 15 సంవత్సరాలు పైబడిన వారందరిని అక్షరాస్యులగా మార్చ డంతో పాటు డిజిటల్ పరిజ్ఞానం అర్థిక,కుటుంబ సంక్షేమం, పరిసరాల పరిశుభ్రత,ఆరోగ్య పరిరక్షణ,అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాస బృందం పాల్గొన్నారు.

## ప్రజలు భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/అయిజ :** గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలకు సాధికారత కల్పిం చడం లక్ష్యంగా పెట్టుకున్న ఇం టింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో అన్నీ వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపిడిఓ చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేషన్ 2024 కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులను, సమర్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న అవిష్కర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆవిష్కరణ ధర కాస్తులను 9542746728 వాట్సాప్ నెంబర్‌కు ఆగస్టు 3వ తేదిలోపు పం పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఐసి డిస్ట్రిక్ట్ ఇన్నోవేషన్ కో ఆర్డినేటర్ జగదీష్, మండలంలోని పంచాయతి సెక్రెటరీలు,పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగమణి నియామకం

**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** మహిళా కాంగ్రెస్ కమిటీ నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నల్లగొండ పట్టణానికి చెందిన కందిమళ్ల నాగమణి రెడ్డిని జిల్లా కాంగ్రెస్ కమిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు గోపగాని మాధవి సమక్షంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియమించి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకా నికి సహకరించిన జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్, మహిళా జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

### అదనపు కలెక్టర్ కె.గంగాధర్

**ప్రజాపక్షం/భువనగిరి:** సీజనల్ వ్యాధుల పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసు కొని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులను పరిశీలించి రోగులకు అందు తున్న సౌకర్యాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా రిజిస్టర్లు తనిఖీ చేసి పేషెంట్లకు అందుతున్న సేవలు, మందుల వివరాలను పరిశీలిం చారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని, పారిశుధ్య చర్య లను పక్కాగా నిర్వహించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, నీరు ఎక్కడ కూడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రికి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించాలని ఈ సంద ర్భంగా మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# యాదాద్రిలో వైద్యకళాశాల లేనట్టే!

**అనుమతి నిరాకరించిన జాతీయ వైద్య మండలి**

**మౌలిక వసతులు లేకపోవడమే కారణం**

**ప్రజాపక్షం/భువనగిరి :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికా రుల ముందు చూపు లేని కారణంతో పా టు జిల్లా అధి కార యంత్రాంగం అలసత్వం నిర్ల క్ష్యం కారణంగా ఈ యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీ ఈ సంవత్సరం ఇక లేనట్టే. ఈ యాదాద్రి భువన గిరి జిల్లాలో మంజూరైన మెడికల్ కళాశాలను పగిడిపల్లి లోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేయడా నికి జిల్లా అధికార యంత్రాంగం ఉపక్రమించింది. అ యితే ఈ కళాశాలలో మౌలిక వసతుల కల్పన సంబం ధించి ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఢిల్లీ నుంచి వచ్చినటువంటి జాతీయ వైద్య మండలి అనుమతులకు నిరాకరించడంతో ఈ ఏడు ప్రారంభం కావలసిన మెడి కల్ కాలేజీ వచ్చే ఏడాదికి వాయిదా పడింది. ఢిల్లీ నుండి జాతీయ వైద్య మండలి బృందం మెడికల్ కళాశాల తని ఖీకి వస్తున్న విషయం జిల్లా యంత్రాంగానికి తెలిసినప్ప టికీ ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో పాటు అధి కార బృందం వచ్చే సమయానికి కూడా గేటు తాళాలు తెరిచి ఉండకపోవడంతో ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు నివ్వెర పోయారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు జా తీయ వైద్య మండలి నియమనిబంధన లకు లోబడి అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. మెడికల్ విద్యార్థులు చదువుకోవడానికి తర గతి గదులు ల్యాబ్స్‌తో పాటు అన్ని మౌ లిక వసతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం కల్పించినప్పుడే కేంద్రం జాతీయ వైద్య మండలి ద్వారా విద్యార్థులను కేటాయిస్తుంది. అయితే కౌన్సిలింగ్ జరుగుతున్న నేపథ్యంలో మెడికల్ కళాశాలకు విద్యార్థులను కేటాయించడానికి ముందుగా మౌలిక వసతులను పర్యవేక్షించడానికి ఢిల్లీ నుంచి ప్రత్యే క బృందం వచ్చింది. ఈ ఢిల్లీ బృందానికి ప్ర స్తుతం ఏర్పాటు చేసిన కళాశాల ప్రాంగణం విశాలంగా ఉన్నప్ప టికీ ప్రొఫెసర్లు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తరగతి గదు లు, ల్యాబ్స్, ఇతర మౌలిక వసతులు లేకపో వడంతో అనుమతులు ఇవ్వడానికి నిరాకరించారని తెలుస్తున్నది. గత ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాకు 2023లో మెడికల్ కళాశాల మంజూరు చేసింది. దీంతో కళాశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం యాదా ద్రి దేవస్థానం సమీపంలోని యాదగిరిగుట్ట మండలం దాతర్ పల్లి గ్రామ శివారులో నూతన వైద్య కళాశాల భవనం నిర్మిస్తున్నారు. అప్పటి వరకు జిల్లా కేంద్రం సమీపంలోని పగిడిపల్లి శివారులో పాత కలెక్టరేట్ అద్దె భవనంలో ఏర్పాటు చేసిన్నట్లు బోర్డు ఏర్పాటు చేసి ప్రతి పాదనలు పంపారు. ఐతే మెడికల్ కళాశాల ఏర్పాటుకు 350 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉండాలనేది నిబం ధన. అయితే జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు ఎంసీ హెచ్, ఆస్పత్రులు ఉన్నాయని మెడికల్ కళాశాల నిర్వహణకు సరిపోతుందని నిర్ణ యిం చారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు గత ప్రభుత్వంలో జిల్లా వైద్య కళాశాల మంజూ రైందంటే జిల్లా ప్రజలు ఎంతగానో సంతోషించారు. చివరికి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని యాదగి రిగుట్ట మండల పరిధిలోని దాతర్‌పల్లి గ్రామ శివారు లోని ప్రభుత్వ భూమిలో జిల్లా వైద్య కళాశాల భవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా భవనం పూర్తి అయ్యేంత వరకు భువనగిరి జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ అద్దె భవనంలో ఏర్పాటుచేసిన్నట్లు ప్రక టన చేసి జిల్లా వైద్య కళాశాల అనే బోర్డును సైతం ఏర్పా టుచేశారు.ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న జిల్లా వా సుల కల నెరవేరిందని జిల్లా ప్రజలు ఎంతగానో సంబు రపడ్డారు. అయితే మెడికల్ కళాశాల ఏర్పాటుకు సరైన వసతులులేవని,సిబ్బంది కొరత ఉందనే కారణంతో జా తీయ వైద్య మండలి కళాశాల అనుమతిని నిరాకరించి నట్లు సమాచారం. దీంతో జిల్లా వైద్య విద్యార్థులు ఒక్క సారిగా తీవ్ర నిరాశకు లోనయ్యారు.




### ప్రిన్సిపాల్ మల్లికార్జున్ వివరణ

జాతీయ వైద్యమండలి జిల్లా వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతులు నిరాకరించిన మాట వాస్తవమే అన్నారు. జిల్లా వైద్య కళాశాలలో సిబ్బంది నియామకం, మౌళిక వసతుల ఏర్పాటుకు ఎన్నికల కోడ్ ఆటంకంగా మార డంతో పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకాలు, మౌళిక వసతుల ఏర్పాటు చేయలేకపోయామన్నారు. త్వరలోనే సిబ్బంది నియామకాలు చేపట్టి మౌళిక వసతులు కల్పించి జాతీయ వైద్య మండలికి నివేదిక అందజేస్తా మని కళాశాల అనుమతుల కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఆయన వివరించారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు కోసం

# ఉద్యమానికి సిద్ధం కండి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్



**ప్రజాపక్షం/హుజూరాబాద్ :** తెలంగాణలో విద్యార్థు లకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఇప్పటికైనా ఈ ప్రభు త్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెం టనే ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయా లని ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకివ్వాల్సిన దా దాపు 7 కోట్ల పైగా బకాయిలున్నా యని, స్వరాష్ట్రం వస్తే నిధులు నియామకాలు వస్తా యని విద్యార్థులు కో టి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థు లకు మొండి చేయి చూపడం చాలా అన్యాయమన్నారు. అదే విధంగా ఫీజు బకా యిలు సరిగా విడుదల చేయక పోవంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజు లు కట్టాలని వేధిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని, ఇప్పటి కైనా ఈ కొత్త ప్రభుత్వం ఉన్నత విద్య పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యార్థులను అందుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని తెలిపారు.

# ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

**ప్రజాపక్షం/నల్లగొండ :** వర్షం కారణంగా చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా ముందే పటిష్ట చర్యలు తీ సుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఇంజనీ రింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్డీవోలు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్క డైనా వర్షం నీటికి తెగిపోయెందుకు,గండ్లు పడేందుకు అవకాశం ఉన్న చెరువులను గుర్తించి వాటికి తగిన విధ ంగా మరమ్మతులు చేపట్టాలన్నారు. ,ఒండ్రు మట్టి, మొ రం ,ఇసుక వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్య లు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.ప్రభు త్వ, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె వేయించాలని,భూములు అన్యాక్రాంతం కాకుండా చూ డాలన్నారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా వచ్చే శుక్రవారం నాటికి అన్ని ప్రభుత్వ స్థలాలకు కంచె ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాజ క్టుల కింద భూసేకరణను ఆయన సమీక్షిస్తూ ప్రాధా



న్యత ప్రకారంగా భూసేకరణ సమస్యలు పరిష్కరించా లని, అలాగే ప్రాజక్టుల పనులకు సంబంధించి పురో గతి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలె క్టర్ ఆయా ప్రాజెక్టుల కింద రిజర్వాయర్ల వారీగా భూసే కరణ పిఎన్, పి డి తదితర వివరాలను ఇంజనీరింగ్ అధి కారులతో అడిగి తెలుసుకున్నారు. భూసేకరణపై సోమ వారం లేదా మంగళవారం సంబంధిత రెవెన్యూ డివిజ నల్ అధికారులతో సమావేశం నిర్వహించాలని ఇరి గేషన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్,స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,డివి ఫ్ఓ రాజశేఖర్, ఎస్ఎల్‌బిసి సూపరింటెండెంట్ ఇంజ నీర్ శ్రీనివాస్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నలుగురు లా ఆఫీసర్ల నియామకాలు



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్:** జిల్లాలో నలుగురు ప్లీడర్లను లా ఆఫీసర్లుగా విధులను నిర్వహిం చాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు పరిధిలో ఉన్న ఆయా కోర్టులలో విధులు నిర్వహించడానికి అదనపు ప్రభు త్వ ప్లీడర్లు, ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లను శాసన వ్యవహారాలు, న్యాయశాఖ ఎంపిక చేసింది. గవర్నమెంట్ ప్లీడర్‌గా కల్లూరి రవిందర్ రెడ్డి,అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ గా ఎం.ఎ రహీమ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు గా భీమగాని హరిబాబు గౌడ్ ,మక్తాల నర సింహలను ఆరునెలల కాలానికి కాకుండా ప్రభుత్వం నియామకాలు చేప ట్టే వరకు విధులను నిర్వహించేలా జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఉత్తర్వులు జారీ చేసారు.వీరు సీనియర్ సివిల్ కోసం అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్ జడ్జి కోర్టు , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ భువనగిరి, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు,రామన్నపేట చౌటుప్పల్ కోర్టు లలో విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వారికి ఆదేశాలను జారీ చేసారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** మహిళల సమ స్యల పరిష్కారానికే అంగన్‌వాడీ కేం ద్రాల్లో శుక్ర వారం సభకు శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పే ర్కొన్నారు. మహిళల ఆరోగ్యం, భద్రతతో పాటు సమస్యల పరిష్కారానికి ఇందులో ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. శుక్రవారం కొత్త పల్లి మండలం మల్కాపూర్ గ్రామం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సభ కార్యక్ర మాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహి ళలు కుటుంబం కోసం ప్రతి రోజు హెల్తీ ఫుడ్ తీసు కోవాలని, వారు బాగుంటేనే ఆ ఇల్లు బాగుంటుం దని, ఆ జిల్లా బాగుంటుందని పేర్కొన్నారు. జిల్లాలో వినూత్నంగా శుక్రవారం సభకు శ్రీకారం చుట్టామని, అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణీలు,



బాలిం తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులు మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని, గర్భిణు లకు సాధారణ ప్రసవాలు జరిగేలా యోగాతో పాటు సరైన సూచనలు, సలహాలు వైద్య సిబ్బంది అందిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్కారు అత్యాధునిక సదుపాయాలను కల్పిస్తు ందని పేర్కొ న్నారు. ప్రైవేటుకు ధీటుగా పనిచేస్తు న్నాయని, ప్రజలంతా వీటిని సద్వి నియోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకో వద్దని , పోషకా హారం తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లా డుతూ వ్యక్తిగత పరిశుభ్రత , అందరూ తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. ఆరోగ్యపర మైన సమస్యల పరిష్కారంతో పాటు సమాజంలో నెలకొన్న వివిధ రుగ్మతల నిర్మూలనకు శుక్రవారం సభ ఎంతో ఉప యోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావే శంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎంపిడివో ప్రభు, సిడిపిఓ ఉమారాణి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినే టర్ సంపత్, మహిళా శక్తి కో ఆర్డినేటర్ శ్రీలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సూప ర్‌వైజర్ అరుణ, టీచర్స్, వైద్య సిబ్బంది, అంగన్ వాడీ టీచర్స్, ఆశవర్కర్స్, మహిళలు పాల్గొన్నారు.

# 'ధరణి' సరిచేస్తేనే నిష్పాక్షిక రైతు భరోసా

**అనర్హులకు అందుతున్న రైతు భరోసా**

**రియల్ ఎస్టేట్ భూములు, గ్రానైట్ క్వారీలకు రైతు భరోసా**

**వాస్తవ విస్తీర్ణం కంటే పాసుపుస్తకాల్లో ఎక్కువ**

**చిన్న, సన్నకారు రైతులకు శాపంగా మారిన ధరణి**




**ప్రజాపక్షం/ఖమ్మం:**ప్రభుత్వం రైతు భరోసా విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించడమే కాకుండా వాస్తవ సాగు భూమికే రైతు భరోసా అందించాలని నిర్ణయించడం హర్షించదగిన విష యమే కానీ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి చట్టంలోని లోపాలను సవరించకుండా సాగు భూమికి, వాస్తవ సాగుదారులకు రైతు భరోసా అందించడం సాధ్యం కాదు. ధరణిలోని లోపాలు చిన్న, సన్నకారు రైతులకు శాపంగా మారితే పెద్ద పెద్ద భూ కమతాలు కలిగిన వారి పాలిట సాను కూల అంశంగా మారింది. 20 ఏళ్ల క్రితం వ్యవ సాయేతర భూమిగా మార్చి ఇండ్లు నిర్మించుకు న్న పట్టణానికి అనుకుని ఉన్న వేల ఎకరాల భూములకు రైతు భరోసా వస్తుంది. రెవెన్యూ రి కార్డులలో వ్యవసాయేతర భూమిగా మార్పు చెందిన పట్టా దారు పాసుపుస్తకాలు అందజేయ డంతో రైతు భరోసాకు ఇబ్బంది లేకుండాపోయి ంది. వ్యవసాయేతర భూములుగా మార్చుకుని రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేసిన వేల ఎక రాల భూములకు ఇప్పుడు రైతు బంధును గత ప్రభుత్వం అందిస్తుంది. గ్రానైట్ క్వారీలు, వా గులు, వంకలు క్షేత్ర స్థాయి రెవెన్యూ సిబ్బందిని ప్రలోభపరిచి పట్టాదారు పాసుపుస్తకాల్లో నమో దు చేయించుకున్నారు. కొంత మంది ప్రబుద్ధులు మరో అడుగు ముందుకేశారు. ఖమ్మం రూరల్ మండలంలో ఒక గ్రామంలో వాస్తవ సాగుభూమి 1100 ఎకరాలు ఉండగా పట్టాదారు పాసుపుస్త కాల ప్రకారం మొత్తం విస్తీర్ణం 1400లకు చేరి నట్లు తెలుస్తుంది. ఇందులో గ్రానైట్ క్వారీలు, వాగులు, వంకలు పట్టా భూములుగా నమోద య్యాయి. 300 ఎకరాలు అదనంగా ఎలా వచ్చి చేరిందన్న దానిపై విచారణలేదు. ఇది ఒక గ్రా మానికో లేదా రెండు గ్రామాలకో పరిమితం కా లేదు. కల్లూరు, వైరా సహా పలు మండలాల్లోని రెవెన్యూ గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. బోన కల్ మండలంలో ఓ రైతు తనకు వాస్తవ సాగు రెండు ఎకరాలు ఉండగా అప్పటి రెవెన్యూ సిబ్బ ంది అతని పేర ఐదున్నర ఎకరాల పట్టా చేశారని దీనిపై కొందరు గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాధుడు లేదు. తెలంగా ణలో గడిచిన పదేళ్ల కాలంలో భూ కమతాలు పెరిగాయి. భూమి వ్యాపార వస్తువుగా మారిన తర్వాత వ్యాపార వర్గాలు భూమిపై పెట్టుబడి పెట్టడం తిరిగి అమ్మకాలు చేయడం కోసం వేల ఎకరాలను కొనుగోలు చేశారు. మారు మూల గ్రామాలలో సైతం వంద, యాబై ఎకరాలు నగ రాలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్ర తినిధులు, వ్యాపారవేత్తలు కొనుగోలు చేశారంటే ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఇప్పుడు ఆ భూ ములన్నింటికి రైతుబంధును వర్తింపజేస్తున్నారు. ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోకుండా రైతు భరోసాను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తే మళ్లీ సన్న, చిన్నకారు రైతులు, ఎగుమ, దిగువ, మధ్య తరగతి రైతులకు కాకుండా మళ్లీ రైతు భరోసా వ్యాపారులు, రాజకీయ వేత్తలు, ప్రజా ప్రతినిధుల ఖాతాల్లోకి చేరుతుంది. వ్యవసాయేతర భూమిగా మారిన తర్వాత కూ డా పట్టాదారు పాసుపుస్త కాల్లో సాగు భూమిగా కొనసాగుతున్న లక్షలాది ఎకరాలను పట్టాదారు పాసుపుస్తకాల నుంచి తొలగించాల్సి ఉంది. అలాగే గ్రానైట్ క్వారీలు, ఊర చెరువులు, వా గులు పట్టాలు చేయిం చుకున్న వ్యక్తుల నుంచి వాస్తవ సాగు భూమిని మినహాయించి మిగిలిన భూమిని విడ గొట్టాల్సి ఉంది. పైన పే ర్కొన్న విధంగా కొంద రికి ఇది సానుకూల అం శంగా మారితే మరి కొందరికి శాపంగా మా రింది. 1980 దశకంలో ప్రభుత్వం ఓ సర్వే నెంబరులోని కొంత భూమిని సేకరిస్తే ఇప్పుడు ధరణి పుణ్యమా అని ఆ సర్వే నెంబరు మొత్తం ప్రభుత్వ భూమిగా చూపు తుంది. అలాగే 1970 దశకంలో ఖమ్మంజిల్లాలో నాగార్జున సాగర్ కాలువ నిర్మాణం కోసం భూమిని సేకరించారు. కాలువ కోసం సేకరిం చిన భూములకు సంబంధి ంచి కూడా ఆసర్వే నెంబర్లు అన్ని ప్రభుత్వ భూ ములుగానే ధరణిలో చూపెడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల ఎకరాల భూమి ధరణి పుణ్యమా అని భూ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా నమోదు కావ డంతో అసలైన రైతులు తీ వ్రంగా నష్టపోతు న్నారు. కలెక్టర్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఈ సమస్యకు పరిష్కారం దొరక లేదు. ఇప్పుడు ధరణిలో సమస్యలకు పరి ష్కారం చూపకుండా రైతు భరోసాను అమలు చేస్తే మళ్లీ పాత కథే పునరావృతమవుతుంది. రైతు భరోసా అమలుకు ముందు ధరణి లో పెండిం గ్‌లో ఉన్న సమస్యలకు తక్షణం పరిష్కారం చూపడంతో పాటు వ్యవసాయేతర భూ ములకు అందుతున్న రైతు భరోసా పై క్షేత్రస్థాయిలో విచా రణ జరిపి వాటికి రైతు భరోసా అందకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే మరల అవే సమస్యలు పునరావృతమవుతాయి. మళ్లీ అనర్హు లకే లబ్ది చేకూరే అవకాశం ఉంది.

## అప్పల బాధతో రైతు ఆత్మహత్య

**ప్రజాపక్షం/చందంపేట:** అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న నల్గొండ జిల్లా చందం పేట మండలం తెల్దేవరపల్లి గ్రా మంలో చోటు చేసు కుంది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం భావత్ రమేష్ తనకు ఒక ఎకరం భూమి ఉంది. అందులో గతంలో మూడు బోర్లు వేస్తే నీళ్లు రాకపోవ డంతో అప్పులు పాలయ్యాడని, ఆదే విధంగా నాలుగు ఎకరాలు కౌలుకు చేస్తున్న తరుణంలో ఈ సంవత్సరం వర్షాలు లేక వేసిన గింజలు మొలకె త్తకపోవడంతో బుధవారం తను సాగు చేస్తున్న వ్యవసాయ భూములోని చెట్టుకు ఉరివేసుకొని ఉన్నాడని తెలి పారు. ఆ చుట్టుపక్కల వ్యవసాయ దారులు గమనించి వెంటనే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు సిరియస్‌గా ఉందని చెప్పడంతో వారు హైదరాబాద్ ప్రైవేట్ ఆసు పత్రికి తరలించారు. గురువారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలి పారు. అతనికి ఒక కుమారుడు ఒక కూతురు భార్య ఉన్నట్లు తెలిపారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## సిఎంను కలిసిన డాక్టర్ రాజకుమార్

### భువనగిరి చిన్నారులకు సిఎం అభినందనలు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన శ్రీ ఆర్కే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చావా రాజ్ కుమార్, డాక్టర్ చావా అశ్లేష దంప తులు హైదరాబాదులో శుక్రవారం కలిశారు. వారి కుమారుడు మాస్టర్ చావా తారక్ నంద, చావా ఆకృతి ఇం డియా బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి చిన్నా రులను అభినందించారు. ఏప్రిల్ నెలలో చిన్నారులకు ఢిల్లీలోని ఇండి యా బుక్ ఆఫ్ రికా ర్డును సంస్థ కాన్వ కేషన్ నందు ఈ అవార్డును చిన్నారులకు బహుకరించారు. ఈ సందర్భంగా సీఎం చిన్నారులకు అభినందనలు తెలియజేస్తూ వారు ఇటువంటి అవార్డులు మరెన్నో సాధించి వారి తల్లిదండ్రులకు మన రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యా తులు తీసుకు రావలసిందిగా చిన్నారులను ఆశీర్వదించారు.

## గుండ వెంకటరాములు మృతి సిపిఐకి తీరనిలోటు



**ప్రజాపక్షం/తొర్రూరు రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ అమ్మాపురం గ్రామ శాఖ అగ్ర నాయకులు గుండ వెంకట రాములు మృతి సిపిఐ పార్టీకి తీరనిలోటని సీపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు, మాజీ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మాపురంలో సీపిఐ సీనియర్ నేత కామ్రేడ్ గుండ వెంకటరాములు అనారోగ్యంతో మృతి చెందారు. తమ్మెర విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో సీపిఐ నాయకులు నివాళులర్పించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వెంకటరాములు తన జీవితాంతం కమ్యూనిస్టు పార్టీకి, కార్యకర్తలకు అండగా నిలబడి వారి కష్ట సుఖాలలో మమేకం అయ్యేవాడన్నారు. ఒక నిఖార్సైన కమ్యూనిస్టు నాయకున్ని కోల్పోయిందని, జీవితాంతం కమ్యూనిస్టు సిద్దాంతాలకు లోబడి పేద ప్రజల పక్షాన పోరాడిన వెంకటరాములు మృతి ఈప్రాంతానికి తీరనిలోటన్నారు. సీపిఐ గ్రామ శాఖ అధ్యక్షులు బూరుగు యాదగిరి, మాజీ సర్పంచ్‌లు గూడెల్లి అయిలయ్య, మామిండ్లపల్లి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఘణపురం లక్ష్మణ్, గూడెల్లి ఎల్లయ్య, మాజీ వార్డు సభ్యులు పంజాల సోమయ్య, నకిరెడ్డి సమ్మిరెడ్డి, యాకాంతాచారి, జనగం శ్రీనివాస్, పంజాల పాపయ్య, బ్రహ్మచారి, కొలిపాక యాకయ్య, చెన్నమల్లు, తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలిపారు.

## గంజాయి నిర్మూలనకు జాగిలాల సేవలు



**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా నిర్వహిస్తున్న వెహికల్స్ చెకింగ్ నందు జాగిలాల సేవలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లాలో గంజాయి నర్కొటిక్ డ్రగ్ ఓపియం అల్ప్రాజోలం , వంటి మాదక ద్రవ్యాల మూలాలు లేకుండా చేయడానికి జిల్లా నుండి అక్రమ రవాణా జరగకుండా జిల్లా పోలీసు విస్తృత స్థాయిలో వెహికల్ చెక్కింగ్స్ స్పెష్ల్ డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని ఇందులో బాగంగా గురువారం మునిపల్లి టోల్ ప్లాజా వద్ద నిర్వహిస్తున్న వహికిల్స్ చెక్కింగ్ నందు మాదక ద్రవ్యాల ఉనికిని కనుగొనడానికి స్నీపర్ నార్కోటిక్, ఎక్సోసిప్స్ ను నివృత్తి చేయగల సామర్థ్యమున్న జాగిలాలసేవలను వినియోగించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గంజాయి పండించినా అక్రమ రవాణ చేసినా చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## మొక్కల సంరక్షణకు కృషి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కాకతీయ వైద్య కళాశాలలో ట్రైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాళోజి నారాణణ రావు హెల్త్ యూనివర్సిటి రిజిష్ట్రార్ డాక్టర్ సంధ్య, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాం కుమార్ రెడి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సురేందర్, విశ్రాంత డీఎఫ్ఓ పురుషోత్తం, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, శ్రవన్‌లతో పాటు వైద్య విద్యార్థులతో కలిసి కేఎంసీ ఆవరణలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనుగడ కోసం, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకుగాను విరివిగా మొక్కలు నాటాలని కోరారు. కాళోజి నారాయణ రావు హెల్త్ యూనివర్సిటి రిజిష్ట్రార్ సంధ్య మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లే మూలాధారమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. కేఎంసీ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ అజయ్ కుమార్, ఐఎంఎ మెడికల్ స్టూడెంట్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అశ్విన్ నవదీప్, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు మొక్కలు నాటారు.

## సెప్టెంబర్ 9లోగా కళాక్షేత్రం పూర్తి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** హన్మకొండలో ప్రజాకవి కాళోజి నారాయణ రావు పేరుతో నిర్మిస్తున్న కాళోజి కళాక్షేత్రం నిర్మాణ పనులను సెప్టెంబర్ 9 లోగా పూర్తి చేయాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి సూచించారు. శుక్రవారం కాళోజి కళాక్షేత్రం నిర్మాణ పనులను కుడా వైస్ చైర్మన్ డాక్టర్ అశ్విని తనాజి వాకడేతో కలిసి చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో శంఖుస్థాపన చేసిన కళాక్షేత్రం తొమ్మిదేండ్లు గడిచినా పనులు పూర్తి చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి ఈ కాలోజి కళాక్షేత్రం పనులపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పనులను పరిశీలించారు. కుడా పిఒ అజిత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## వలస కూలీ హత్య

**ప్రజాపక్షం/గీసుకొండ:** గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ రవిని గురువారం అర్ధరాత్రి హత్య చేసినట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు. వారి కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో ఎంజీఎం మార్చురీలో డెడ్ బాడీ భద్రపర్చినట్లు తెలిపారు. మృతుని పూర్తి వివరాల గురించి తెలిసిన వారు, బంధువులు గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ బాబులాల్ తెలిపారు.

## విద్యార్థుల్లో నైపుణ్యానికి ప్రాధాన్యం

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రీడ నైపుణ్యాన్ని పెంపోందించాలని ..తద్వార విద్యార్థులు శరీరక.మానసిక అభివృద్దిని సాధిస్తారని ఉపాధ్యాయ ఎంఎల్‌సి కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సిద్దిపేట చంద్రమౌళి గార్డెన్‌లో శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు తోట సతీష్, కార్యదర్శి కదుర్ల హరికృష్ణ అధ్యక్షతన వ్యాయామ ఉపాధ్యాయుల ఓరియేఎంటేషన్ తరగులు, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

# ప్రజాసేవకే అంకితం

ప్రజాదర్బార్‌లో
మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ప్రజాపక్షం/కొత్తగూడ:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పంచాయతిరాజ్, గ్రామీణబివృద్ధి, మంచినీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ మహబుబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం మండలాల ప్రజల కోసం నెలకు రెండు సార్లు ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏజెన్సిలో విధులు నిర్వర్తించే అదికారులు ప్రజలకు అంకితభావంతో సేవలు అందించాలన్నారు.అనంతరం పంచాయతిరాజ్, ఇంజనీర్,వైద్యశాఖ, రోడ్లు భవనాలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయం, హర్టికల్చర్, అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమవేశం నిర్వహించారు.కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుదీర్ రామ్‌నాథ్ కేకన్, పిఒ చిత్ర మిశ్రా, డిఎఫ్ఒ బత్తుల విశాల్,ఆర్డిఓ అలివేలు, జడ్పి సిఇఓ నర్మద, డిపిఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధే లక్ష్యం

**కొత్తగూడ:**గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండలంలోని వేలుబెల్లి ఆర్అండ్‌బి రోడ్డు నుండి చేరువుముందు తండా బిటీ రోడ్డు, కత్తెర వాగు పై బ్రిడ్జి ఐదు కోట్లు మంజూరు కాగా ఎదుళ్ళపల్లి నుండి ఓటాయి రహదారికి 5 కోట్ల 8 లక్షల రూపాయాలు మంజూరి కావడంతో శిల పలకం అవిష్కరించారు. నాయకులు పాల్గోన్నారు.

## ప్రేమ పేరిట యువకుడి వేధింపులు
## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** గత సంవత్సర కాలంగా ప్రేమ పేరుతో యువకుడు చేస్తున్న వేధింపులను భరించలేక ఇంట్లోనే ఫ్యానుకు ఉరివేసుకొని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట పట్టణ పరిధిలోని కాళ్లకుంట కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణ పరిధిలోని కాళ్ల కుంట కాలనీకి చెందిన చిగురు కావ్య(17) పట్టణంలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతుంది. కాగా సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి తేజ కావ్యను ఇంటి నుంచి కాలేజికి వెళ్లే సమయంలో వెంబడిస్తూ,తనను ప్రేమించాలని,పెళ్లి చేసుకోవాలంటూ నానా ఇబ్బందులకు గురి చేస్తూ వస్తున్నాడని,కావ్య ఇంటి వద్ద మకాం వేసే వాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో అతడి వేధింపులను భరించలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో కావ్య ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని చనిపోయినదని తెలిపారు. తల్లి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** అధికారులు గ్రామీణ స్థాయిలోని కార్యక్రలాపాలను సక్రమంగా నర్వర్తించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, పంచాయితీ కార్యదర్శులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళ శక్తి పథకం, వన మహోత్సవం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ మధ్యాహ్న భోజనం, సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన నిర్వహించాలన్నారు. మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని, మహిళలకు పాడిగెదెలు, పలు రంగాల్లో ఆసక్తి ఉన్న వారికి వారిపై రుణాలు ఇచ్చేందుకు అవగాహన కల్పించాలన్నాను. వనమహోత్సవంలో భాగంగా గతంలో నాటిన మొక్కల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నర్సరీలు పర్యవేక్షిస్తూ మొక్కలు ఎదిగేలా చూడాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలల ఆరోగ్యాన్ని పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి వారానికి ఒకసారి భోజనం చేస్తూ పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రకబలకుండా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, డ్రైనేజీలు శుభ్రంగా చేయాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, జిల్లా పరిషత్ సిఈఓ అనిల్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి మొగులప్పతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధిః** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను సంగారెడ్డి పోలీసులు చెక్ పెట్టినారు. వీరి నుండి సుమారు 36 లక్షల విలువ గల 43 తులాల బంగారం, ఐదు కిలోల వెండి ,రెండు మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకున్నారని జిల్లా అదనపు ఎస్పీ ఎ సంజీవరావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం సంగారెడ్డి నందు ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ నందు అదనపు ఎస్పీ మాట్లాడుతూ నిందితులు జాదవ్ జైరాం, జాదవ్ శంకర్ అలియాస్ శంకు, ఇప్పూ సింగ్ అలియాస్ ఇప్పూ ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి సంగారెడ్డి మెదక్,సిద్దిపేట సిరిసిల్ల తదితర జిల్లాలో గ్రామ శివారు ప్రాంతంలో తాళం వేసిన ఇండ్లను ఎంచుకొని రాత్రి నేరాలకు పాల్పడుతూ తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదిస్తు జెల్సాలు చేస్తున్నారు. ఇదే క్రమంలో గత నెల జూన్ 2వ తేది ఆర్ధరాత్రి సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం ఎర్రారం గ్రామంలో 8 తాళం వేసి ఉన్న ఇండ్లు జూన్ 8వ తేది ఆర్ధరాత్రి మాసాన్ పల్లి గ్రామంలో 4 తాళం వేసి ఉన్న ఇండ్లు జూన్ 14 వ తేది ఆర్ధరాత్రి చౌటకూర్ గ్రామంలో 5 తాళం వేసి ఉన్న ఇండ్లలో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పపడుతూ బంగారు వెండి అభరణాలు ,నగదు చోరి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య, గౌడ్, జోగిపేట సిఐ అనిల్ కుమార్, జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ శ్రీకాంత్ సిసియస్ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకొన్న మొత్తం టీంను జిల్లా ఎస్పీ అబినందించి రివార్డులు అంనందించి రివార్డులు అందించడం జరుగుతుందన్నారు.



## భవిష్యత్ తరాలకు ఆస్తులు కావు.. ప్రకృతిని అందిద్దాం

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య,
ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్‌పూర్:**భవిష్యత్ తరాలకు అందించాల్సింది ఆస్తులు కావని.. ప్రకృతి అని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య అన్నారు. శుక్రవారం శివునిపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మొక్కలు నాటారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. భూ మండలంలోని సమస్త ప్రాణుల జీవన మనుగడకు చెట్టేఆధారం. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలంటే మనిషికి 5 మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తూ పెంపకం బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రజల మనుగడకు చెట్లు ఉండాలి. అడవిని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు. పద్మశ్రీ వనజీవి రామయ్య వనాల సంరక్షణ, పచ్చదనం పెంచేందుకు తన జీవితాన్నే అంకితం చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మొక్కల సంరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ గ్రామాన పండ్ల చెట్లు, వేప చెట్లు ఎక్కువగా పెంచేలా చూడాలన్నారు. నా ఎంపీ ఫండ్స్ నుంచి పాలిటెక్నిక్ కళాశాలకు అవసరమైన సాయం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. జనగామ జిల్లాలో ఉన్న 1 శాతం అడవిని 33 శాతానికి పెంచుకోవాలన్నారు. ఈ ఏడాది కోటి మొక్కలు నాటే విధంగా జిల్లా కలెక్టర్, డీఎఫ్ఓ ప్రణాళిక రూపొందించాలి.యుద్ధ ప్రాతిపదికన జనగామ జిల్లాలో అడవులను పెంచే కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలోని మండల కాంప్లెక్స్‌లతోపాటు స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ భూముల్లో మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో అడిషనల్ కోర్సులతో పాటు జాబ్ ఓరియంటెడ్ కోర్సులను ప్రవేశపెడతామన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో త్వరంలో ఇంజినిరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అడిషనల్ కలెక్టర్ పింకేష్, డీఎఫ్ఓ లావణ్య, డీపీఓ అనిల్‌కుమార్, డీఆర్‌డీఓ మొగులప్ప, ఆర్డీవో డీఎస్ వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ పోచయ్య, ఎంపీడీఓ ఉమాదేవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అపరిచితులతో జాగ్రత్త!

**ప్రజాపక్షం/మహబూబాబాద్‌ప్రతినిధి:** మహిళలు రక్షణ చట్టాలపై అవగాహణ కలిగి ఉండాలని షీ టీం ఎస్ఐ సునంద అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్, అడిషినల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆదేశాల మేరకు మహబూబాబాద్‌లోనిఅమనగల్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నందు శుక్రవారం విధ్యార్థులకు మహిళా రక్షణ చట్టాలపై, షీటీం విధుల గురించి, మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్, ఈవిటీజింగ్, పోక్సో, సైబర్ నేరాలనిరోధంపై అవగాహన కల్పించారు. ఎస్సై సునంద మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులనుండి ఫోన్ కాల్స్ వచ్చినా లిఫ్ట్ చేయవద్దని, విధ్యార్థినీ, విధ్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. పాఠశాల రెండవ హెచ్ఎం డానియల్, అధ్యాపకులు దుర్గయ్య,షీటీంఏఎస్ఐఆనందం,రమేష్, ఎహెచ్‌టీయు డబ్ల్యూపిసి సుప్రజ, భరోసా జయశ్రీ పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం

కలెక్టర్ రాహుల్‌శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి భూసేకరణపై ్ధసేకరణపై, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 3 మండలాల పరిధిలోని 13 గ్రామాలలోని రైతులు భూములను కోల్పోతున్నారని, భూసేకరణ విషయంలో రైతుల యొక్క సలహాలు , సూచనలు తెలుసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రాజెక్ట్ ల కోసం భూ సేకరణ చేయడం జరుగుతుందని భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల అబీష్టం మేరకు భూసేకరణ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 130.5 ఎకరాలు 35 కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పు మాత్రమే సేకరిస్తున్నామని అన్నారు. గతంలో భూపాలపల్లి జిల్లాలో సింగరేణి ఓపెన్ కాస్ట్ ల కోసం భూసేకరణ చేయడం జరిగిందనీ ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగలేదని ఆయన గుర్తు చేశారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం సమర్పించగా రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టరు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, నేషనల్ హైవే ఈ ఈ మనోహర్, మూడు మండలాల రైతులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఐ వేధింపుల వల్లే ఆత్మహత్య

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి
పి.శంకర్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** దళిత ఎస్ఐ శ్రీ రాములు శ్రీ ను ఆత్మహత్య కు కారకుడైన అశ్వారావుపేట సి.ఐ జితేందర్ రెడ్డి తో పాటు నలుగురు కానిస్టెబుల్ లను,తదితరులపై హత్య నేరం కేసు నమోదు చేయాలని దళిత ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహత్య కు కారకుడైన సి.ఐ,కానిస్టెబుల్ లను,ఒ జర్నలిస్టు ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దళితబహుజన ఫ్రంట్, మాల హక్కుల సాధన సమితి అధ్వర్యంలో శుక్రవారం మెదక్ లోని కేవల్ కిషన్ భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ సిఐ వేధింపులను భరించలేక ఆత్మహత్య చెసుకొవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కానిస్టేబుల్ లను సస్పెండ్ చెసి, సి.ఐని సస్పెండ్ చేయకుండా కేవలం బదిలి చేశారన్నారు. మొత్తం సంఘటన పై న్యాయవిచారణ చెసి.సి.ఐ ని సస్పెండ్ చేసి హత్యనేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపొతె డిజిపి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్.ఐ ది ఆత్మహత్య కాదని ప్రభుత్వ హత్య అన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన వారికె రక్షణ లేదన్నారు. ఇప్పటికె రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.ఐ ఆత్మహత్య కు నిరసనగా ఉద్యమం చెపట్టమన్నారు. ఎస్.ఐ కుటుంబానికి న్యాయం జరిగె వరకు పోరాటం అగదని హెచ్చరించారు.నింధితులనుఅరెస్టుచేయకుండా పోలీసు ఉన్నతాధికారులు నిర్లక్ష్యం, వివక్ష పాటించడం తగదన్నారు.దళితుల పై దాడులనుఆరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్,డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి హన్మకొండ దయాసాగర్,మాల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మల మైసయ్య, యంఆర్ పిఎస్ జిల్లా నాయకుడు బాల్ రాజు, మురళి,వివిధసంఘాలనాయకులుస్వామి, ఎల్లం, నాగమణి, చంద్రం, యాకుబ్ పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పోస్టుల కోసం ప్రదక్షిణలు

మొదటి విడతలో సిద్దిపేట జిల్లాకు
మొండిచెయ్యి
రెండోవిడతలోనే ఆశలు నెరవేరేనా!



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం నియమించే కార్పొరేషన్ పదవులపై సిద్దిపేట జిల్లా నాయకులు గంపేడు ఆశలు పెట్టుకొని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తొలి విడతలో జరిగిన కార్పొరేషన్ భర్తీలో సిద్దిపేట జిల్లాకు ఒక్క పదవి కూడా దక్కలేదు. దీంతో రెండోవిడతలో నియమించే కార్పొరేషన్ పదవులపై సిద్దిపేటకు చెందిన సీనియర్ నాయకులు తమ బయోడెటా చేతపట్టుకొని గాంధీభవన్, సెక్రటేరియట్, మంత్రుల చుట్టు ప్రదక్షిణ చేస్తున్నారు. ఈసారి ఏలాగైనా తమకు అవకాశం కల్పించాలని తమ సన్నిహిత నేతలతో, మంత్రులపై ఒత్తిడి తెస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిన సిద్దిపేట జిల్లాలో బిఆర్ఎస్ హయాంలో సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు కీలక పదవుల్లో ఉన్నప్పటికి మరో 8 మందికి కీలకమైన నామినేషన్ పదవుల్లో అవకాశం కల్పించారు. సిద్దిపేట నియోజకవర్గం 40 ఏళ్లుగా కాంగ్రెస్ నుండి ప్రాతినిథ్యం కరవైంది. అప్పటి నుండి నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ మీద అభిమానంతో ఎత్తిన మూడు రంగుల జెండా దించకుండా తమభుజానమోస్తున్నారు. దశాబ్ద కాలం కిందట కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికి సిద్దిపేట ప్రాంతంలో తెలంగాణ ఉద్యమ ప్రభావం అధికంగా ఉండటం వల్ల ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నేతలకు సరైన గుర్తింపురాలేదు. అలాగే ఈ ప్రాంతపు కాంగ్రెస్ పార్టీ నాయకులకు సైతం కీలకమైన పదవులు లభించలేదు. ఎంఎల్‌సిగా ఫారుక్‌హుస్సేన్ అవకాశం వచ్చినప్పటికి కొన్ని రోజుల్లోనే బిఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం కాం గ్రెస్‌లోని పిసిసి చేనేత విభాగం చైర్మన్‌గా గూడురి శ్రీనివాస్‌కార్పొరేషన్‌పదవి లభిస్తుందని గంపేడు ఆశతో ఉన్నారు. ఐదు సంవత్సరాలుగా పిసిసి చేనేత విభాగం చైర్మన్‌గా పనిచేసిన శ్రీనివాస్ గతంలో సిద్దిపేట మార్కెట్ కమి టి చైర్మన్, కౌన్సిలర్‌గా పనిచేశారు.గతఅసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ విజయం కోసం కృషి చేశారు. అలాగే పిసిసి సభ్యునిగా దరిపల్లి చంద్రం సైతం గత పదేండ్లుగా కాంగ్రెస్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ వచ్చినట్లే వచ్చి చేజారింది. 2018అసెంబ్లీ ఎన్నికలో టిజెఎస్ పొత్తుతో టికెట్ చేజారింది. ఈసారి సైతం టికెట్ కోసం యత్నించినప్పటికి చివర్లోఅనూహ్యంగా పూజల హరికృష్ణ టికెట్ దక్కించుకున్నారు. ఈసారి ఎలాగైనా నామినేటెడ్ పదవుల్లో భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న దరిపల్లి చంద్రం ఏలాగైనా రాష్ట్రస్థాయి పదవి దక్కించుకునేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు. కార్మిక సంక్షేమ బోర్డు లేదా, ఇతర రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను ఆశిస్తున్నారు. రాష్ట్ర స్థాయి పదవి దక్కకుంటే చివరికి సిద్దిపేట డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (సుడా) దక్కించుకోవటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గూడురి శ్రీనివాస్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ చైర్మన్, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌లు ఏదైన తనకు అవకాశం కల్పించాలని ఉమ్మడి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ,జిల్లా ఇన్‌చార్జిమంత్రి కొండ సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఒత్తిడి తెస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో రాష్ట్రస్థాయి పదవులు దక్కితే జిల్లాలో కాంగ్రెస్ మరింత పుంజుకొని.. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ఇప్పటికైనా రెండో విడత కార్పొరేషన్ పదవుల్లో సిద్దిపేట నేతలకు అవకాశం లభిస్తుందని పలువురు నేతలు ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. రెండో విడత కార్పొరేషన్ పదవుల్లో సిద్దిపేట నాయకు లకు అవకాశం దక్కుతుందో..లేదో వేచిచూడాల్సిందే !

# బిజెపిని నిలువరించేందుకే కాంగ్రెస్‌కు మద్దతు

## అభివృద్ధి సంక్షేమానికి మద్దతు
## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ : పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** రాష్ట్రంలో మతతత్వ బిజెపి పార్టీని నిలువరించేందుకే కాంగ్రెస్ పార్టీతో కలిసి కమ్యూనిస్టులు పనిచేశారని, అందుకు ప్రజలు సైతం కలయికను ఏకీభవించి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమితి సమావేశానికి హాజరై పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కమ్యూనిస్టులు ఒంటరిగా పోటీచేసిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలవక పోయిన గెలుపు ఓటములను ప్రభావితం చేసే విధంగా కమ్యూనిస్టుల బలం ఉందన్నారు. రాష్ట్రంలో బిజెపిని నిలువరించాలని కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేశామని ప్రజలు ఆశీర్వదించారని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. అందుకోసం గ్రామాల్లో పార్టీ గ్రామశాఖల నిర్మాణం, ప్రజాసంఘాలను బలోపేతం చేసి మండలం నిర్మాణానికి పనిచేసే వారికి బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికి దేవరకొండ, మునుగోడు, ఆలేరు, భువనగిరి, కోదాడ నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని, పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా రానున్న నిర్మాణ మహాసభలు వేదక కానున్నాయన్నారు. కేరళ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సిపిఐ బలపడిందన్నారు. మోదీ క్రేజ్ తగ్గిందని ఇండియా కూటమి పార్టీలు ముందు నుండి అధికారం లక్ష్యంగా పనిచేస్తే అధికారం కూడా ఇండియా కూటమికి దక్కేదన్నారు. బిజెపి రాముడి పేరుతో రాజకీయం చేస్తే అయోధ్యలో ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట తప్పకుండా, ఆగస్టు లోపు రైతు రుణమాఫీ చేసి రైతు భరోసా, బీమా కల్పించి రైతుల్లో భరోసా నింపాలని సూచించారు. కాంగ్రెస్ సైతం బిజెపిని నిలువరించేందుకే బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలను పార్టీలో చేర్చుకుంటున్నట్లు కాంగ్రెస్ వాదన. కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోకపోతే బిజెపిలోకి బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి స్థానిక సమరంలో కాంగ్రెస్‌తో కలిసి ప్రజాప్రతినిధులుగా గెలుపొందాలని, ఆ దిశగా పార్టీని పటిష్టం చేయాలని శ్రేణులకు సూచించారు. నక్కలగండి శ్రీశైలం సొరంగ మార్గం, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని ప్రభుత్వానికి సూచించారు. బొల్లే శైలేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు వెంకటరమణ, జిల్లా కౌన్సిల్‌సభ్యులు బుచ్చిరెడ్డి, మైనోద్దీన్, వెంకటయ్య, రామస్వామి, వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఆంజనేయులు, అచ్చయ్య, పాండురంగారెడ్డి, బాబురావు, రంగారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, విజేందర్‌రెడ్డి, వెంకట్రాములు, జ్యోతిబస్, శ్రీను పాల్గొన్నారు.

## ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండల సమావేశం త్రిపురం వెంకట్‌రెడ్డి హాల్‌లో జరిగింది. సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు సిపిఐ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రాణత్యాగాలు చేసి హక్కులను సాధించుకున్న చరిత్ర పార్టీకి ఉందన్నారు. పాలకులు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారంటే కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. కేంద్రంలోని బిజెపి మాయమాటలు చెప్పి మూడోసారి అధికారంలో వచ్చిందన్నారు. రైతుల పట్ల వ్యవహరిస్తున్న వైఖరిని కేంద్రం విడనాడాలన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంకావాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలుతో పాటు అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ నిర్మాణం, విస్తరణ, ప్రజా సంఘాల నిర్మాణం గురించి వివరించారు. బలమైన పోరాటాలను నిర్మించాలని కోరారు. పార్టీ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, పార్టీ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, నాయకులు ఎడ్ల అంజిరెడ్డి, అప్పయ్య, శ్రీనివాస్, వెంకన్న, వెంకట్ రెడ్డి, గోవింద్ రెడ్డి, పఠాని సైదులు, ఆంజనేయులు, ఈశ్వరచార్యులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి యుగేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐవైఎఫ్ మానకొండూర్ మండల సమావేశం జరిగింది. సమావేశంలో యుగేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల అక్రమ సరఫరా పట్ల కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి అక్రమ రవాణా, అమ్మకాలపై దృష్టి సారించాలన్నారు. సరఫరా చేసే వ్యక్తులపై, అమ్మే వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. పట్టణాల్లోనే కాకుండా మారుమూల గ్రామాలకు మాదక ద్రవ్యాల సరఫరా యథేచ్ఛగా జరుగుతోందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకుని నియంత్రణ చేయాలన్నారు. విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. డ్రగ్స్ వినియోగం చేయడంతో జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యతో పాటు సమాజంలో వచ్చే రుగ్మతలపై అవగాహన కలిగించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎఐవైఎఫ్ కార్యకర్తలు, నాయకులు యువతకు అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగస్వామ్యం కావాలని యువతకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శ్రీరాముల శంకర్, శ్రీరాముల రవి, రేగుల రమేష్, గడ్డం కోటేష్, రమేష్, రాజు, శ్రీహరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అరకొర వసతులతో తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. బాలెంల ఎస్‌సి గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థుల డిమాండ్‌ను పరిగణలో తీసుకోని వారిని వేదింపులకు గురిచేసిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోగుల గణేష్, భూక్యా సిద్దార్థ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభంతో ఫీజుల బకాయిలు సరిగా విడుదల చేయకపోవడంతో కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు కళాశాలల యజమాన్యాలు ఇవ్వడం లేదని, సర్టిఫికెట్లు కావాలంటే బకాయలు కట్టించుకొని ఇస్తున్నారన్నారు. దీంతో బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్టిఫికెట్స్ కావాలంటే కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యార్థులను ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## విద్యార్థులను చైతన్యం చేసేందుకు ఎఐఎస్‌ఎఫ్ ముందుండాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మందపవన్



**ప్రజాపక్షం/సిద్ధిపేట ప్రతినిధి :** విద్యార్థులను చైతన్యం చేసేందుకు ఎఐఎస్‌ఎఫ్ ముందుండాలని , సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే విధంగా వారిని తయారు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ సిద్దిపేట జిల్లా నిర్మాణ బాధ్యులు, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా వారిని చైతన్యం చేయాలన్నారు. ప్రభుత్వాలు అవలంభించే విద్యార్థి వ్యతిరేక విధానాలను విద్యార్థి లోకానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ సంఘం నిర్మాణం, బలోపేతం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగేం మధు, జెర్రిపోతుల జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్యాల శేకర్, సహాయకార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు నుంచి భద్రాచలంను కాపాడండి

కరకట్ట నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్

సిపిఐలో పలువురు చేరిక



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రతిసారి వర్షాకాలంలో గోదావరి వరదల కారణంగా భద్రాచలం పట్టణ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, గోదావరి ముంపు తక్షణం కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం ప్రాంతాన్ని పాలకులు వివక్షకు గురి చేస్తున్నారని, విభజన తర్వాత ఈ ప్రాంతం పరిస్థితి దయనీయంగా తయారైందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు భద్రాచలంలో దేవుని భూములు ఆంధ్రప్రదేశ్‌లోకి చేరాయని ఆయన తెలిపారు. భద్రాచలంలో సిపిఐ సమావేశం శుక్రవారం రావులపల్లి రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారని నైసర్గిక స్వరూపం ఇతర అవసరాల దృష్ట్యా ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయండి అన్న ప్రభుత్వాలు స్పందించకపోవడం శోచనీయమన్నారు. భద్రాచలాన్ని అనుకుని ఉన్న గుండాల, పురుషోత్తమపట్నం, ఏటపాక, కన్నాయి గూడెం, పిచ్చుకలపాడు గ్రామాలను తెలంగాణ లో విలీనం చేయాలని పాషా డిమాండ్ చేశారు. ప్రతిసారి వర్షాకాలంలో గోదావరి వరదల కారణంగా భద్రాచలం పట్టణ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తక్షణం కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కరకట్ట పనులు ప్రారంభించకపోతే సిపిఐ పక్షాన ఆందోళనలు చేపడతామన్నారు. భద్రాచలాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

**సిపిఐ పలువురి చేరిక...** ఎస్‌కె సాబీర్‌పాషా, రావులపల్లి రవికుమార్, వెంకటేశ్వరరావు సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు సిపిఐలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సాధనపల్లి సతీష్, పీతాని మాన్యశ్రీ, కె.అశోక్, చిట్టిపోతుల కృష్ణయ్య, శంకర్, సాగర్, మెట్టు శ్రీనివాస్, సారపొంగు ఏసు, చిదరగడ్డ శేఖర్, పసుపులేటి నాగు, ఎండి వలీ, మహేష్, పగళ్ల సతీష్, మేరీ, లక్ష్మి నారాయణ, మంగమ్మ తదితర 200 మంది ఉన్నారు. పార్టీలో చేరిన వారందరూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సాబీర్ పాషా కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వీసం శెట్టి పూర్ణచందర్, శివాజీ, ఎస్‌విఎస్ నాయుడు, వెంకటేశ్వరరావు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం





ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సిపిఐ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి తలపెట్టిన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని, అందుకు కార్మిక సంఘాలకు ఎఐఎస్‌ఎఫ్ మద్ధతు ఉంటుందన్నారు. బొగ్గు గనుల వేలంలో ఈ ప్రాంతం యువత ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రత్యక్షంగా ఉద్యోగులు, పరోక్ష్యంగా ఆధారపడిన వారు ఉపాధి కోల్పోతారన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి బొగ్గు గనులను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కోల్ బెల్ట్ ప్రాంతం నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యులు కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి వేలం వేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకునే విధంగా చర్యలు వారు డిమాండ్ చేశారు, కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సోను, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, గుడిసెల ప్రణీత్, ఎల్కపల్లి వెంకట సాయి, గాజుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 60 బొగ్గు బ్లాగులను వేలం వేలం వేయడం దారుణమని, సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరబోయిన వెంకటేష్, డిహెచ్‌పిఎస్ నాయకులు కాంతారావు, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్ డిమాండ్‌చేశారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనుల వేలం వేయడాన్ని నిరసిస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో భూపాలపల్లి జిఎం కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. దీక్షలకు ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆరబోయిన వెంకటేష్,సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని, జాతీయ సంపద అయిన బొగ్గు బ్లాక్‌లను ఆదాని, అంబానీలకు కట్టబెడుతూ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుందని విమర్శించారు. నరేంద్రమోదీ రామగుండం పర్యటనలో సింగరేణి ప్రైవేట్ పరం చేయనని ప్రలోభాలు పలికి మూడవసారి అధికారంలోకి రాగానే సింగరేణి బ్లాకులను వేలంవేయడం విచారకరమన్నారు. కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి బొగ్గు బ్లాకులను హైదరాబాదులోని వేలానికి పెట్టాడని ఆరోపించారు. ఇప్పటికైనా శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ ను వేలం వేయకుండానే సింగరేణి సంస్థకు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రవీణ్ డిమాండ్ చేశారు.దీక్షలను ఎఐటియుసి వైస్‌ప్రెసిడెంట్ మాతంగి రామచందర్ హాజరై దీక్షా శిబిరంలో కూర్చున్న నాయకులకు దండాలు వేసి ప్రారంభించారు. ఆరవ రోజు దీక్షలో సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చివరి రోజు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్

**మద్దతు తెలిపిన పాలు పలువురు నాయకులు...** రిలే నిరాహార దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి బంధు సాయిలు, టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి సేవా నాయక్ మద్దతు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పొన్నగంటి లావణ్య, పీకే రవికాంత్, ఎండి యాకూబ్ పాషా, ఓద్దులే సాకేత్ రెడ్డి, మాతంగి దిలీప్, చల్లూరి రక్షిత, కొమ్మెర రమేష్ చారి, మట్టి కృష్ణ, గోలి లావణ్య,పుప్పాల వనిత, గోనాల తిరుపతి, సిపిఐ పట్టణ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సిపిఐ యాదాద్రి జిల్లాకార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట సిపిఐ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీల సాధనకు పార్టీ శ్రేణులు ప్రజల పక్షాన పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కొత్తగా రేషన్ కార్డులు, అర్హులకు ఇళ్లు, ఇంటిస్థలాలు, మహిళలకు పెన్షన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్లాపురం బైపాస్, దాతారుపల్లి నుంచి వెళ్లే మల్లాపురం అండర్‌పాస్ నిర్మించాలన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఇబ్బందికరంగా మారిన బ్రిడ్జిని తొలగించాలని, స్థానిక బస్టాండ్‌లో అన్ని రకాల బస్సులు నిలిపే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. స్థానికంగా నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు కళ్లెం క్రిష్ణ, బండి జంగమ్మ, కొల్లూరు రాజయ్య, కలెపల్లి మహేందర్, బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటీ రాములు, కోఆప్షన్ సభ్యులు పేరు బోయిన పెంటయ్య పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, ఆరె పుష్ప, పేరబోయిన బంగారి, మాటూరు మల్లయ్య, గుండ్లపల్లి నరేష్, చుక్కల రాజు, మేకపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.




## అంగన్‌వాడీలను విస్మరించడం తగదు

ఎఐటియుసి కార్యదర్శి రాములు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** అంగన్‌వాడీలను ప్రభుత్వం విస్మరించడం విచారకరమని ఎఐటియుసి రాజన్న సిరిసిల్లా కార్యదర్శి కడారిరాములు అన్నారు. శుక్రవారం బొప్పాపురం గ్రామంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు శశిరేఖ ముప్పైసంత్సరాలుగా చిన్నారులకు సేవలు అందించి మృత్యువుతో పోరాడి మరణించడం బాధాకరమని తెలిపారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. హెల్త్‌కార్డులు, రిటైర్డ్‌మెంట్ భెనిఫిట్స్. పనిభారం ఎక్కువైన భరిస్తూ పిల్లల భవిష్యత్‌కు అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తారన్నా రు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. శశిరేఖ కుటుంబానికి కారుణ్య నియామకాన్ని ఇవ్వాలని, రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ప్రకటించాలని రాములు డిమాండ్ చేశారు.



## దృష్టి పెట్టండి (మొదటి పేజీ తరువాయి)

వాగ్దానం అబద్ధంగా మారిపోయిందని మండిపడ్డారు. ఇటీవల 14 ఖరీఫ్ పంటలకు మోదీ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర చూస్తే ఎంఎస్‌పిపై స్వామినాథన్ సిఫార్సును కేవలం ఎన్నికల జిమ్మిక్కుగానే వాడుకున్నారనేది స్పష్టమైందన్నారు. మెజారిటీ ప్రభుత్వ వాటాను విక్రయించిన ఏడు ప్రభుత్వ రంగ సంస్థలలో 3.8 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని, ఇందులో కూడా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుస్ రిజర్వ్ పోస్టులకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. టాప్ 20 ప్రభుత్వ రంగ సంస్థలలో 2016 నుండి మోదీ ప్రభుత్వం స్వల్పంగా ప్రభుత్వ వాటాను విక్రయించడంతో 1.25 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోయారని వివరించారు. జిడిపిలో తయారీ రంగ వాటా యుపిఏ హయాంలో ఉన్న 16.5 శాతం నుండి మోదీ ప్రభుత్వంలో 14.5 శాతానికి పడిపోయిందని తెలిపారు. గడిచిన పదేళ్ళలో ప్రైవేటు పెట్టుబడులు ఘోరంగా పడిపోయాయని, జిడిపిలో ముఖ్యభాగమైన కొత్త పెట్టుబడుల ప్రణాళిక 20 ఏళ్ళలో కనిష్టంగా ఏప్రిల్ – జూన్ మధ్య కేవలం రూ.44,300 కోట్లుగానే ఉన్నాయన్నారు. గత ఏడాది ఇదే సమయంలో ప్రైవేటు పెట్టుబడులు రూ.7.9 లక్షల కోట్లుగా ఉండేదని తెలిపారు. ద్రవ్యోల్బణం ముప్పు ఇప్పటికీ గరిష్ఠంగానే ఉందని పేర్కొన్నారు. పిండి, పప్పులు, బియ్యం, పాలు, చక్కెర, ఆలుగడ్డ, టమాటా, ఉల్లిగడ్డ, ఇతర నిత్యవసర ఆహార వస్తువుల ధరలు చుక్కలను అంటాయని విమర్శించారు. ఫలితంగా కుటుంబ పొదుపు 50 ఏళ్ళ కనిష్ఠానికి చేరిందన్నారు. వందేళ్ళలో లేనంతగా ఆర్థిక అసమానతలు అత్యధికంగా ఉందని, గ్రామీణ భారతంలో వేతన వృద్ధి తిరోగమనంలో ఉందని వివరించారు. గ్రామీణ నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందని, మే మాసంలో 6.3 శాతం నుండి 9.3 శాతానికి చేరుకుందన్నారు. ఉపాధి హామీ పథకంలో సగటు పనిదినాలు తగ్గిపోయాయని తెలిపారు. గడిచిన పదేళ్ళలో మోదీ ప్రభుత్వం పిఆర్ (ప్రజా సంబంధాల) ద్వారా ప్రజల కనీస అంశాలను పట్టించుకోలేదని, ఈ ఏడాది జూన్ తరువాత ఇలా ఎంత మాత్రం సాగబోదని, ప్రజలు జవాబుదారీతనాన్ని కోరుతున్నారని ఖర్గే అన్నారు. యథేచ్ఛగా ఆర్థిక వ్యవస్థను మార్చుకోవడం ఇక ఆపేయాలన్నారు.

## విశ్వాస పరీక్షలో ఓడిన ప్రచండ

(మొదటి పేజీ తరువాయి)

యుఎంఎల్ హఠాత్తుగా తన ఒప్పందాలను రద్దు చేసుకొని, ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకోవడంతో నేపాల్‌లో మరోసారి రాజకీయ సంక్షోభం తప్పలేదు. సిపిఎన్ యుఎంఎల్, నేపాలీ కాంగ్రెస్ (ఎన్‌సి లోపాయికార ఒప్పందం కుదుర్చుకొని, ప్రభుత్వాన్ని కూలదోశాయని ప్రచండ వ్యాఖ్యానించారు. అంతకు ముందు, నేపాల్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 100 క్లాజ్ 2 ప్రకారం ఓటింగ్ కోసం విశ్వాస తీర్మానాన్ని హెచ్‌ఒఆర్‌లో స్పీకర్ దేవ్ రాజ్ ఘిమిరే అనుమతించారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత, ప్రధాని ప్రచండ ప్రతిపాదించిన 'ఓట్ ఆఫ్ ట్రస్ట్' వీగిపోయిందని ఆయన ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 76 క్లాజ్ 2 ప్రకారం కొత్త ప్రభుత్వ ఏర్పాటు కోసం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పార్టీలను ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయని ఘిమిరే ప్రకటించారు. మెజారిటీ పార్టీ లేదా పార్టీల కూటమి నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాల్సిందిగా కోరుతూ రాష్ట్రపతి రామ్‌చంద్ర పాడెల్‌కు పూర్తి నివేదికను పంపినట్టు తెలిపారు. కాగా, సిపిఎన్ యుఎంఎల్‌కు ఎన్‌సి మద్దతునిస్తున్నందువల్ల, ఈ రెండు పార్టీలు ఒక కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని పరిశీలకులు అంటున్నారు. ప్రతినిధుల సభలో ఎన్‌సికి 89, సిపిఎన్ యుఎంఎల్‌కి 78 చొప్పున సీట్లు ఉన్నాయి. దిగువ సభలో సాధారణ మెజారిటీకి 138 సభ్యుల మద్దతు అవసరంకాగా, ఈ రెండు పార్టీల బలం 167గా ఉంది. ఒలీ పార్టీ కంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఎన్‌సి ప్రధాన మంత్రి పదవిని కోరడం లేదని సమాచారం. మాజీ ప్రధాని ఒలీ ప్రధానిగా ఎన్నికయ్యేందుకు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని తీర్మానించిందని అంటున్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు షేర్ మహదూర్ దేవుబా ఇప్పటికే ఒలీని తదుపరి ప్రధానిగా పేర్కోవడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. అయితే, మిగతా పదవీ కాలాన్ని ఒలీ, దేవుబా పంచుకోవడానికి వారి మధ్య ఒప్పందం కుదిరినట్టు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పిటిఐ తన వార్తా కథనంలో పేర్కొంది. హెచ్‌ఒఆర్‌లో కేవలం 32 సీట్లు ఉన్నప్పటికీ, సిపిఎన్ యుఎంఎల్ మద్దతుతో, మూడోసారి నేపాల్ ప్రధానిగా ఎన్నికైన ప్రచండ, ఇప్పుడు అదే పార్టీ యూటర్న్ తీసుకోవడంతో పదవి కోల్పోయారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## న్యాయచట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

**ప్రజాపక్షం/కేశంపేట :** విద్యార్థులు న్యాయచట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కేశంపేట ఎస్ఐ రాజ్ కుమార్ తెలిపారు. కేశంపేట మండలంలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఎస్ఐ రాజ్‌కుమార్ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు కొత్త క్రిమినల్ చట్టం, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు సమాజంలో కొందరు సంఘ విద్రోహ శక్తులు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతూ యువతను తప్పు దారి పట్టిస్తున్నారని, యువత, విద్యార్థులు చెడు మార్గంలోకి వెళ్లకుండా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే వారిపై ప్రతిఘటించాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కృష్ణయ్య, అశోక్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీకోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మస్కు నర్సింహ్మా, చిన్నోళ్ళ మల్లేశ్, పాండు, దాసు , శ్రీకాంత్‌లు రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైరన్‌గా భాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డిని నగరంలోని ఓ దేవాలయం వద్ద కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీకోసం కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఎవ్వరూ నిరాశ పడవద్దని తెలిపారు. అందరిని అదుకోవడానికి పార్టీ కృషి చేస్తుందన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు నివారిద్దాం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి వ్యాప్తంగా శుక్రవారం డ్రై డే నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా విభాగాల అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిహెచ్ఎంసి ఆయా విభాగాల అధికారులు సంయుక్తంగా అన్ని సర్కిళ్లలో కాలనీ ప్రజలకు, పాఠశాలల విద్యార్థులకు వర్షాకాలం నిల్వ నీరుతో, ఇంట్లో, పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వ్యాప్తి చెంది, వాటి ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, విష జ్వరాలు ప్రబలుతాయని, దోమల నివారణకు, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని, ఇంట్లో ఉన్న పనికిరాని దోమల నివాస వస్తువులు తీసివేయాలని, డ్రమ్ములు, తొట్ల లో ఉన్న నిల్వ నీటిని పడవేసి, శుభ్రం చేసుకోవాలని, ఎల్లప్పుడూ ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గుంతలో నీరు నిలువకుండా మట్టితో పూడ్చాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని నగరంలోని అన్ని సర్కిళ్లలో ప్రజలకు అవగాహన కల్పించారు. జోనల్ కమిషనర్లు కూడా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు బస్తీ దవాఖానా ఆకస్మిక పరిశీలన చేసి డెంగ్యూ, మలేరియా వ్యాధులుపై అరా తీశారు. కార్యక్రమంలో ఆయా సర్కిళ్లలో డిప్యూటీ కమిషనర్లు, ఏఎం హెచ్ ఓ లు , వైఎంటమాలజీ అధికారులు, ఏఎంహెచ్వోలు, ఆయా కార్పొరేటర్లు పాల్గొన్న పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

## కాలనీల్లో పార్కుల సుందరీకరణ

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాలనీల సంక్షేమ సౌకర్యాల కోసమే పార్కులను సుందరీకరణ చేస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బియన్‌రెడ్డి డివిజన్‌లోని వైదేహినగర్ నార్త్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు ఆహ్వానం మేరకు కాలనీలో చిల్డ్రన్ పార్కును పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్కులను సుందరనీకరణ చేస్తూ ప్రజల సౌకర్యాలు కోసం అందుబాటులో తీసుకొస్తున్నామని, పార్కుల ద్వారా సీనియర్ సిటిజనులకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతోపాటు అహ్లాద్కరమైన వాతావరణం కల్పించడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. పార్కులకు సౌకర్యాల కోసం మరింత నిధులు ఏర్పాటు చేయడానికి సహకరిస్తామని కాలనీ అసోసియేషన్కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి, అనిల్ చౌదరి, బుచ్చిరెడ్డి, సతీష్ గౌడ్, శివశంకర్, శ్రీకాంత్, రామ్ గోపాల్‌మనోజ్, కాలనీవాసులు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఆదిత్య, వేణుగోపాల్ కృష్ణ, విద్యాసాగర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విధిగా మొక్కలు నాటాలి

రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రామిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతామని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్లోని ఇంద్రప్రస్థ కాలనీలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల అవసరాల నిమిత్తం జిహెచ్ఎంసి పరిధిలో పార్కులు, చెరువులు సుందరికరణ చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అర్బన్ బయో డ్రవర్శిటీ చంద్రశేఖరరావు, సత్యనారాయణ, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ జకీయా సుల్తానా, జిహెచ్ఎంసి ఏఈ నాయక్, పార్టీ నాయకులు వెదరీ యోగేశ్వర్ రెడ్డి, గణేష్, గోపి, డివిజన్ పార్టీ అధ్యక్షులు దిద్ది శశిధర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బ్రహ్మారెడ్డి మమతా మల్లేష్ గౌడ్, మంజులారెడ్డి, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు రామ్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## శాఖకు పేరుతెచ్చే విధంగా విధులు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ట్రాఫిక్ మార్షల్స్ పోలీస్ శాఖకు వన్నె తెచ్చే విధంగా విధులు నిర్వర్తించాలని సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి అన్నారు. పెరుగుతున్న వాహనరద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సిఎస్‌సి)సహకారంతో ట్రాఫిక్ నియంత్రణకు శిక్షణ అనంతరం విధుల్లోకి తీసుకునే కార్యక్రమాన్ని శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, సైబరాబాద్ జాయింట్ సిపి ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్, ఎస్‌సిఎస్‌సి ప్రతినిధులు రమేష్ ఖాజా, రాజేష్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మహంతి మాట్లాడుతూ క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేసి పోలీస్‌శాఖకు వన్నెతెచ్చే విధంగా విధులు నిర్వర్తించాలని ట్రాఫిక్ మార్షల్‌కు సూచించారు. జాయింట్ సిపి ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్,ట్రాఫిక్ మార్షల్స్‌ను అభినందిస్తూ వారికి భరోసాను కల్పించారు. ట్రాఫిక్ మార్షల్స్‌కి కంపెనీల సహకారంతో తగిన వేతనం చెల్లించడం జరుగుతుందని, వారు ట్రాఫిక్ నియంత్రణ, పూర్తిస్థాయి విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రహేజా మైండ్ స్పేస్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ అడిషనల్ డిసిపిలు శివకుమార్ వీరన్న, మాదాపూర్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, రాజేంద్ర నగర్ ట్రాఫిక్ ఏసిపి బాలాజీ, శంషాబాద్ ట్రాఫిక్ ఏసిపి పి.నాగభూషణం, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసిపి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ నియంత్రణకు
# ఐక్యంగా కృషిచేయాలి

జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డెంగ్యూ నివారణకు ఆయా అధికారులందరూ కలిసి కట్టుగా సమన్వయంతో కృషి చేయాలని కమిషనర్ ఆమ్రపాలి కాట కోరారు. శుక్రవారం కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులు, జోనల్ కమిషనర్‌లతో నగరంలో డెంగ్యూ నియంత్రణ కు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ...డెంగ్యూ హాట్ స్పాట్ పాయింట్స్ గుర్తించి, ఆయా ఏరియాలలో ప్రజలకు, పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టిడెంగ్యూ లక్షణాలు, డెంగ్యూ నివారణ, కట్టడికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. డిఎంహెచ్ఓలు, ఎంటమాలజీ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నమోదైన డెంగ్యూ కేసుల వివరాలు, సంబంధితుల అడ్రస్‌లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నుంచి తీసుకోవాలని తెలిపారు. వాటర్ స్టా గ్నేషన్ పాయింట్స్, సంపుల నిర్మాణ ప్రతిపాదనలు వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డెంగ్యూ ప్రబలిన ఇంటి చుట్టు పక్కల గల మిగిలిన ఇండ్ల వారికి ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జోనల్ కమిషనర్‌లు



తమ పరిధిలో డెంగ్యూ నియంత్రణకు అవసరమైన పటిష్ట చర్యలుతీసుకోవాలని తెలిపారు. శానిటేషన్ కార్మికుల హాజరు శాతం మెరుగు పరచాలన్నారు. అక్రమ భవన నిర్మాణాలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో జోనల్ కమిషనర్లు, శానిటేషన్, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలను పురుగుల్లా చూసేవారు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



**హైదరాబాద్:** బిఆర్ఎస్ నుంచి వలసలు ఇంకా కొనసాగుతాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. త్వరలోనే భారాస ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం కాబోతుందని చెప్పారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. కల్యాణ్ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు దానం నాగేందర్ అందజేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. భారాసను కేటీఆర్ కార్పొరేట్ కంపెనీలా నడిపారని విమర్శించారు. ఎమ్మెల్యేలకు కేసీఆర్ అపాయింట్‌మెంట్‌కూడా దొరికేది కాదని.. ఒకవేళ దొరికినా గంటల తరబడి నిలబెట్టేవారని ఆరోపించారు. 'బిఆర్ఎస్‌పై నమ్మకం లేకే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఆ పార్టీలో ఎమ్మెల్యేలను పురుగుల్లా చూసేవారు. విలువ లేని చోట ఉండలేక కాంగ్రెస్‌లో చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో అందరికీ విలువ ఉంటుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలకు ప్రత్యేక అభివృద్ధి నిధి ఉండేది. బిఆర్ఎస్ వచ్చాక నియోజకవర్గ అభివృద్ధికి నిధులే లేవు. కెటిఆర్ బినామీలే రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఆ వివరాలను త్వరలోనే బయటపెడతా. ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి బిఆర్ఎస్ నేతలు మేకపోతు గాంభీర్యాలు పలుకుతున్నారు' అని దానం నాగేందర్ అన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

మండల ప్రత్యేకాధికారి రాజారత్నం



**ప్రజాపక్షం/కేశంపేట :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కేశంపేట మండల ప్రత్యేకాధికారి రాజారత్నం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీజనల్ వ్యాధుల పట్ల అధికారులకు పంచాయితీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు పడుతున్న కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు డయేరియా, డెంగ్యూలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్త చర్యలతో పాటు గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల వైద్యాధికారి నిఖిత, ఎంఈఓ మనోహర్, ఎంపిఓ నర్సింహులు, పంచాయితీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

ముఖ్యమంత్రి పర్యటనకు ప్రకడ్బందీగా ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** గీత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం అబ్దుల్లా పూర్‌మెట్ పర్యటన సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి లష్కర్ గూడలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లు గీత కుటుంబాలు తమ కుల వృత్తి పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రతి ఏటా గీత కార్మికులు కల్లు తీస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రమాదాల భారిన పడకుండా గీత కార్మికులకు అండగా నిలిచేందుకు బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. గీత కార్మిక లైఫ్ సేవ్ కిట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నదని తెలిపారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే కార్యక్రమంలో జిల్లా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ కె.శశాంక మాట్లాడుతూ కార్యక్రమం జరిగే స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పార్కింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదివారం లష్కర్‌గూడ చేరుకుని, అక్కడ జరిగే కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వెళ్ళే దాకా ఎవరెవరికి అప్పగించిన బాధ్యతలను వాళ్ళు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓ అనంత్‌రెడ్డి, ఎల్‌బి నగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, మాజీ జెడ్‌పిటిసి బింగి దేవదాస్‌గౌడ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు స్వాగతం పలికిన పాఠశాల అభివృద్ధి కమిటీ

**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** రాజేంద్ర నగర్ సర్కిల్ శివరాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపైన వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు చెబుతూ ఇక్కడి పాఠశాలకు నూతన ఉపాధ్యాయులుగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధి కమిటీ ఘనంగా స్వాగతం తెలియజేసింది. శుక్రవారం పాఠశాల అవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గౌరవం ఉందని, మంచి గురువులను విద్యార్థులు ఎప్పటికి మరచి పోలేరన్నారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారిని ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎపిపిఎస్ చైర్మెన్ సునితా, ఉపాధ్యాయులు సుదర్శన్, వెంకటయ్య, రాజమహేందర్‌రెడ్డి, సుధాకర్, మొగులయ్య, అంజయ్య, జనార్ధన చారీ, నరసింహ చారీ, కరుణాకర్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫ్రైడే డ్రై డే పాటించాలి



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ వార్డు కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్ రెడ్డి భాగ్యనగర్ కాలనీ వాసులతో కలిసి దొమల నివారణపై ప్రజల్ని చైతన్యం చేసేందుకు అవగాహన సదస్సును ఇంచార్జీ ప్రసన్నతో కలిసి నిర్వహించారు. అనంతరం వారు ఇంటింటికి తిరిగి పరిశుభ్రతపై అవగాహన కల్గించారు. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్ చంద్ర మేయర్ మద్దెల లతాప్రేమ్ గౌడ్,8,12,22వ డివిజన్‌ల కార్పొరేటర్లు భూపాల్ గౌడ్, ముద్దం రాముతో కలిసి సీజనల్ వ్యాధులు(డెంగ్యూ,మలేరియా)ప్రబలకుండా ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఈసందర్భంగా పూల కుండీలల్లో, టైర్లలో నిలిచి ఉన్న నీళ్లను తొలగించి ప్రతి శుక్రవారం ప్రజలంతా ఫ్రైడే డ్రై కార్యక్రమంలో పాల్గొని దొమల లార్వాకు ఆవాసాలైన నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. అదే విధంగా 15వ డివిజన్ శాంతి నగర్ కాలనీలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి,గౌస్ కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, నాయకులు సందీప్ ముదిరాజ్,దశరథ్,కాలనీ వాసులతో కలిసి ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ యాదయ్య,ఏఈ వి.రాజ్ కుమార్,శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ నరేష్,ఆశా కార్యకర్తలు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం/తుర్కయాంజల్ :** కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని పిసిసి సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపాలిటి 18 వ వార్డు కౌన్సిలర్ కాకుమను సునీల్ శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధి కమ్మగూడ 18వ వార్డు లోని స్మశాన వాటిక లో రూ. 20లక్షల తో నూతన స్నానాలు గదుల నిర్మాణానికి కాలని వాసులతో కలిసి కౌన్సిలర్ కాకుమాను సునీల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి సహకారంతో వార్డుని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో విచారణ గురువు తాతిరెడ్డి జయరాజు, సహ గురువు మాదాను ఆరోగ్య స్వామి, చర్చ్ కమిటీ సభ్యులు కాకుమాను ఆరోగ్యం, అడ్డగట్ల మరియరాజు, కాకుమాను అంకిత్, గ్రామ పెద్దలు భోనగిరి మరియన్న, కాకుమాను మార్తయ్య , 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకుమాను రాజు, పోలిశెట్టి వినయ్, ఆకురాతి రాకేష్, రమేష్, ప్రకాష్, థామస్, జోహార్, సంతోష్ , రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు



## ప్రతీఒక్కరు మొక్క నాటాలి

ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/యాచారం :** హరితహరంలో ప్రతిఒక్కరు ఒక మొక్క నాటాలని యాచారం ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్కిజ్‌గూడ, మేడిపల్లి, యాచారం గ్రామాల్లో హరితహరం కింద తీస్తున్న గుంతలను అయన పరిశీలించారు. ఈసధర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ హరిత హరం కింద మొక్కలు నాట డానికి అన్ని ఎర్పాట్లు చేయాలని అన్నారు. గుంతలను నిభంధనల ప్రకారం తీయాలని సూచించారు. ప్రతి గ్రామంలో మొక్కలను నాటడానికి అన్ని ఎర్పాట్లు చేయాలని అన్నారు. అయా గ్రామాల్లో అమలౌతున్న పల్లే ప్రగతి పనులను అయన పరిశీలించారు. వర్మికంపోస్టు పిట్లను వినియోగం లోకి తెవాలని అన్నారు. వర్షా కాలం మొక్కలు నాటడానికి అనువైన కాలమని అన్నారు. గుంతలు తీసి సిద్దంగా ఉంచాలని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా పాఠశాల, రైతులు పోలాల్లోని గట్ల వద్ద గుంతలు తీసి మొక్కలు నాటాలని అన్నారు. రైతులను ఒప్పించి మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్దం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఇసి శివశంకర్‌రెడ్డి, అసిస్టేంట్ కృష్ణామాచారి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రాన్ని బిఆర్ఎస్ నాశనం చేసింది



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్

**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి :** పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక కుటుంబం రాష్ట్రాన్ని నాశనం చేసిందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఆరోపించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్ హాల్లో బిజెపి రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తూనే ఉందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. దేశంలో అనేక మంది కార్యకర్తల కృషితో నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్‌డిఎ సర్కారు సాకారమైందన్నారు. తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలిపించిన ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా 8 సీట్లను అందించారన్నారు. రాష్ట్రంలో పోలింగ్ బూత్ లెవెల్‌లో పార్టీని మరింత బలపర్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు పోరాటం కొనసాగిద్దామని తెలిపారు.

### రాహుల్ దమ్ముంటే ఒయూలో తిరగగలవా?

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తోందంటూ మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి నేను సవాల్ చేస్తున్నా...మీ పార్టీయే తెలంగాణలో అధికారంలో ఉంది కదా...ఉస్మానియా యూనివర్శిటీలో తిరిగే దమ్ముందా..?అంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ చేసిన మోసాలను గుర్తించి బిజెపికి 8 ఎంపి సీట్లు అందించి తెలంగాణలో బిజెపియే ప్రత్యామ్నాయం అని తీర్పునిచ్చిన తెలంగాణ ప్రజలకు సెల్యూట్ అని వ్యాఖ్యానించారు. కార్యవర్గ సమావేశానికి వచ్చిన వారితో కలిసి లేచి నిలబడి తెలంగాణ ప్రజలకు సెల్యూట్ చేయించారు. తెలంగాణలో కాంగ్రెస్ లేదంటే బిఆర్ఎస్ మాత్రమే అధికారంలో ఉండాలని ఆ రెండు పార్టీలు కుట్ర చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి నుండి యువతను కాపాడుకుందాం : ఎస్పి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** జిల్లాలోని కళాశాలల పోలీసు అధికారులో మత్తు పదార్థాల నియంత్రణ కోసం అవగాహన సదస్సు జిల్లా ఎస్పీ జానకి నిర్వహించారు. మత్తు పదార్థాల నుండి యువతను కాపాడు కుందామని అధికారులకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నియంత్రణ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లాలో పోలీసు అధికారులు విద్యా సంస్థల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా వలన భవిష్యత్తులో యువత ప్రమాదంలో పడుతుందని, మత్తు పదార్థాల బారిన పడి ఎంతో మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని యువత జల్సా జీవి తంలో పాటు సులభంగా డబ్బు సంపాదన కోసం అక్రమ మార్గంలో గంజాయి రవాణాకు పాల్పడుతున్నారని ఇలాంటి యువత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అలాగే ప్రతి కాలేజీలలో యాంటి డ్రగ్ కమిటీలను నియ మించాలని, అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయితో ఇతర మత్తు పదార్థాలను గతంలో విక్రయాలు, రవాణాకు పాల్పడిన నేరస్తులతో పాటు, మత్తు పదార్థాలను వినియోగించే వ్యక్తుల సమాచారాన్ని సేకరించ డంలో వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని మనమందరం సమన్వ యంతో పనిచేస్తూ సమాచారాన్ని సేకరించడంతో వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని మనమందరం సమన్వయంతో పనిచేస్తూ భవిష్యత్తులో మహబూబ్‌నగర్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మారుద్దామని ఎస్పీ అధికారులకు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అమ్మకాల సమాచారాన్ని ఇవాలనుకునే వారు జిల్లా పోలీసు కంట్రోల్ రూం నెంబర్ 8712659360 కి సమాచారం ఇవ్వగలరు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి , డిఎస్పి వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డిఎస్పి జివి రమణారెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇన్స్పెక్టర్ గవర్నమెంటు ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**ప్రజాపక్షం/వంగూర్ :** వరంగల్ జిల్లా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సొంత గ్రామమైన డిండిచింతపల్లి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే కుటుంబసభ్యులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు అంద జేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి విద్యా ర్థులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, యుటి ఎఫ్ జిల్లానాయకులు చిన్నయ్య, లింగమయ్య, కాంగ్రెస్‌సీనియర్ నాయ కులు విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని జిల్లెల్ల గ్రామానికిచెందిన డొక్కాసాయిలు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు మృతునిభార్య పోషమ్మ, కుమారులు బాల స్వామి, నర్సింహ్మలకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్ర మంలో దేవాలయచైర్మన్ కొమ్మగొని రవిగౌడ్, వైస్‌చైర్మన్‌వీరెడ్డి, శ్యాంసుం దర్‌రెడ్డి, మాజీకో ఆప్షన్‌మెంబర్ గుమ్మకొండ బాల్‌జంగయ్య, గ్రామకాం గ్రెస్‌పార్టీ ఎస్సిసెల్ అధ్యక్షుడు గుమ్మకొండ మహేందర్, ఎముకరవి, మద నశ్రీను, బాలరాజు, దశరథం, రమేష్, జంగయ్య, సుల్తాన్, వినయ్, శ్రీశైలం, రాజు, యాదయ్య, పాండు, నర్సింహ్మ పాల్గొన్నారు. అదేవిధంగా



ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామానికిచెందిన మాడ్గు ఇదమయ్య అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న అంబేద్కర్ యువ జన సంఘంసభ్యులు రూ.42వేల ఆర్థికసాయాన్ని వారి కుమారుడు బిక్ష పతికి అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజనసంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## పెండింగ్ స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలచేయాలి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదలచేయాలని బిఆర్‌ఎస్వి జిల్లా నాయకులు డి.శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బిఆర్‌ఎస్వి నాయ కులు కొల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శిం చారు. ఈసందర్భంగా డి.శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8వేలకోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉండగా రాష్ట్రప్రభుత్వం కనీసం స్పందించడంలే దని, కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడినానాటినుండి నేటివరకు విద్యారంగంపై కనీసం నోరు మెదపలేదని, విద్యాశాఖమంత్రిని కేటాయించకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిలు పెండింగ్‌లో ఉండటంవలన పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించేం దుకు బకాయిలతో ముడిపెడుతున్నారని ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తక్ష ణమే బకాయిలను చెల్లించి విద్యార్థులకు ఉన్నతమైన విద్యావకాశాలు కల్పించాలన్నారు.

# జూన్‌లో 9 రోజులు తీవ్ర వేడి



**న్యూఢిల్లీ :** భారతదేశంలో సుమారు 62 కోట్ల మందితో సహా ప్రపంచవ్యాప్తంగా 500 కోట్ల మంది వాతావరణ మార్పు కారణంగా ప్రస్తుత జూన్ మాసంలో తొమ్మిది రోజులు తీవ్రమైన వేడిని అనుభవించారు. అమెరికాకు చెందిన స్వతంత్ర శాస్త్రవేత్తల బృందం క్లైమేట్ సెంట్రల్ చేసిన వార్తా పరిశోధనలో ఈ అంశం వెల్లడైంది. జూన్‌లో భయంకరమైన వేడి ప్రభావానికి భారత దేశంలో సుమారు 62 కోట్ల మంది, చైనాలో 58 కోట్ల మంది, ఇండోనేషియాలో 23 కోట్ల మంది ,నైజీరియాలో 20 కోట్ల మంది, బ్రెజిల్‌లో 17.6 కోట్ల మంది, బంగ్లాదేశ్‌లో 17 కట్ల మంది, అమె రికాలో 16.5 కోట్ల మంది, యూరోప్‌లో 15.2 కోట్ల మంది, మెక్సికోలో 12.3 కోట్ల మంది, ఇథి యోపియాలో 12 కోట్ల మంది, ఈజిప్టులో 10 కోట్ల మంది లోనయ్యారని తేలింది. 'జూన్ 16–24 తేదీల మధ్య ప్రపంచవ్యాప్తంగా 60 శాతం జనాభా మూడింతల తీవ్రమైన వేడిని అను భవించింది. దీనికి వాతావరణ మార్పే కారణం' అని అధ్యయనం పేర్కొంది. క్లైమేట్ సెంట్రల్ చీఫ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆండ్రూ పెర్షింగ్ మాట్లా డుతూ వందేళ్ళకు పైగా బొగ్గు, చమురు, సహజ వాయువును కాల్చుతుండడంతో ప్రపంచం మరింత ప్రమాదంలోకి నెట్టబడుతోందన్నారు. ఈ ఏడాది వేసవిలో ప్రపంచవ్యాప్తంగా అసహజ విపత్తులు సంభవించాయని, కర్బణ కాలుష్యం ఆగిపోయేంత వరకు ఇది సాధారణంగా కొనసా గుతూనే ఉంటుందని తెలిపారు. క్లైమేట్ షిఫ్ట్ ఇండెక్స్ – వాతావరణ మార్పు సూచీ (సిఎస్‌ఐ) ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులను సూచిస్తుంది. జూన్ 16–24 తేదీలలో 497 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన వేడిని అనుభవించారని, సిఎస్‌ఐ స్థాయి మూడుకు పెరిగిందని, అంటే వాతావరణ మార్పులు ఉష్ణోగ్రతను మూడింత లుద పెంచే అవకాశం ఉందని సూచిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. భారతదేశం అత్యధిక ఉష్ణో గ్రత, సుదీర్ఘ కాలం వడగాలులను చవి చూసిం దని, సుమారు 40 వేల వడ దెబ్బ కేసులు నమో దవగా, వంద మందికి పైగా మరణించారని తెలి పింది. తీవ్రమైన వేడి నీటి సరఫరా, విద్యుత్ గ్రిడ్ లపై తీవ్ర వత్తిడి పెంచిందని, దీంతో ఢిల్లీ తీవ్ర మైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని పేర్కొంది. భారత వాతావరణ విభాగం ప్రకారం సాధారణ ఏప్రిల్, జూన్ మాసాల కంటే ఈ సారి దేశవ్యాప్తంగా 40 శాతం ప్రాంతంలో వడగా లలు రెట్టింపు సంఖ్యలో నమోదయ్యాయని వివ రించింది. ఢిల్లీలో మే 13 నుండి 40 రోజులు వరుసగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, 60 మరణాలు సంభవిం చాయని మీడియా వార్తల్లో వచ్చింది. సౌదీ అరేబియాలో హజ్ యాత్రలో కనీసం 1300 మంది వడగాలలు కారణంగా మరణిం చారు. క్లైమేట్ సెంట్రల్ విశ్లేషణ ప్రకారం మక్కా నగరం మే 18 నుండి కనీసం మూడింతలు వాతావరణ మార్పునకు లోను కాగా, మే 24 నుండి ఐదింతల మార్పు నమో దైంది. జూన్ మాసంలో చివరి రెండు వారాలలో అమెరికా వరుసగా తీవ్ర ఉష్ణోగ్రతలకు లోనైంది. మొదటి విడత వడగాలి దేశం దక్షిణాది ప్రాంతం, మెక్సికో, మధ్య అమెరికా దేశాలలో వీచింది. మెక్సికోలో సుమారు 125 మంది మర ణించగా, జూన్ 21న సోనోరా రాష్ట్రంలో ఉష్ణో గ్రత 52 డిగ్రీలకు చేరింది. వరల్డ్ వెదర్ ఆట్రి బ్యూషన్ గ్రూప్ నిర్వహించిన అధ్యయనంలో మే, జూన్ మాసాలలో వాతావరణ మార్పు 35 సార్లు తీవ్రమైన ఉష్ణోగ్రతలకు కారణమైందని తెలియజేసింది. ఈజిప్టులో దాదాపు 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఇటీవల నమోదవగా, దక్షిణ ప్రాంతంలోని అస్వాన్‌లో 40 మంది మరణిం చారు. అత్యధిక ఉష్ణోగ్రతలు అధిక విద్యుత్ విని యోగానికి దారితీయడంతో ఎలక్ట్రిక్ గ్రిడ్‌పై ఓవర్ లోడ్ పడకుండా ఈజిప్టు ప్రభుత్వం ప్రతి రోజు విద్యుత్ కోతలు విధించింది.

# అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ముందుకు

### ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా తన ప్రణాళికలు ఉన్నాయని పెండింగ్ పనులను పూర్తిచేసేం దుకు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిధుల మంజూరుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లాకేంద్రంలోని నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణపు పనులను కొల్లాపూర్ చౌరస్తాలో పుట్ట పాకమహేందర్‌నాథ్ విగ్రహ సమీపంలో పను లను పరిశీలించారు. అనంతరం టిటిడి కల్యాణ మండప సమీపంలో అండర్‌డ్రైనేజిపైప్‌లైన్ల పను లను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎమ్మె ల్యేగా ఉన్నవ్యక్తి అనుమతులులేకుండానే కొన్ని రహదారులు వేయడం జరిగిందని అదేవిధంగా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌పనులకు బిల్లులురాకపో వడం వల్లే ఆగిపోయాయని తనదృష్టికి వచ్చిం దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధుల మంజూరుకు చర్యలు తీసు కుంటానని తెలిపారు. ఎట్టిపరిస్థి తుల్లో పనులను వేగవంతం చేయా లని సూచించారు. ఈనెల17న కొల్లాపూర్ చౌరస్తాలో శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని అదేవి ధంగా టిటిడివద్ద అండర్‌డ్రైనేజి పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. అనం తరం కూరగాయల రైతులతో మాట్లాడివారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, నిజాముద్దిన్, సునీంద్ర, జక్కరాజ్‌కుమార్‌రెడ్డి, బచ్చన్నయాదవ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.



## వర్షాకాల సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్ 8వ వార్డులో పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు నిల్వ లేకుండా చేయాలని, లేకుంటే నీటిని నుండి దోమలు తయారై ప్రమాదకరమైన డెంగ్యూ వ్యాధికి దారి తీస్తుందని , దీంతో పాటు మలేరియా, టైఫాయిడ్ లాంటి భయాంకరమైన జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఆఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని 8వ వార్డులో ప్రారంభించి పరిసరాల పరిశుభ్రతపై నిల్వ నీటిని తొలగించే విధానంపై ఆ వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చీర్ల నాగన్నసాగర్ , ఖాజా మైనోద్దీన్ , కో ఆప్షన్ సభ్యులు జేఎమ్ మిషేక్ , తహసీన్ వహిద్ అలీ, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీధర్ , వార్డు ఆఫీసర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పిలు, ఆశా వర్కర్లు, వాటర్ వర్కర్లు పాల్గొన్నారు.

## సిఐటియు నాయకుల అరెస్టు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట వనపర్తి జిల్లా కేంద్రానికి శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నడంతో ముందస్తుగా కొత్తకోట పోలీసులు సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ వికలాంగుల సంఘం జిల్లా కన్వీనర్ భీమా ప్రభాకర్ రెడ్డి ఉదయం తెల్లవారు జామున అరెస్టుచేసి పోలీసులు సొంత పూచికతో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ అరెస్టులు కాదు ఆరు గ్యారెంటీలను అమలు చేయండి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచిన కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఆరోపించారు. కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పట్టణంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం 400 పెంచాలని, పెండింగ్‌లో నా అభయాసం డబ్బులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ. 500లకు సిలిండర్‌ను ప్రజలకు అందించాలని పక్క గృహాలు లేని వారు వందలాది మంది ఉన్నారని వారినందరిని గుర్తించి ఇండ్ల నిర్మాణం కొరకు నిధులు కేటాయించి లబ్దిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## వన మహోత్సవంలో చెట్లు నాటిన మున్సిపల్ చైర్మన్

**ప్రజాపక్షం / పెబ్బేరు :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారంగా పెబ్బేరు పురపాలక సంఘంలో వన మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని 7వ వార్డులోని అయోధ్యనగర్‌లో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కరుణ శ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా మొక్కలు నాటాలని, మొక్కలను సంరక్షించాలని ప్రజలను కోరారు. 2023లో పెబ్బేరుకు హరితహారంలో అవార్డు తీసుకున్నామని, ఈ సంవత్సరం కూడా వస్తుందని ఆషాభావం వ్యక్తం చేశారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని నినాదాలు చేశారు. కమిషనర్ అదిశేషు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకొని పుట్టిన రోజు, పెళ్లి రోజు మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లస్వామి, పద్మ, మేనేజర్ గణేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డి, రాధ, వార్డు ఆఫీసర్‌లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేష్ , మున్సిపల్ , మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



## మొక్కును చెల్లించుకున్న తెలుగుదేశం అభిమానులు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు గెలవాలని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని జమ్ములమ్మ తల్లిని ఎన్నికల ముందు మొక్కుకోగా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం జమ్ములమ్మ తల్లికి మొక్కును తెల్లించుకున్నారు. మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంగ నాగరాజు, చందన్ గౌడ్‌తో పాటు మరికొందరు నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈమారు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామ్ , సుమన్, చిన్ని కృష్ణ, విజయ్ , ఆంజనేయులుగౌడ్ , రాముడు యాదవ్ , బాలవర్ధన్ , జంగ శ్రీవర్ధన్ , బాలకిష్టిగౌడ్ , జమ్ములు పాల్గొన్నారు.



## ముంబయి భీవండి వలస జీవుల' సమస్యల పరిష్కారానికి కృషిచేయండి

### కోదండరామ్‌కు వినతిపత్రం అందజేసిన 'ముంబయి-తెలంగాణ బహుజన ఫోరం' ప్రతినిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముంబయి భీవండి వలసజీవుల సమస్యలను పరి ష్కరించేందుకు కృషి చేయాలని ముంబయి తెలంగాణ బహుజన ఫోరం నాయకులు టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కోరారు. ఈమేరకు ఫోరం నాయకులు బద్ది హేమంత్ కుమార్,వేముల సత్యనారా యణ,అంబేడ్కరైట్ నాయకుడు డి.ఎల్ మాలజీ, వెంకటేష్ నెతకని, అడ్వకేట్ కుమ్మరి అశోక్, జర్నలిస్టులు అంగులి మాలజీ, మామిడి రాజు హైదరాబా ద్‌లో కోదండరామ్‌ను ఆయన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను వివరించారు. మహా రాష్ట్ర చిరునామాలతో ఆధార్ కార్డ్ కలిగిన తాము బిసి,ఎస్‌సి,ఎస్‌టి తెలుగు ముంబయి దారులకు తెలంగాణ రాష్ట్రంలో 'కుల ధృవీకరణ పత్రాలు' పొందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తెలంగాణ రాష్ట్రంలో కుల దృవీకరణ పత్రం జారీ చేసేలా అన్ని జిల్లాల కలెక్టర్లు, అర్.డి.ఓ, తహసిల్దా ర్లను ఆదేశించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. అలాగే కరీంనగర్‌సిఎస్‌ఎంటిల మధ్య ఉన్న ప్రత్యేక రైలును ప్రతిరోజూ నడి పించేలా చర్యలు తీసుకోవాలని,అజంతా ఎక్స్‌ప్రెస్ మన్మఢ్ నుంచి ముంబయి వరకు, నాందేడ్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్,పన్వెల్‌ఎక్స్ ప్రెస్‌లను కరీంనగర్ వరకు పొడ గించాలని వారు తెలిపారు. ఈ విషయమై కేంద్రరైల్వే శాఖ మంత్రి, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి తమ సమస్యనుపరిష్కరించాలని వారు కోదండరామ్‌ను విజ్ఞప్తి చేశారు. దీనిపైన కోదండరామ్ సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

## ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియాకు గ్రీన్ అవార్డు సహా 4 ఐఎస్ఓ సర్టిఫికెట్లు

### కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గచ్చిబౌలి లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాకు గ్రీన్ అవార్డు తో సహా నాలుగు ఐ ఎస్ ఓ సర్టిఫికెట్స్ రావడం పట్ల కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు హర్షం వ్యక్తం చేశారు. శుక్ర వారం కాలేజ్ బోర్డు రూమ్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో హెచ్. వై. ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివరాం ఆలపాటి పాల్గొని ఐఎస్ఓ సర్టిఫికెట్స్‌ను ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామే శ్వర్ రావు కు అందించారు. ఈ సందర్భంగా కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామే శ్వర్ రావు మాట్లాడుతూ ఈ అవార్డులు, ప్రశంసా పత్రాలు రావడం వెనుక తన కాలేజ్ సిబ్బంది, అధికారుల శ్రమ విధులపట్ల వారికున్న అంకితభావం మాత్రమే కారణమని, ఇందుకు తన సిబ్బందికి ధన్యవాదములు తెలుపుతు న్నట్లు కాలేజ్ డైరెక్టర్ రామేశ్వర్ రావు అన్నారు. కాలేజీ లో పరిపాలన వ్యవ హారాలు డాక్యుమెంటేషన్ విధానాలు, ఉద్యోగులు తమ విధివిధానాలను పాటించడం, సమయపాలన, ఫైళ్ల సత్వర పరిష్కరన తదితరమైన వాటిలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నందుకు ఐ ఎస్. ఓ 9001 క్వాలిటీ మేనేజ్ మెంట్ సర్టిఫికేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలపాటి శివయ్య మాట్లా డుతూ 1981 నుండి గచ్చిబౌలిలో నడుస్తున్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో పర్యావరణ పరిరక్షణ చర్యలు, కాలేజ్ ప్రాంగణంలో ప్రకృతి సహజంగా ఏర్ప డిన పెద్ద పెద్ద బండ రాళ్ళు, అధిక వయసున్న భారీవృక్షాలు, అటవీ సంప దను కాపాడటం నేటి రోజుల్లో సాధ్యమయ్యే పనికాదని, అయినా కూడా ప్రకృతి పట్లు విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ సహజ సంపదను పరిరక్షిస్తున్నందుకు ఐ ఎస్ ఓ 14001 ఎన్విరాన్మెంట్ మేనేజ్ మెంట్ సర్టిఫికెట్ ను కూడా ఇంజ నీరింగ్ స్టాఫ్ కాలేజ్ కు ఇస్తున్నట్లు, ఇందుకు తామెంతో గర్విస్తున్నామని అన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ప్రాంగణం పెద్ద వైశాల్యంలో ఉన్నందున ఇక్కడ సోలార్ విద్యుత్ ను ఉపయోగించడం, కార్యాలయం మొత్తం కూడా ఎల్ ఇ డి దీపాలు వాడటం వలన కూడా ఐ ఎస్ ఓ 50001 ఎనర్జీ మేనేజ్ మెంట్ సర్టిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందని ఆలపాటి తెలిపారు. ప్రభుత్వం ఆశించే అన్ని రకాల స్థాయిలను ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా పాటిస్తున్నందున ప్రత్యేకంగా గ్రీన్ అవార్డును కూడా హెచ్ వై ఎం ఇంటర్నేష నల్ సర్టిఫికేషన్ ప్రయివేట్ లిమిటెడ బహూకరిస్తున్నట్లు ఆలపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు చీఫ్ లు లక్ష్మీకాంత రావు, వెంకటశాస్త్రి లతో పాటుగా అన్ని డివిజన్లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్టుకు ఘననివాళి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో సీని యర్ జర్నలిస్టు మల్లెపల్లి కర్నాకర్ అనారోగ్యంతో మృతిచెందారు. ఈసంద ర్భంగా టియూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్రకార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్‌చౌర స్తాలో మృతుడు కర్నాకర్ చిత్రపటానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు సుదర్శ న్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి రాములు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు కర్నయ్య, సీనియర్ జర్నలిస్టులు కిశోర్, ధర్వేష్, సుదర్శన్, బాబు,దస్తగిరి, కురుమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శ

**ప్రజాపక్షం/అచ్చంపేట :** హైదరాబాద్‌లో గురువారం రాత్రి మరణించిన జర్నలిస్టు కర్నాకర్ టియూడబ్ల్యూజే(ఐజెయూ) సంఘం పరామర్శించింది. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ముఖ్యకూడలిలో మృతుడు కర్నాకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా యూని యన్ రాష్ట్రకార్యదర్శి మధుగౌడ్, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మిర్యాలకర్నయ్య, సీనియర్ జర్నలిస్టులు కిశోర్, పట్టాభి, దర్వేష్, ఎస్‌ఎస్‌బాబు , కురుమూర్తి,వెంకటేష్ తదితరులు నివాళి అర్పించారు.

## వర్షాలుకురవాలని వరదపాశం పూజలు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** వర్షాకాలంలో వరుణుడు కరుణించక సకాలంలో వర్షాలు పడనందుకు రైతులు వర్షంకోసం వరదపాశంపూజలు నిర్వహిం చారు. రైతులు సామూహికంగా ఇంటింటికితిరిగి చందాలువేసుకొని అట్టిసొ మ్ముతో దేవాలయంవద్ద వంటలువండారు. రైతులందరూ కలిసి శివాల యంలో బిందెలతో నీళ్లుపోశారు. అనంతరం శివాలయంవద్ద ఉన్న బండమీద ఈవండినపాయసంపోసి మోకాళ్లమీద ఒంగి బండమీద పోసిన పాయసాన్ని నాకుతూ శివుడిని వేడుకున్నారు.

# డబుల్ బెడ్ రూమ్‌లో డబ్బులు వసూల్




**ప్రజాపక్షం/దుండిగల్ :** ఇళ్లను నిరుపేదల కోసం గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ కేటాయించింది. అధికార పూర్వకంగా ధృవీకరణ పత్రాలు లబ్దిదారులకు అందిం చినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో కేటాయింపులు జర గదు. అయితే కొందరు నిరుపేదలు ఇంటి కిరాయి కట్టు కోలేని పరిస్థితులలో ఇక్కడికి వచ్చి నివాసం ఉంటు న్నారు. దీంతో ఆ నిరుపేదలను కొందరు రాబందుల్లా పిక్కు తింటున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మెయింటె నెన్స్ పేరుతో, సభ్యత్వం పేరుతో అందిన కాడికి దండు కుంటున్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహ దూర్ పల్లి లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదా యంలో గత కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు తమకు తామే నాయకులుగా ప్రకటించుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇక్కడ స్థానికంగా ఉండే కొందరు మెయింటెనెన్స్ పేరుతో ఒక్కో ఇంటికి నుండి ప్రతినెల రూ.1000 రూపాయలు వసూలు చేస్తున్నట్టు తెలు స్తోంది. అంతేకాకుండా సభ్యత్వం పేరుతో మరో రూ 1100. వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రతి నెల ఆ నాయకులకు సులభంగా ఆదాయం వచ్చే విధంగా పావులు కలుపుతున్నట్లు సమాచారం. 900 ఇండ్ల నుండి ప్రతి ఒక్కరి నుండి రూ.1000 రూపాయలు వసూలు చేస్తే, రూ 9 లక్షల రూపాయలు వసూలు అవు తుంది. ప్రతి నెల 9 లక్షల రూపాయలు ఖర్చు కాదు కదా... అని ప్రశ్నిస్తే, అడిగిన వారిని టార్గెట్ చేసి పలు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. 8 బ్లాక్ లకు గాను 900 ప్లాట్లు నిర్మించారు. వీటిలో 780 ప్లాట్లను మాత్రమే పంపిణీ చేశారు. నగరంలోని ఇతర ప్రాంతాల వారికి కూడా ఇక్కడ ఇల్లు కేటాయించడంతో ఇక్కడ స్థానికేతరులే ఎక్కువగా ఉన్నారు. దీంతో ఇక్కడ స్థానికులు తామే నాయకులమని ప్రకటించుకుని ప్రతి నెల మెయింటినెన్స్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడు తున్నారు. ఇక్కడ ఎక్కువమంది స్థానికేతరులే కావ డంతో ఈ నాయకులు చెప్పిందే వేదం చేసిందే కార్యంగా తయారయింది. ఇప్పటికే ఇక్కడ ఆ వ్యక్తులు నాయకుల ముసుగులో లక్షల్లో వసూళ్లు చేసినట్లు సమాచారం. సభ్యత్వం ముసుగులో అక్రమ వసూలు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో ఉన్న వారికి సభ్యత్వం తీసుకోవాలని అందుకు ఒక్కొక్క ఇంటి నుండి రూ. 1100 రూపా యలు చెల్లించాలని ఆ నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో 100 రూపా యలు ప్రభుత్వానికి వెళుతుందని చెప్పడం విడ్డూరంగా ఉంది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సము దాయంలో నిర్మించిన దుకాణాల నుండి వచ్చే ఆదాయం తోనే మెయింటెనెన్స్ చేయాలని గతంలోని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వం వద్ద ఖచ్చితమైన ప్రణాళిక ఉన్నప్పటికీ ఈ దొంగ నాయకులు అవి ఏమీ పట్టించుకోకుండా ప్రతి నెల మెయింటెనెన్స్ వసూళ్లకు సిద్ధం కావడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఇక్కడ ఉండాలంటే ప్రభుత్వం అనుమతి ఇచ్చినా... వీరి అనుమతి తప్పనిసరి**

ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలోకి వెళ్లా లంటే ముందుగా ఈ నాయకులు అనుమతి ఉండా ల్సిందే. ఎవరైనా కొత్తగా వచ్చిన ఈ నాయకులను కలిసి వీరికి ఇవ్వాల్సింది ఇచ్చి ఇళ్లలోకి వెళ్తున్నారు. ఒకవేళ లబ్ధిదారులు కొంతమంది ఇటీవల చనిపోగా, వారి పిల్లలు వారికి కేటాయించిన ఇల్లు లోకి ఉండేందుకు వాస్తే, మీరు ఎవరు..? అసలు లబ్ధిదారులు ఎక్కడు న్నారు...? అని బెదిరించి తిరిగి పంపివేస్తున్నట్లు సమా చారం. లబ్ధిదారులపై వీళ్ల పెత్తనం ఏందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరి స్తున్నారని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మెయింటెనెన్స్, సభ్యత్వం పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని లబ్ధిదా రులు డిమాండ్ చేస్తున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ప్రజాపక్షం/దౌల్తాబాద్ :** దౌల్తాబాద్ మండల పరిధిలోని నీటురు గ్రామంలో ని జట్టురి కనప్ప కొత్త ఇంట్లో అదే గ్రామనికి చెందిన కొందరు వ్యక్తులు పేకాటడుతూన్నట్లు సమాచరంతో శక్రవారం సాయత్రం పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవిగౌడ్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు పేకాట అడుతూన్నట్లు సమాచరం రావడంతో పోలీస్‌లు దాడి చేసి పది మందినిఅరెస్టుచేసి వరి వద్దనుండి 29,500నగదు ,8సెల్‌పోన్లు ,421ప్లేయింగ్ కార్స్ట్ స్వాదినం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.





## ఎస్‌పి కార్యాలయాన్ని సందర్శించిన ఐజిపి సత్యన్నారాయణ



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా ఎస్‌పి కార్యాలయంన్ని మల్టీజోన్ ఐజిపి సత్యానారాయణ సందర్శించారు. ఐజీకి జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి స్వాగతం పాలికినారు. అనంతరం జిల్లా ఎస్పితో సమావేశం అయినరు .వికారాబాద్ జిల్లాకు సంబందించినక్రైమ్ తదితర విషయలను చర్చించరు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీసి అదనపు ఎస్‌పి మురళీదర్ ,తాండుర్ డిఎస్‌పి బాలకృష్ణి రెడ్డి ,ఎఆర్ డిఎస్‌పి ,సిఐలు ఎస్ఐలు పాల్గోన్నారు.



## వనమహోత్సవ లక్ష్యాలు చేరుకోవాల్సిందే : కలెక్టర్ గౌతం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, ఎంపిడిఓలు, జిల్లా అధికారులకు మొక్కలు నాటటంలో కేటాయించిన లక్ష్యాలు చేరుకొనేందుకు నిబద్ధతతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. శుక్రవారం విసి మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో వనమహోత్సవం,అమ్మ ఆదర్శ పాఠశాల, ప్రజాపాలన కేంద్రాలు, మహిళా శక్తి అంశాలపై సంబంధిత అధికా రులతో సమీక్షా సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 63 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటేందుకు మొక్కల పంపిణీ చేయాలన్నారు. మానవ మనుగడకు మేలు చేస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తయిన తర్వాత పాఠశాలల ఫొటోలను సమర్పించాలన్నారు. మున్సిపాలిటీ, ఎంపిడిఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే సంఖ్యలో కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాలనలో తీసుకొన్న గృహజ్యోతి,మహాలక్ష్మి పథకాలను విజయవంతంగా కొనసాగేలా అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని కలెక్టర్ గౌతం సూచించారు. డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా విద్యా శాఖాధికారి విజయకుమారి, జిల్లా అటవీ శాఖాధికారి జానకీరామ్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అగ్రగామిగా 5వ డివిజన్

### కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ లో ఐపిసిటి కాలనీ రోడ్ నెంబర్ 1 నుండి 40 ఫీట్ రోడ్డు బుద్ధానగర్ వరకు రూ.32 లక్షల అంచనా వ్యయం తో నిర్మిస్తున్న సిసి రోడ్డు, భూగర్భ డ్రైనేజీ నిర్మా ణ పనులను స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మ రెడ్డి కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని సదరు కాంట్రాక్టులకు ఆదేశించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. 5వ డివిజన్ పరిధిలో 99 శాతం రోడ్డు పనులు పూర్తి చేసి ఆదర్శవంత డివిజన్‌గా తీర్చిదిద్దామని, ప్రజలకు సరిపడ త్రాగునీరు అందిస్తూ మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని సింగిరెడ్డి పద్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పబ్బు సత్యనారాయణ, రమేష్ రెడ్డి, ఎన్ వెంకటేశం, రవిరెడ్డి, భాస్కర్ లు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటిలోనూ మొక్కలు నాటాలి

**ప్రజాపక్షం/నాగారం:** ప్రతి ఇంటిలో ఆరు మొక్కలు తమ వంతుగా నాటాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు శేషాద్రి నగర్ కాలనీలో వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటిలో బాధ్యతగా మొక్కలను నాటాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్,కౌన్సిలర్ లక్ష్మి, మేనేజర్ చంద్రశేఖర్,డిఈ,నాయకులు,కాలనీవాసులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిద్దాం

**ప్రజాపక్షం/నాగారం:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు దాయర కుంట చెరువు వద్ద ఫ్రైడే,డ్రైడేలో భాగంగా దోమల నివారణకు అయిల్ బాల్స్,తెమోపాస్ స్ప్రే చేయడం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ మలేరియా,డెంగ్యూ వ్యాధుల నిరారణకు దోమల వృద్ధి చెందే ప్రదేశాలైన నీరు నిల్వ ఉండే ఎయిర్ కూలర్లు,డ్రమ్ములు,నీటి తొట్లు,పాత టైర్లలో నీటిని నిల్వ ఉండకుండా చూచాలని ప్రతి శుక్రవారం శుభ్రం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్,కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్రసురేష్,మేనేజర్ చంద్రశేఖర్,డిఈ,మున్సిపలల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయానికి 35వేలు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శాంతి నగర్ కాలనీలో పులకుర్తి సత్తయ్యపాపమ్మ బావి వద్ద 80 సంవత్సరాల క్రితం కొలువైన మైసయ్య దేవాలయ నిర్మాణానికి స్థానిక కౌన్సిలర్ కొమిరెల్లి అనితసుధాకర్‌రెడ్డి 10 వేల రూపాయలు అందజేశారు.కాలనీవాసులు తన వంతు బాధ్యతగా వాగోలు రమేష్‌బాబు 10 వేలు, లక్ష్మి సుబ్బయ్య 10 వేలు,చిందం నర్సింహ 5 వేల రూపాయలను దేవాలయ కమిటీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో పులకుర్తి నర్సింహ,సత్యంరాజు,చెండి శ్రీనివాస్,టి శ్రీనివాస్, నర్సింహ, రాము,అంజనేయులు,సంపత్,సత్తి,వెంకటేష్‌లు పాల్గొన్నారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం,వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడదామని చైర్మన్ ప్రణీతశ్రీకాంత్ గౌడ్ అన్నారు.శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఫ్రైడే డ్రైడేలో భాగం గా కాలనీలలో పర్యటించి వ్యాధుల పట్ల పడకుండా అవగాహన కల్పించారు.ఆర్‌జికె కాలనీలో డిఆర్‌సి సెంటర్ వద్ద 525 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కూలర్లు, టైర్లు, డ్రమ్ములలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు రామారం శ్రీహరిగౌడ్,కొత్త హేమాలత శ్రీనివాస్‌గౌడ్, నానునాయక్, ఎం వెంకటేష్,కొత్త భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్

# ఇక టూరిజం స్పాట్

### బోటింగ్ ఏర్పాట్లు సైతం, గంగా సుందరీకరణ పనులు

### జిహెచ్‌ఎంసి మేయర్, కమిషనర్‌ల ప్రకటన



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్ పార్కును టూరిజం స్పాట్‌గా తీర్చి దిద్దుతామని జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి , కమిషనర్ ఆమ్రపాలిలు తెలిపారు. అదే విధంగా ఇక్కడ బోటింగ్ చేసేందుకు అనువైన స్థలంగా మార్చి బోటు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకొంటామని మేయర్ పేర్కొన్నారు. శుక్రవారం మేయర్, కమిషనర్‌లు, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఇంజనీరింగ్, సంబంధిత విభాగాల అధికారులు, స్థానిక కార్పొరేటర్ శ్రవణ్‌లతో కల్సి సఫిల్‌గూడ లేక్ పార్కును సందర్శించారు. ఈ పార్కులో ఉన్న సమస్యలను స్వయంగా చూసిన మేయర్ వెంటనే వీటిని యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారి వెంట ఉన్న స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కాలనీ వాసులు, మార్నింగ్ వాకర్స్‌లు సమస్యలను వివరించారు. సఫిల్‌గూడ చెరువులో మురికి నీరు కలుస్తున్నందున దోమలు విపరీతంగా పెరిగిపోతున్న విషయాన్ని కమిషనర్,మేయర్ దృష్టికి తేవటంతో మురుగు నీరు రాకుండా అధికారులతో మాట్లాడి మురుగు నీటి డైవర్షన్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకొంటామని చెప్పారు. దీనికి ముందుగా గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించిన అనంతరం టూరింగ్ స్పాట్ కోసం సుందరీకరణ పనులను చేపడుతామన్నారు. పార్కులో ఉన్న ఓపెన్ జిమ్‌లో పాడయి పోయినవాటి మరమ్మత్తులు చేయాలని, దీంతో పాటు ఓపెన్ జిమ్ ఉన్న ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పుడు నేలంతా బురదమయంగా తయారవుతున్నందున బురద లేకుండా చేయాలంటూ వాకర్స్ కోరటంతో వెంటనే మొరం వేసి బురద లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చెరువు కట్ట పైన పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. అక్కడి నుండి మేయర్, కమిసనర్‌లు దీనదయాళ్‌నగర్ కాలనీలోని నాలాను పరిశీలించి నాలాలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉంటూ భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా తమ పర్యటనలో గైరాజరైనా ఎంటమాలజీ విభాగ అధికారులతో పాటు మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్‌లపై మేయర్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి నోటీసలివ్వాలని కమిషన్‌నర్‌ను ఆదేశించారు.

## ఉపకార వేతనాలు విడుదల చేయాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు



**ప్రజాపక్షం/ఘట్కేసర్ :** తెలంగాణ రాష్ట్రంలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. రాష్ట్రంలో ఉపకార వేతనాలు విడుదల చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయనికి ముట్టడించడం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, గత ఆరేళ్ళ నుండి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరికి సంవత్సరానికి 3000 వేల కోట్లు అవసరం అవుతాయి. కానీ 2019 నుండి ఇప్పటి వరకు బకాయిలు పేరుకోని ఉన్నాయి. 2019–2020 800 కోట్లు, 2020–2021 2356 కోట్లు,2021–2022 2100.43 కోట్లు, 2022–2023 2958.14 కోట్లు మొత్తం 8214.57 కోట్లు రూపాయలు ఫీజుల బకాయిలు ఉన్నాయి. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వడం లేదు. ఉన్నత చదువులకు వెళ్ళాలనే విద్యార్థులు తల్లిదండ్రులు సర్టిఫికేట్స్ కోసం వడ్డీలకు అప్పులు చేస్తున్న దుస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొంది. కళాశాల యాజమాన్యాలు కూడా కళాశాల నడపడానికి బయట నుండి అప్పులు తెచ్చామని ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు మూతవేసే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ. స్కాలర్ షిప్స్ ,ఫీజు రీయంబర్స్ మెంట్స్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు,వాటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ ఆయా మార్గదర్శకాలు ప్రభుత్వమే అమలు చేయడం లేదు. అకడమిక్ ఇయర్ ప్రారంభంలోనే విద్యార్థుల నుండి దరఖాస్తులు తీసుకోని ప్రభుత్వం పరిశీలన చేయాలి. పరిశీలనలో అర్హులు అని తెలితే ముందే 25శాతం చెల్లించాలి. అకడమిక్ ఇయర్ మద్య లో 50శాతం, మిగిలిన ఫీజులు సంవత్సరం చివర్లో చెల్లించాలి.కానీ ఈ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వాలు పాటించడం లేదు. అందుకే తక్షణమే ముఖ్యమంత్రి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు అరుణ్, వంశీ, మనోజ్ సహాయ కార్యదర్శిలు కిరణ్, అవినాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్ రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు సుబ్బు, బాలు, అజయ్, శ్రీనివాస్, తేజ, ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంటి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

### ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చింతల్ హెచ్‌ఎంటీ పరిశ్రమను కేంద్ర భారీ పరిశ్రమలు, స్టీల్ మంత్రి హెచ్‌డి కుమార స్వామి, సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మలు సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమ యొక్క నిర్వహణ గురించి మంత్రులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మంత్రులకు మొక్కలను అందజేసి స్వాగతం తెలిపారు. అనంతరం పరిశ్రమ పరిస్థిలు, కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ 1992 నుండి ఉద్యోగులకు ఇవ్వాల్సిన అనేక రకాలైన బకాయిలు నేటికి చెల్లించడం లేరని, ఉద్యోగులకు అందాల్సిన పి ఎఫ్, ఎర్న్డ్ లీవ్‌లు (ఈఎల్) ఎన్ క్యాష్మెంట్ వెంటనే చెల్లించాలని, 2019 నుండి ఉద్యోగులకు అందాల్సిన గ్రాట్యుటీ అందడం లేవని మంత్రుల దృష్టికి వివేక్ తీసుకువచ్చారు.

రిటైర్మెంట్ సమయంలో దాదాపు 600 మంది ఉద్యోగులు తమకు అందాల్సిన బకాయిలు అందక పోవడంతో అవస్థలు పడుతున్నారని, ఇప్పటికే పలువురు ఉద్యోగులు మృతి చెందగా వారి కుటుంబాలు రోడ్డున పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎండిఎ సీఎండి రాజేశ్ కోహ్లీ, వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ సభ్యులు, హెచ్‌ఎంటీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధుల పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజాప్రతినిధులు, అధికారు లు అప్రమత్తంగా ఉండాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి అధ్యక్షతన 25వ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ హాజరయ్యారు. సమావేశంలో కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో కావాల్సిన మౌలిక సదు పాయాలు, నిధులు, పెండింగ్‌లో ఉన్న పనులు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి వాటి పై చర్చ జరిగింది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు, బోనాల పండుగ నిర్వహణ వంటి ప్రధాన అంశాల పై చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ఆయా డివిజనలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులకు ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేషన్‌ని అభివృద్ధి చేయడం ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం బాచుపల్లికి చెందిన ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, కార్పొరేటర్‌లు కాసాని సుధాకర్, బాలా జి నాయక్‌లు ఎమ్మెల్యే వివేక్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా ఎస్‌ఎన్‌డిపి నాలా అర్థాంతరంగా నిలిచిపోవడంతో మురుగు నీరంతా నాలాలో నిండి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని ఈ ప్రధానమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, కమిషనర్ రామకృష్ణ రావు, ఎమ్మార్వో ఫూల్ సింగ్, కార్పొరేటర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై ప్రశ్నిస్తే కార్పొరేటర్ బూతు పురాణం

### 1వ డివిజన్ క్రాంతికాలనీవాసుల ఆవేదన

### పోలీస్ స్టేషన్‌లో కార్పొరేటర్ వర్సెస్ కాలనీవాసుల పరస్పర ఫిర్యాదులు



**ప్రజపక్షం/బోడుప్పల్ :** డివిజన్ అభివృద్ధి కోసం ప్రశ్ని స్తే స్థానిక కార్పొరేటర్ బూతు పురాణం అందుకున్నాడని వెంటనే కార్పొరేటర్ క్షమాపణ చెప్పాలని క్రాంతి నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల క్రాంతి కాలనీ 1వ డివిజన్ లో రోడ్లు, డ్రైనేజీ లేక వర్షాలు రావడంతో కాలనీలో నీరు నిలిచి వాహనదారులు, కాలనీ వాసులు ఇబ్బందులు ఎదురుకొంటున్నారని స్థానిక కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్‌కు చరవాణిలో ఫిర్యాదు చెయ్యగా తనకు ఇష్టం వచ్చినట్లు బూతు పురాణం చదివాడనే బుధవారం కాలనీవాసులు రోడ్ నెంబర్ 4 లో ఆందోళన చేశారు.వారికి మద్దతుగా బోడుప్పల్ నగర బీజేపీ ప్రదాన కార్యదర్శి ఎర్వుల మహేష్ అందోళన చేశారు. ఈ సందర్భంగా విలేకరుల మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అతి పెద్ద కాలనీగా క్రాంతి కాలనీ ఉందని, ఎన్నీ సంవత్సరాలుగా ఇండ్లు నిర్మించుకొని నివాసముంటున్నామని తెలిపారు. ఎన్ని సార్లు అభివృద్ధి కోసం కార్పొరేటర్ ను అడిగిన,మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి ఫలితం లేదని అవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాచమల్ల చంద్రశేఖర్, కాలనీవాసులు పాల్గోన్నారు.

**కావాలనే నాపై కక్ష్యపూరిత ఆరోపణలు**

**కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్**

కొందరూ బయటి వ్యక్తులు నేను డివిజన్ లో చెస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక నాపై కక్ష్యతో కాలనివాసులను ఉసికొలిపి రాద్ధాంత చేస్తున్నారని తెలిపారు. డివిజన్లో కాలనీ అసోసియేషన్‌తో కలిసి త్రాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను విడుతల వారిగా పనులు జరుగుతుండటంతో నాపై లెనిపొని అరోపణలు చెస్తూ బదునాం చేయడానికి చూస్తున్నారన్నారు. వారి బండారం త్వరలోనే బయట పడుతుందన్నారు.నాపై అసత్య అరోపణలు చేసిన, చేయించిన వారిపై పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. నేను ఎల్లప్పుడూ డివిజన్ అభివృద్ధికై పాడుపడుతానని తెలిపారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారుకలు కళ్యాణ లక్ష్మి, ఫాదిముబారక్ చెక్కులను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబ్దిదారులకు ఇన్‌చారీజ కలెక్టర్ సుధీర్ కుమార్ , ఆర్‌డిఓ వాసుచంద్ర ,మున్సిపల్ చైర్మపర్సన్ మంజుల , పట్టాణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 27మంది కళ్యాణ లక్ష్మి చెక్కులు, 18మందికి షాధిముబారక్ మొత్త ం 45 మందికి అందజేశారు. మహిళల అభివృద్ధికి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేంవత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలోని మహిళలకోసం కాంగ్రేస్ ఎంతో చేస్తుందని ఈ సందర్భంగా తేలిపారు. త్వరలో మహిళలకు మంచి గుడ్‌న్యూస్ అందిస్తారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు ,నాయకులు తదితరులు పాల్గోన్నారు.




## పే బ్యాక్ అంబేద్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ

### ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ కొలుకుల జగన్

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మైసమ్మ నగర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పేబ్యాక్ అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థుల కోసం అంబేద్కర్ సేవాసమితి వారు అందించిన ఆర్థిక సహాయాన్ని ఆయన కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కుమార్, వీరయ్య, ప్రసాద్, శ్యామ్, దాసు, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, మిఠల్ ముదిరాజ్, సిహెచ్. దాసు, నరసింహారెడ్డి, హనుమంతు, సంధ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది సంక్షేమానికి ప్రాముఖ్యత ఇస్తాం

### రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పోలీస్ విభాగంలో కింది స్థాయి నుండి విధులు నిర్వహించే సిబ్బంది నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ కీలకమని, వారి సంక్షేమానికి తాను అన్ని వేళలా ప్రాముఖ్యత ఇస్తూ అండగా ఉంటానని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్‌బాబు తెలిపారు. కమిషనర్ గా విధులు నిర్వహిస్తూ ఐదు మాసాల క్రితం ఇక్కడి నుండి బదిలీ అయి మరో సారి ఇదే స్థానంలో బదిలీ అయి గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయనను పోలీసు అధికారులు సంఘం అధ్యక్షుడు సి.హెచ్. భద్రారెడ్డి,కృష్ణారెడ్డిలు శుక్రవారం ఆయనను కార్యాలయంలో కల్సి బొకేతో అందించారు.



## కలెక్టర్‌తో ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి భేటీ

### తాండూరు నియోజకవర్గంలోని సమస్యలపై చర్చ

**ప్రజాపక్షం/తాండూరు:** వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ నూతనంగా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారిగా తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యాని మనోహర్‌రెడ్డి బేటి అయ్యారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలసిన ఎంఎల్‌ఏ బుయ్యాని మనోహర్‌రెడ్డి పుష్పగుచ్చాని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తాండూరు నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి కలెక్టర్‌తో చర్చించారు. తాండూరు మున్సిపల్ పరిధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. బషీరాబాద్ మండల కర్నాటక తెలంగాణ సరిహద్దుల ప్రాంతంలోని భూ సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెండు రాష్ట్రాలు సమన్వయంతో భూ సర్వే చేపట్టి పరిష్కారానికి కృషి చేయాలని ఎంఎల్‌ఏ కోరారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్ల నిర్మాణానికై ఎర్రమట్టి అవసరం అవుతుందని, కాంట్రాక్టర్లకు ఎర్రమట్టి తరలింపుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. పాత తాండూరులో నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద 40ఫీట్ల రోడ్డు నిర్మాణం జరిగే విధంగా ప్రణాళికలు ఉన్నాయని, తద్వారా ఆస్తి నష్టం అధికంగా జరుగుతుందని, 40ఫీట్ల నుండి కుదించి ప్రజలకు ఇబ్బందులు తలేత్తకుండా రోడ్డు కుదింపుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షకాలంలో చిలక వాగు వల్ల తాండూరు పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఏలాంటి ఇబ్బందులు లేకుండా చిలుక వాగు పనులు పునరుద్దరణ చర్యలు తీసుకుంటు అన్ని శాఖల అధికారులతో సమన్వయంగా పనులు జరిగేటట్లు చూడాలని కోరారు. ఎంఎల్‌ఏ సూచించిన సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినటు తెలిపారు.

## బైక్‌ను ఢీకొన్న లారీ ప్రమాదంలో లాలయ్య మృతి

**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** అజాగ్రత్త, అతివేగంతో లారీ రావడంతో ఎదురుగ వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే తలకు బలమైన గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మద్యలో మృతి చెందిన సంఘటన కోట్‌పల్లి పోలీస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... ధారూర్ మండలం అవుసిపల్లి గ్రామానికి చెందిన పరిగి లాలయ్య (40), తన భార్య భారతమ్మను అత్తగారి ఊరైన పెద్దెముల్ లో దింపేసి తిరిగి అవుసిపల్లికి వస్తుండ గా కోట్‌పల్లి మండలం ఓగులాపూర్ గెటు సమీపంలో ఎదురు గా వస్తున్న లారీ లాలయ్య వస్తున్న బైక్‌ను ఢీ కొనగా లాలయ్య తలకు బలమైన గాయం కావడంతో రక్తం బాగా వచ్చి కాలు, చెయ్యి విరిగింది. సమాచారం అందుకున్న అంబులెన్స్ వారు సంఘటన స్థలానికి చెరుకుని గాయాలపాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం తాండూర్ ఆసుపత్రికి తరలించగ పరిశీలించిన డాక్టర్ అప్పటికేమమృతి చెందినాడని వెల్లడించారు. మృతిని అన్న యాదయ్య పిర్యాదు మేరకు లారీ డ్రైవర్ సుందర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడ

# ఫిట్‌గా ఉంటే అన్ని ఫార్మాట్లు ఆడాల్సిందే

## టీమ్ ఇండియా ఆటగాళ్లకు గంభీర్ సందేశం



**ముంబయి :** టీమ్ ఇండియా ఆటగాళ్లు మూడు ఫార్మాట్లలో కచ్చితంగా ఆడి తీరాల్సిందేనని కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టమైన సంకేతాలు పంపాడు. అతడు తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానెల్‌తో మాట్లాడుతూ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశాడు. ''గాయాలు ఆటగాళ్ల జీవితంలో ఓ భాగం. ఎవరైనా సరే మూడు ఫార్మాట్లు ఆడితే.. గాయపడతారు. విశ్రాంతి తీసుకొని కోలుకొన్న తర్వాత జట్టులోకి వస్తారు. అప్పుడు మాత్రం కచ్చితంగా మూడు ఫార్మాట్లు ఆడి తీరాల్సిందే. ఎవరో ఒకరికోసం అతడిని టెస్టుల్లో ఉంచుతున్నాం.. మరోచోట తీసుకోబోతున్నాం.. గాయాల తీవ్రత తగ్గించేందుకు, వర్క్‌లోడ్ మేనేజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నామంటూ వ్యక్తుల కోసం పని చేయడాన్ని నేను పెద్దగా విశ్వసించను. ప్రొఫెషనల్ క్రికెటర్లను చూడండి.. వారికి చాలా స్వల్ప వ్యవధే లభిస్తుంది. మీరు దేశం కోసం ఆడాలనుకుంటే.. వీలైనంత ఎక్కువగా ప్రయత్నించండి. మీరు మంచి ఫామ్‌లో ఉన్నట్లైతే.. ఓ అడుగు ముందుకేసి అన్ని ఫార్మాట్లలో ఆడండి'' అని పేర్కొన్నాడు. వాస్తవానికి ఇది గత కోచ్ ద్రవిడ్ శైలికి పూర్తిగా భిన్నమైంది. అతడు ఇన్‌జ్యూరీ మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెట్టేవాడు. హార్దిక్, బుమ్రా గాయపడిన వేళ వారిని కొంతకాలం ఆటకు దూరంగా ఉంచాడు. ఇక రోహిత్, విరాట్‌పై ఒత్తిడి తగ్గించేందుకు పొట్టి ఫార్మాట్‌కు దూరం పెట్టేవాడు. వ్యక్తి కంటే జట్టు ప్రయోజనాలపైనే ఆటగాళ్లు దృష్టిపెట్టాలని గౌతమ్ గంభీర్ పునరుద్ఘాటించాడు. ''ఒక్కటే సందేశం చెప్పదల్చుకొన్నాను. మీరు నిజాయతీగా ప్రయత్నించండి.. ఆడండి. మీ వృత్తిపై నిజాయతీగా ఉండండి. ఫలితాలు అవే వస్తాయి. నేను బ్యాటింగ్‌కు వెళ్లే సమయంలో ఫలితాల గురించి అస్సలు ఆలోచించను. ఇన్ని పరుగులు చేయాలని అనుకోను.. నా వృత్తిపై పూర్తి నిజాయతీతో ఆడతాను. సరైన పనులు చేయడానికి ప్రయత్నించాలి. ఏదైనా జట్టుకు ప్రయోజనకరమని నీ మనసు భావిస్తే.. ఆ విషయంలో ప్రపంచమంతా వ్యతిరేకమవుతుందనుకున్నా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నేను మైదానంలో ఎవరితో తలపడినా.. అది జట్టు కోసమే. అంతిమంగా ఇది టీమ్ అన్నదే ముఖ్యం.. అంతేకానీ, ఎవరో ఒకరిది కాదు. మీరు ఏ జట్టులో ఆడినా మైదానంలో ఆ జట్టు విజయం కోసమే ఆలోచించండి. టీమ్ స్పోర్ట్స్‌కు అది చాలా ముఖ్యం. కేవలం మీ గురించే ఆలోచించుకోవడానికి ఇది ఒకరు ఆడే ఆట కాదు'' అని గంభీర్ అభిప్రాయం వ్యక్తంచేశాడు. టీమ్ ఇండియా బౌలింగ్ కోచ్‌గా దక్షిణాఫ్రికా సీమర్ మోర్నీ మోర్కెల్ పేరును పరిశీలించాలని కోచ్ గంభీర్ బీసీసీఐని కోరినట్లు సమాచారం. వినయ్ కుమార్, జహీర్ ఖాన్ తర్వాత ఈ రేసులోకి వచ్చిన మూడో పేరు ఇది. వన్డే ప్రపంచకప్ సమయంలో మోర్కెల్ పాక్ జట్టుకు సేవలు అందించాడు. ఆ టోర్నమెంట్ తర్వాత పీసీబీ అతడిని తొలగించింది.

## ఫుట్‌బాల్ హీరో యమాల్‌కు 'వయసు' కష్టాలు



**మ్యూనిక్:** యూరో చరిత్రలోనే గోల్ కొట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా సరికొత్త రికార్డు సృష్టించి.. టీనేజ్‌లోనే ఫుట్‌బాల్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు లమిన్ యమాల్ యూరో కప్ 2024 ఫైనల్ మ్యాచ్‌కు ఒక్క రోజు ముందు 17వ ఏటలోకి అడుగుపెట్టబోతున్న ఈ యువ సంచలనం.. యూరో టోర్నీలో మ్యాచ్‌లను పూర్తి సమయం ఆడకపోవడం గమనార్హం. జర్మనీ చట్టాల ప్రకారం అతడు పూర్తి సమయం గేమ్‌లో ఉండేందుకు కుదరట్లేదని స్పెయిన్ కోచ్ చెబుతున్నారు. జర్మనీ కార్మిక చట్టాలప్రకారం 18 ఏళ్ల లోపు వారు రాత్రి 8 గంటల (స్థానిక కాలమానంలో) తర్వాత పని చేసేందుకు వీల్లేదు. అథ్లెట్లకు కొంత మినహాయింపు ఉన్నప్పటికీ అది కూడా రాత్రి 11 గంటల వరకు మాత్రమే. ప్రస్తుతం యూరో 2024 జర్మనీ వేదికగా జరుగుతోంది. కొన్ని మినహా చాలా మ్యాచ్‌లు రాత్రి 9 గంటలకు మొదలయ్యాయి. బ్రేక్, ఎక్స్‌ట్రా టైమ్, పెనాల్టీ సమయం ఇవన్నీ కలిపి మ్యాచ్ పూర్తవడానికి రాత్రి 11 దాటుతోంది. దీంతో గ్రూప్ దశలో స్పెయిన్ ఆడిన పలు మ్యాచ్‌ల్లో యమాల్‌ను మ్యాచ్ సెకండ్ హాఫ్‌లో వేరే ఆటగాడితో సబ్‌స్టిట్యూట్ చేయాల్సి వచ్చింది. ఒక్క జార్జియాతో మినహా ఏ మ్యాచ్‌లోనూ అతడు పూర్తి సమయం మైదానంలో లేడు. జులై 14న స్పెయిన్‌ఇంగ్లాండ్ మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్ కూడా రాత్రి 9 గంటలకు (స్థానిక కాలమానంలో) ప్రారంభం కానుంది. ఎలాంటి అడ్డంకులు లేకపోతే 11 గంటల్లోపే మ్యాచ్ పూర్తవుతుంది. అలా కాకుండా ఎక్స్‌ట్రా, పెనాల్టీలు ఇవ్వాల్సి వస్తే మాత్రం యమాల్‌ను ఆడించడం స్పెయిన్‌కు ఇబ్బందే. ఒకవేళ, 11 గంటల తర్వాత కూడా అతడు ఆడితే జర్మనీ నిబంధనల ప్రకారం స్పెయిన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ 30వేల యూరోల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఫ్రాన్స్‌తో జరిగిన సెమీస్ పోరుతో యమాల్ పేరు ప్రపంచమంతా మార్మోగిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్ 21వ నిమిషంలో యమాల్ గోల్ కొట్టి స్పెయిన్ విజయానికి బాటలు పరిచాడు. కళ్లు చెదిరే రీతిలో 25 గజాల దూరం నుంచి టాప్ కార్నర్‌కు బంతిని కొట్టిన అతడిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అంతేనా.. కేవలం 16 ఏళ్ల 362 రోజుల వయసులోనే గోల్ కొట్టి సరికొత్త చరిత్ర లిఖించాడు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు అండర్సన్ వీడ్కోలు



ఇంగ్లాండ్ వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సంప్రదాయ క్రికెట్‌లో 21 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. వెస్టిండీస్‌తో శుక్రవారం ముగిసిన టెస్ట్ మ్యాచ్‌తో ఆటకు అల్విదా ప్రకటించాడు. ఈ మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో సత్తా చాటిన అండర్సన్.. ఇంగ్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అండర్సన్‌కు ఇంగ్లాండ్ ఆటగాళ్లు, అభిమానులు అదిరిపోయే రీతిలో వీడ్కోలు పలికారు. క్రికెట్ మక్కా లార్డ్స్ వేదికగా జరిగిన అండర్సన్ వీడ్కోలు మ్యాచ్కు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మ్యాచ్ ముగిసిన అనంతరం అభిమానులంతా అండర్సన్‌కు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అండర్సన్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన అండర్సన్ కుటుంబ సభ్యులు కూడా కన్నీటి పర్యంతమయ్యారు. అండర్సన్ స్టన్నింగ్ డెలివరీతో వెస్టిండీస్ బ్యాటర్ జాషువ డసిల్వను తన ఆఖరి వికెట్‌గా ఖాతాలో వేసుకున్నాడు. 41 ఏళ్ల అండర్సన్ తన టెస్ట్ కెరీర్‌లో 188 మ్యాచ్‌లు ఆడి 26.45 సగటుతో 704 వికెట్లు పడగొట్టాడు. 2003లో టెస్ట్ కెరీర్ ప్రారంభించిన అండర్సన్.. 2022లో వన్డే క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. 194 వన్డేల్లో 269 వికెట్లు పడగొట్టాడు. 19 టీ20ల్లో 18 వికెట్లు తీసాడు. టెస్ట్‌ల్లో సుదీర్ఘ కాలం కొనసాగిన పేసర్‌గా.. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అండర్సన్ నిలిచాడు. ఓవరాల్‌గా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అండర్సన్ మూడో స్థానంలో ఉన్నాడు. ముత్తయ్య మురళీ దరణ్ (800), షేన్ వార్న్(708) అండర్సన్ కన్నా ముందున్నారు. అండర్సన్ రిటైర్మెంట్ నేపథ్యంలో యావత్ క్రికెట్ ప్రపంచం అతనికి అభినందనలు తెలుపుతోంది. అండర్సన్ ఆడిన ఈ ఆఖరి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 114 పరుగుల భారీ తేడాతో గెలిచింది.

రీల్

## 'చరణ్ 16' లో కన్నడ సూపర్ స్టార్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ఇప్పుడు మావెరిక్ దర్శకుడు శంకర్ తో గేమ్ ఛేంజర్ అనే భారీ సినిమా చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం కోసం అభిమానులు మంచి ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ సినిమా తర్వాత చరణ్ 16వ సినిమాపై కూడా భారీ హైప్ నెలకొంది.టాలెంటెడ్ దర్శకుడు బుచ్చిబాబు సానా చరణ్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన కథ విని అంతా షాక్ అయ్యామని శివ రాజ్ కుమార్, విజయ్ సేతుపతి రెహమాన్ లాంటి పలువురు స్టార్స్ ఈ సినిమా స్యూర్ షాట్ హిట్ అవుతుంది అని ముందే చెప్తున్నారు. అయితే ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కూడా భాగం కానున్నారని ఇది వరకే కన్ఫర్మ్ అయ్యిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై ఇప్పుడు అఫీషియల్ క్లారిటీ మేకర్స్ ఇచ్చేసారు. నేడు శివన్న బర్త్ డే కానుకగా అయితే ఈ భారీ సినిమాలో తాను ఉన్నట్టుగా మేకర్స్ రివీల్ చేశారు. అలాగే ఈ సినిమాతోనే శివ రాజ్ కుమార్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారని అందుకు తమకి ఆనందంగా ఉందని చిత్ర నిర్మాణ సంస్థలు వృద్ధి సినిమాస్ మైత్రి మూవీ మేకర్స్ వారు తెలియజేసారు.

## కొన్నిచోట్ల మెప్పించే యాక్షన్ ఎంటర్ టైనర్ 'భారతీయుడు—2'

*యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'భారతీయుడు-2'. కాగా ఈ చిత్రం ఈ రోజే విడుదల అయింది. మరి ప్రేక్షకులును ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం !*




సమీక్ష

**కథ :** చిత్ర అరవిందన్ (సిద్ధార్థ్) అండ్ అతని స్నేహితులు సమాజంలోని అవినీతి పై, అన్యాయాలపై సోషల్ మీడియాలో వీడియోలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ సంఘటనల నేపథ్యంలో వారంతా భారతీయుడు మళ్లీ రావాలంటూ పోస్ట్‌లు పెడతారు. భారతదేశంలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి అలియాస్ భారతీయుడు (కమల్ హాసన్) తిరిగి ఇండియాకి వస్తాడు. దారుణమైన అవినీతి చేసిన వారిని, ప్రజల సొమ్మును దోచుకున్న కొందర్ని భారతీయుడు చంపేస్తాడు. అలాగే యువకులను మోటివేట్ చేస్తాడు. భారతీయుడు మాటలు ప్రభావం కారణంగా చిత్ర అరవిందన్ (సిద్ధార్థ్) జీవితంలో చాలా విషాదం జరుగుతుంది. దానికి కారణం భారతీయుడే అంటూ అందరూ నిందిస్తారు. అసలు ఏం జరిగింది ?, ఎందుకు సామాన్య జనం కూడా భారతీయుడుపై కోపం పెంచుకున్నారు ?, ఇంతకీ, భారతీయుడు టార్గెట్ ఏమిటి ? అనేది మిగిలిన కథ.

**ప్లస్ పాయింట్స్ :** సమకాలీన సమాజంలో పేరుకుపోయిన అవినీతి, అన్యాయాలను ఆలోచనాత్మకంగా ఎస్టాబ్లిష్ చేస్తూ సాగిన ఈ సినిమాలో భారీ తారాగణంతో పాటు అద్భుతమైన విజువల్స్, భారీ యాక్షన్ ఎపిసోడ్స్ వంటి అంశాలు సినిమాకి స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. సేనాపతిగా కమల్ హాసన్ ఎప్పటిలాగే తన యాక్టింగ్‌తో ఆకట్టుకున్నారు. కమల్ లుక్ అండ్ మ్యానరిజమ్స్‌తో పాటు ఆయనపై వచ్చే యాక్షన్ ఎపిసోడ్స్ కూడా చాలా బాగున్నాయి. అలాగే బ్రేకింగ్ డాగ్స్ అంటూ సాగిన యానిమేషన్ విజువల్స్ కూడా బాగున్నాయి. మొత్తానికి విజువల్ గా ఈచిత్రం చాలా గ్రాండియర్‌గా ఉంది. చిత్ర అరవిందన్ పాత్రలో సిద్ధార్థ్ ఒదిగిపోయాడు. పైగా సిద్దార్థ్‌కి స్క్రీన్ టైమ్ కూడా ఎక్కువగానే ఉంది. సకలకళ వల్లవన్ సర్గుణ పాండియన్‌గా ఎస్‌జె సూర్య తన పాత్రకు ప్రాణం పోశారు. సిబిఐ ప్రమోద్‌గా బాబీ సింహా ఆకట్టుకున్నాడు. దిశా పాత్రలో రకుల్ ప్రీత్ సింగ్ కూడా మెప్పించింది. నటి ప్రియా భవానీ శంకర్ తన పాత్రలో మెరిశారు. మరో కీలక పాత్రలో సముద్రఖని కూడా చాలా బాగా నటించాడు. అలాగే, వివేక్, గుల్షన్ గ్రోవర్ లతో పాటు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఇక దేశంలోని అవినీతి రాజకీయ నాయకులను, అలాగే అధికారుల అక్రమాలను బహిర్గతం చేస్తూ సాగే కార్టూన్ ట్రాక్ సినిమాలో హైలైట్‌గా ఉంది. మొత్తానికి భారీ విజువల్స్‌తో పాటు గుడ్ ఎమోషన్స్ కూడా బాగా చూపించారు. ముఖ్యంగా సమాజంలోని లోటుపాట్లను దర్శకుడు శంకర్ చాలా బాగా చూపించారు. చివర్లో మూడో పార్ట్‌కి సంబంధించి రివీల్ చేసిన షాట్స్ కూడా బాగున్నాయి.

**మైనస్ పాయింట్స్:** అవినీతికి వ్యతిరేకంగా పోరాడే వృద్ధ స్వాతంత్ర్య సమరయోధుడి కథ గురించి ఆల్ రెడీ భారతీయుడు చిత్రంలోనే చాలా బాగా చూపించారు. దీంతో ఈ సీక్వెల్‌లో ప్లాట్ పరంగా, పాత్రల పరంగా ఫ్రెష్‌నెస్ మిస్ అయ్యింది. సమకాలీన సంఘటనల ఆధారంగా సీన్స్ రాసుకున్నప్పటికీ, వాటిలో ఎలాంటి కొత్తదనం లేదు. దీంతో స్క్రీన్ ప్లే చాలా రెగ్యులర్‌గా సాగుతున్న ఫీలింగ్ కలుగుతుంది. అదే విధంగా కొన్ని సన్నివేశాలు బోర్ గా సాగాయి. పైగా దేశంలోని అవినీతి రాజకీయ నాయకులను బహిర్గతం చేయడానికి చాలా సీన్స్‌ను ఎస్టాబ్లిష్ చేశారు. ఆ అవినీతి గురించి అవగాహన ఉన్నదే కదా. ఆ అవినీతిపై భారతీయుడు ఏం చేస్తాడు అనేదే ఆసక్తికరంగా ఉంటుంది. కానీ, ఆ కోణంలో ఈ సినిమా ఎక్కువ సేపు సాగకపోవడం కొంత నిరాశను కలిగిస్తోంది. పైగా కమల్ హాసన్‌తో పాటు ఈ మూవీలో సిద్ధార్థ్ క్యారెక్టర్‌కి కూడా లెంగ్త్ ఎక్కువగా ఉండటం ఫ్యాన్స్‌కి రుచించదు. అనిరుధ్ మ్యూజిక్ కూడా గొప్పగా సాగలేదు. మొత్తానికి ఈ సినిమా కొన్నిచోట్ల బోరింగ్ ప్లేతో, అవుట్ డేటెడ్ సీన్స్ తో సాగింది .

**తీర్పు :** భారీ అంచనాల మధ్యన వచ్చిన ఈ 'భారతీయుడు2' కమల్ అభిమానులను మాత్రం ఆకట్టుకుంది. అలాగే, శంకర్ మార్క్ విజువల్స్, కమల్ హాసన్ నటన సినిమాకి ప్లస్ అయ్యాయి. అయితే, బోరింగ్ ప్లే, అవుట్ డేటెడ్ సీన్స్ అండ్ పెద్దగా కథ లేకపోవడం, కొన్ని సన్నివేశాలు రెగ్యులర్‌గా సాగడం వంటి అంశాలు సినిమాకి మైనస్ పాయింట్స్‌గా నిలిచాయి. ఓవరాల్ గా కమల్ తన లుక్స్ అండ్ పెర్ఫార్మెన్స్ తో తన అభిమానులను మాత్రమే అలరించారు.

## పిడుగులుపడి 24 గంటల్లో 25 మంది దుర్మరణం

**పాట్నా :** ఉత్తర భారత దేశాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. ఒక్క బీహార్‌లోనే ఏకంగా 25 మంది పిడుగుపాటుకు మృతి చెందగా 39 మంది గాయపడ్డారు. మృతులకు సిఎం నితీష్ కుమార్ శుక్రవారం సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్నందునా.. పిడుగులు పడే ప్రమాదం ఉందని.. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని ఆయన కోరారు. మరణించిన 25 మందిలో, మధుబనిలో ఐదుగురు, ఔరంగాబాద్‌లో నలుగురు, సుపాల్‌లో ముగ్గురు, నలందలో ముగ్గురు, లఖిసరాయ్, పట్నాలో ఇద్దరు, బెగుసరాయ్, జాముయి, గోపాల్‌గంజ్, రోహ్తాస్, సమస్తిపూర్, పూర్ణియాలో ఒక్కొక్కరు మరణించారు. బిహార్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం ఒక్క జులైలోనే పిడుగుపాటు కారణంగా 50 మంది మరణించారు. అనధికారికంగా ఈ మరింతగా ఉండొచ్చు. శుక్రవారం పాట్నాతో పాటు పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. కిషన్‌గంజ్, అరారియా జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. తరారీ పోలీస్ స్టేషన్ పరిధిలో 22 మంది విద్యార్థులు ఉన్న పాఠశాల గదిపై పిడుగుపడింది. ఈ ఘటనలో విద్యార్థులంతా గాయపడ్డారు. వారిని సదర్ ఆసుపత్రిలో చేర్పించారు. అత్యధికంగా కిషన్‌గంజ్ జిల్లాలోని బహదుర్‌గంజ్ బ్లాక్‌లో గురువారం 112.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాట్నాలో52.8 మిమీవర్షం కురిసింది.త్రివేణి బ్లాక్‌లో 102.0 మిమీ, గౌనాహాలో 55.4 మిమీ, పశ్చిమ చంపారన్ జిల్లాలోని లౌరియాలో 42.6 మిమీ, బెగుసరాయ్‌లోని సాహెబ్‌పూర్ కమల్‌లో 76.4 మిమీ, అరారియాలోని నర్పత్‌గంజ్‌లో 60.2 మిమీ, రోహ్తాస్‌లోని సంఝౌలీలో 43.2 మి.మీ, లఖిసరాయ్‌లోని సూర్యగర్హాలో 42.8 మిమీల వర్షపాతం నమోదైంది.

## జగన్‌పై హత్యాయత్నం కేసు నమోదు

**అమరావతి:**ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం జగన్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. ఉండి టిడిపి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ పెట్టిన ఘటనలో ఈ కేసును నమోదు చేశారు. సెక్షన్ 120బి, 166, 167, 197, 307, 326, 465, 508 (34) కింద కేసు నమోదు చేశారు. రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు జిల్లా నగరంపాలెం పిఎస్‌లో కేసు నమోదయింది. కస్టడీ సమయంలో తనపై హత్యాయత్నం చేశారని రఘురామకృష్ణంరాజు తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కేసులో జగన్‌ను ఎ3గా పోలీసులు పేర్కొన్నారు. ఎ1గా సిఐడి మాజీ డిజి సునీల్ కుమార్, ఎ2గా మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు, ఎ4గా అప్పటి సిఐడి అడిషనల్ ఎస్‌పి విజయపాల్, A5గా డాక్టర్ ప్రభావతిలను చేర్చారు. వీరితో పాటు మరికొందరి పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారు. జగన్ అధికారం కోల్పోయాక నమోదైన తొలి కేసు ఇది. 2021 మే14 జరిగిన ఘటనపై నిన్న రఘురామరాజు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. జగన్ మోహన్ రెడ్డి ఒత్తిడి మేరకే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని వెల్లడించారు. కస్టడీలో తనను తీవ్రంగా హింసించారని, తనకు బైపాస్ సర్జరీ జరిగిందని చెప్పినప్పటికీ, తన ఛాతీపై కూర్చొని తనను చంపడానికి ప్రయత్నం చేశారని, ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని కొట్టారని ఆరోపించారు. తనకు చికిత్స చేసిన జిజి హెచ్ డాక్టర్ ప్రభావతిపై కూడా ఆయన ఫిర్యాదులో చేశారు. పోలీసుల ఒత్తిడితో తప్పుడు మెడికల్ రిపోర్టులు ఇచ్చారని వెల్లడించారు. జగన్‌ను విమర్శిస్తే చంపుతామని సునీల్ కుమార్ బెదిరించారని వెల్లడించారు. తనను అక్రమంగా అరెస్టు చేసి వేధించారని, ఐదుగురు ఆగంతుకులతో దారుణంగా హింసించి, వీడియో తీసి అప్పటి సిఎం జగన్ మోహన్ రెడ్డికి చూపించారని రఘురామకృష్ణరాజు తెలిపారు. తప్పుడు రిపోర్టు కోసం డాక్టర్లను కూడా మార్చేసిన పరిస్థితి నెలకొందని, అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని ఆయన వెల్లడించారు. జగన్, సునీల్ ఇద్దరూ కలిసి తనపై కుట్ర పన్నారని ఆరోపించారు. ఎంతటి వారైనా తప్పు చేస్తే శిక్ష తప్పదనేది రుజువవుతుందని తెలిపారు. తనపై కేసు నమోదుపై సిఐడి మాజీ డిజి సునీల్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'సుప్రీం కోర్టులో మూడేళ్ల నడిచి సాక్ష్యాత్తూ సుప్రీంకోర్టు తిరస్కరించిన కేసులో కొత్తగా ఎఫ్‌ఐఆర్ వేయడాన్ని ఏమనాలో మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను' అని అన్నారు.

# మోదీ ప్రభుత్వం మనుగడ కష్టమే..!

### పవార్, ఉద్ధవ్‌లతో దీదీ భేటీ



**ముంబయి:** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కారు అస్థిరంగా ఉందని, అది పూర్తికాలం అధికారంలో కొనసాగదేమోనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. శుక్రవారం మహారాష్ట్ర రాజధాని ముంబయికి చేరుకున్న మమత.. ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్, రాష్ట్ర మాజీ సిఎం, శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రేలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఇద్దరితో దీదీ సమావేశం కావడం ఇదే తొలిసారి. ఈ మూడు పార్టీలూ 'ఇండియా' కూటమిలో భాగంగా ఉన్నాయి. తొలుత ఉద్ధవ్ థాక్రేను ఆయన నివాసం 'మాతోశ్రీ'లో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశ రాజకీయాల విషయంలో ఆట ఇప్పుడే మొదలైందన్నారు. జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యాదినం'గా కేంద్రం ప్రకటించడంపై స్పందిస్తూ.. తాము ఎమర్జెన్సీకి వ్యతిరేకమని, ప్రధాని మోదీ హయాంలోనే అత్యయిక పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. మూడు కొత్త నేరన్యాయ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు ఎవరినీ సంప్రదించలేదని ఆరోపించారు. పెద్ద సంఖ్యలో ఎంపిలు సస్పెన్షన్‌కు గురైన సమయంలో వాటిని ఆమోదించారని విమర్శించారు. ప్రస్తుతం ఈ కొత్త చట్టాల విషయంలో చాలామందిలో ఆందోళన నెలకొందని చెప్పారు. బెంగాల్‌లో 'ఇండియా' కూటమి పరిస్థితులపై దీదీ మాట్లాడుతూ.. లెఫ్ట్ ఫ్రంట్‌తో పోరాడి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టిఎంసి) అధికారంలోకి వచ్చిందని, ఈ నేపథ్యంలో స్థానికంగా సిపిఎంతో సర్దుబాటు సాధ్యం కాదన్నారు. రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (యుబిటి) తరఫున ప్రచారం చేస్తానని వెల్లడించారు. అనంతరం శరద్ పవార్‌ను కలిశారు. ఇదిలా ఉండగా.. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో మహారాష్ట్రలో 'ఇండియా' కూటమి మెరుగైన ఫలితాలు సాధించింది. ఇదే ఉత్సాహంతో రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు ఈ కూటమిలోని ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన (యుబిటి), కాంగ్రెస్‌లు సన్నద్ధమవుతున్నాయి.

## ఆమెను ఏమి అనొద్దు.. నొప్పించొద్దు : రాహుల్



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పట్ల పెద్ద మనసు చూపారు. దయచేసి ఎవరూ కూడా ఆమె పట్ల తప్పుడు వ్యాఖ్యలకు దిగరాదని, నాస్టీగా ఉండరాదని సామాజిక మాధ్యమంలో పిలుపు నిచ్చారు. ఇరానీ 2019 లోక్‌సభ ఎన్నికలలో ఇరానీ అమేథీలో రాహుల్‌ను ఓడించారు. అయితే ఈసారి ఎన్నికల్లో అమేథీలో ఓటమి పాలయ్యారు. ఎన్నికలల్లో గెలుపోటములు సహజం అని, ఇది జీవితంలోనే జరుగుతున్నప్పుడు రాజకీయాల్లో సర్వసాధారణం అని రాహుల్ స్పందించారు. అమేథీ నుంచి ఓడిన ఇరానీ తన అధికారిక నివాసం ఖాళీ చేసిన దశలో సామాజిక మాధ్యమంలో పలు వివాదాస్పద వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందించారు. స్మృతి ఇరానీ పట్లనే కాకుండా ఆ మాటకొస్తే ఏ నేత పట్ల కూడా అనుచిత వ్యాఖ్యలకు దిగరాదని ఆయన కోరారు. ఇతరులను అవమానించడం, వేధించడం అనేవి నిజానికి వీటికి పాల్పడ్డ వారి బలహీనతలను చాటుతాయి తప్పితే బలాన్ని కాదని వివరించారు. రాహుల్ ఇప్పుడు ఇరానీ పట్ల ఎందుకు ఇంత ఔదార్యతను చాటారనేదానికి సరైన కారణం పలు ఊహాగానాలకు దారితీసింది. అయితే ఇదంతా కూడా ఆయన తరచూ చెపుతోన్న మెహబ్బత్ కీ దుకాణ్ వైఖరి, రాజకీయాలలో కొత్త బ్రాండ్‌కు తార్కాణమని కాంగ్రెస్ వారు అభిప్రాయపడ్డారు.

## జాతీయ రహదారి'ని మీరెలా అడ్డుకుంటారు..?: సుప్రీంకోర్టు ప్రశ్న

**న్యూఢిల్లీ :** హర్యానాలోని అంబాలా సమీపంలో శంభూ సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అడ్డుకట్టల్ని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఒక హైవేను అడ్డుకునేందుకు రాష్ట్రానికి ఏ అధికారం ఉంది అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైతు ఉద్యమం సందర్భంగా 'చలో ఢిల్లీ'ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బారికేడ్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వాటిని వారంలోగా తొలగించాలని పంజాబ్‌—హర్యానా హైకోర్టు కూడా బుధవారం ఆదేశించింది. ఫిబ్రవరిలో ఖనౌరీ సరిహద్దు వద్ద హర్యానా పోలీసులు, రైతుల మధ్య జరిగిన ఘర్షణల్లో యువ రైతు శుభ్‌కరణ్ సింగ్ మృతి చెందారు. ఆయన మృతిపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని మార్చి 7న హైకోర్టు నిర్ణయించింది. దీన్ని సవాలు చేస్తూ హర్యానా దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. హైకోర్టు జారీ చేసిన బారికేడ్ల తొలగింపు ఆదేశాలనూ సవాల్ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. 'హైవేను ఒక రాష్ట్రం ఎలా దిగ్బంధిస్తుంది? ట్రాఫిక్‌ను నియంత్రించడం దాని బాధ్యత. జాతీయ రహదారిని తెరవండి.. కానీ, రాకపోకలను నియంత్రించండి' అని జస్టిస్ భూయాన్ ఆదేశించారు. 'మీరు హైకోర్టు ఆదేశాలను ఎందుకు సవాల్ చేయాలనుకుంటున్నారు? రైతులూ ఈ దేశ పౌరులే. వారికి ఆహారం, మంచి వైద్యం అందించండి. వారు వచ్చి నినాదాలు చేసి, తిరిగి వెళ్లిపోతారు' అని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

బహుశా మీరు రోడ్డు మార్గంలో ప్రయాణించరేమో! అని ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి వ్యాఖ్యానించగా.. తాను అదే దారిలో రాకపోకలు సాగిస్తానని బదులిచ్చారు. అయితే.. మీకూ ఈ ఇబ్బందుల గురించి తెలిసే ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. తదుపరి చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని హరియాణా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## ప్రత్యేక హోదాపై బీహార్‌లో రాజకీయ దుమారం




**పాట్నా :** బీహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్‌పై రాష్ట్రంలోని అధికార ఎన్‌డిఎ, ప్రతిపక్ష మాహాగట్‌బంధన్ ఒకరిపై ఒకరు కత్తులు దూసుకున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సెషన్ ప్రారంభం నాటికి బీహార్‌కు ప్రత్యేక హోదా అంశం జోరందుకోనున్నట్లు కనిపిస్తుంది. కాగా, రాష్ట్రంలోని ప్రతిపక్షాల కూటమిలో భాగమైన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ బిజెపి—జెడి(యు) కూటమిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మిత్రపక్షంపై ఆధారపడి ఉన్నప్పటికీ జెడి(యు) లేవనెత్తిన డిమాండ్‌ను బిజెపి అంగీకరించకపోవడం కంటే పెద్ద హాస్యాస్పదం ఉండదని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు) గత నెలలో జరిగిన తన జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రత్యేక కేటగిరీ హోదా లేదా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ రూపంలో తగిన సహాయం కోరుతూ తీర్మానాన్ని ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మీరా కుమార్ జెడియు అధిష్టాన్‌పై మండిపడ్డారు. ప్రధాని మోదీ మిత్రపక్షాలను గౌరవించాలని సూచించారు. అయితే ఇండియూ కూటమి ఏర్పాటుకు సహకరించిన సిఎం, ఈ ఏడాది జనవరిలో తిరిగి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో చేరారు. ప్రత్యేక హోదా డిమాండ్‌ను కాంగ్రెస్ నేతృత్వంలోని గత యుపిఎ ప్రభుత్వం విస్మరించిందని, మోడీ బీహార్‌కు తగిన న్యాయం చేస్తారని రాష్ట్ర మంత్రి, జెడి(యు) సీనియర్ నేత శ్రవణ్ కుమార్ అన్నారు. అంతకు ముందు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎన్‌డిఎ భాగస్వామి లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) కూడా ప్రత్యేగా హోదా డిమాండ్‌కు మద్దతుగా ముందుకు వచ్చింది. ఆ పార్టీ ఎంపి అరుణ్ భారతి పిటిఐతో మాట్లాడుతూ 'మా పార్టీ మొదటి నుండి బీహార్‌కు ప్రత్యేక హోదాకు మద్దతుగా ఉంది. ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ రూపంలో కొంత సహాయం చేస్తామని మేము విశ్వసిస్తున్నాము' అని అన్నారు. ఆర్‌జెడి ఎమ్మెల్యే భాయి వీరేంద్ర మాట్లాడుతూ.. కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ బిజెపి, జెడి(యు)లు అధికారాన్ని పంచుకుంటున్నాయని, ఇంకా అవసరమైన చర్యలు తీసుకోకుండా డిమాండ్లు లేవనెత్తుతున్నారని, ప్రజలను మూర్ఖులుగా భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. 2000లో బీహార్‌ను విభజించినప్పుడు ప్రత్యేక హోదా డిమాండ్‌ను మొదట రబ్రీ దేవి ప్రభుత్వం లేవనెత్తిందని ఎత్తి చూపారు.

## రైళ్లలో 92 కోచ్‌లు పెరిగాయ్



**న్యూఢిల్లీ :** జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి సౌకర్యార్థం భారతీయ రైల్వే సుదూర ప్రాంతాలకు వెళ్లే 46 రైళ్లలో 92 కొత్త జనరల్ కేటగిరీ కోచ్‌లను పొడగించింది. ఈ మేరకు రైల్వే శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. బెంగుళూరు సిటీ బెలగావి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ హుబ్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ముంబయి బెంగళూరు ఉదయన్ ఎక్స్‌ప్రెస్, ముంబయి అమరావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గౌహతి లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్, గౌహతి జమ్ము తావి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లలో కోచ్‌లు పెరిగాయ్. మరో 22 రైళ్లలో కూడా త్వరలో జనరల్ క్లాస్ కోచ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని 2024—25, 2025—26లో మరో 10 వేల నాన్‌ఎసి కోచ్‌లను తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఇటీవలే ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024—25) 4,485 నాన్‌ఎసీ, 2025—26లో మరో 5,444 కోచ్‌లను ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. భారతీయ రైల్వే 2,605 జనరల్ కోచ్‌లను తయారు చేయడానికి సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. వీటిలో అమృత్ భారత్ జనరల్ కోచ్‌లు కూడా ఉన్నాయి. ఎపి, తెలంగాణల్లో నడిచే 12 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా జనరల్ బోగీలు పెంచుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సింహపురి, గోదావరి, గౌతమి, ఫలక్‌నుమా, చార్మినార్, కొకనాడ, విశాఖ, కొండవీడు, భాగ్యనగర్ కాకినాడ, కాకినాడ షిర్డీ, కాకినాడ ఎల్టీటీ రైళ్లకు 2 అదనపు జనరల్ బోగీలు, మచిలీపట్నం ధర్మవరం రైలుకు ఒక బోగీని యాడ్ చేస్తున్నట్లు తెలిపింది. ఈ రైళ్లలో ఇప్పటికే రెండు జనరల్ బోగీలు ఉండగా.. నవంబర్ నుంచి 4 కోచ్‌లతో ఇవి నడవనున్నాయి.